నవశక్తి

Vol. 2, no. 13

(Mar. 15, 1939)

బెజవాడ, 1939

Record no. 682

Navaśakti

Vol. 2, no. 13

(Mar. 15, 1939)

Bejavāḍa, 1939

Record no. 682

Regd. No

నవశక్తి

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారపత్రిక

సంపుటం 2 } బుధవారం 15-3-39 బెజవాడ {సంచిక 13



SUBHAS CHANDRA BOSE

"మనలోఉన్న భేదాలు మరచిపోయి, స్వాతంత్ర్య సమరంలో మనకున్న బలాన్ని, శక్తినీ, పూర్తిగా వినియోగించామా — బ్రిటిష్ సామ్రాజ్యంమీద మనం తీయబోయే దెబ్బకు ఎదురుండదు....

నేటి మన అనుకూల పరిస్థితుల్ని పూర్తిగా ఉపయోగించుకొని, రాజకీయ దూరదృష్టిని ప్రదర్శించ గలుగుతామో? లేక, మన దేశచరిత్రలో ఎన్నడూ లభించని యీ సదవకాశాన్ని నేడు జారవిడుస్తామో?"

వ శక్తి

చందా వివరాలు

సంవత్సర చందా	రూ 3—0—0
అర్థ సంవత్సర చందా	1—10—0
విడిప్రతి	0—1—0

బర్మా రేట్లు

సంవత్సర చందా	రు 5—0—0
విడి ప్రతి	0—1—6

ప్రకటన రేట్లు

"కాలం" వెడల్పు 2" (2 అంగుళాలు)

20 అం॥ లోపల ప్రతి అంగుళానికి	రూ.	0—6—0
20" అం॥ పైన	..	0—4—0
100" అం॥ పైన	..	0—3—0
పేజీ	రు 10—0—0 లు	
½ పేజీ	6—0—0 లు	
¼ పేజీ	3—0—0 లు	

షరా:—ఈ రేట్లుపైన కమిషన్లు. డిస్కౌంటులు ఇవ్వబడవు. రు 0—8—0 లకు తక్కువ ప్రకటనలు తీసుకొనబడవు. నెలకగు దబ్బు ముందుగా ఇవ్వవలెను.

ప్రత్యేక చోటునకు, ప్రత్యేక రేట్లు.

* * *

	ఫిబ్రవరి నెల కోటా	చేర్పించినవి.
విశాఖపట్టణం	5	2
తూ. గోదావరి	30	4
ప. గోదావరి	50	12
కృష్ణా జిల్లా	50	31
గుంటూరు	30	18
నెల్లూరు	20	19
రాయలసీమ	10	4
నైజాం	10	1
ఇతర స్థలాలు	5	1
	210	92

విదేశాలలో మా ఏజెంట్లు

జి. కాశిరావు, 209 ఫేయర్ స్ట్రీట్ రంగూన్.

వర్కర్సు బుక్ షాప్, 14 కింగ్సు స్ట్రీట్, లండన్. W. C. 2.

లీగ్ ఆవ్ ఇండియాస్ ఫ్రీడం, 112 ఈస్ట్ 19 వ స్ట్రీట్, న్యూయార్కు సిటీ.

పాలస్తైన్

రచయిత:—తుమ్మల వెంకట్రామయ్య

గ్లేజు కాగితం. చక్కని ముద్రణ.

80 పేజీలు—2 అణాలు

పంపువారు 3 అణాల తపాల బిళ్లలు పంపవలెను.

నవశక్తి కార్యాలయం,
గవర్నర్‌పేట, బెజవాడ.

ది బలరామా ఆయుర్వేదిక్ ఫార్మశీ వారి

స్త్రీజనామృతమ్

స్త్రీలకుగల తెలుపు, ఎరుపు, వ్యాధులు నివారింపజేయుటకు అమూల్యమైనది. నీరసము, గుండెదడ, సంతాన నష్టము పోగొట్టి మంచి పుత్సాహము, సత్సంతానము గలిగింపగలదు. గుణమున కొక్క సీసాచాలును. సీసా రు 2—0—0 లు. కేటలాగు, కేలండరు పుచితము.

పలయువారు:— **ఉరిటి బ్రదర్సు**
వైద్యశాఖ, ఏలూరు, (ఆంధ్రా)

ఒక రూపాయికి 7 గ్రంథాలు.

తిరుగుబాటు (నాటకం)	0—4—0
మాలపిల్ల (నవల)	0—4—0
క్రాంతి గీతాలు	0—4—0
మన సంపద	0—1—0
కమ్యూనిజానికే జయం	0—1—0
వలస దేశాల సమస్య	0—1—0
స్టాలిన్ - లడ్విగ్గుల సంభాషణ	0—1—6

ఒక రూపాయి M. O. ద్వారా పంపితే పోస్టు ఖర్చులు భరించి పంపబడతాయి.

ఆదర్శ గ్రంథ మండలి, ఎలమర్రు. (కృష్ణా జిల్లా)

ఆరోగ్యము—ఆనందము—బలము

ఇవి కలుగుటకు శుద్ధరక్తాభివృద్ధియే కారణము. రక్తక్షీణతవల్ల మానవులు నిస్సత్తువ, నిద్రలేమి, నరముల బలహీనత, ఆయాసము మొదలగు వ్యాధులచే పీడింపబడి, ప్రపంచ సౌఖ్య విహీనులగుదురు. అట్టివారికి "జీవామృతము" సేవనవలన పుష్కలమైన రక్తవృద్ధి, నరములకు పటుత్వము, వీర్యోత్సాహములు, సుఖానందములు లభించును.



జీవామృతము

అన్ని మందుల షాపులలోను దొరకును.

తయారు చేయువారు—

ఆయుర్వేదాశ్రమము మద్రాసు

స్టాకిస్టు:—
బెజవాడ: బెజవాడ మెడికల్ స్టోర్సు.
ఏలూరు: రామకృష్ణ మెడికల్ స్టోర్సు.

నవశక్తి
మొదటి సంవత్సర వాల్యూమ్
కొద్ది ప్రతులే ఉన్నవి.
5 రూపాయలు
నేడే వ్రాయండి.

NATIONAL FRONT,

It is the Marxist Weekly Edited by Famous Indian Communists.
62 E. Girgaon Road:
Bombay 4.
Annual Subscription Rs. 4

ఆంధ్రవాణి

బెజవాడ నుండి వెలువడు ద్వైవారపత్రిక

హైదరాబాద్ సంస్థాన వార్తలను, స్వదేశీ సంస్థానాల ప్రజా ఉద్యమాలను గురించి తెలిసికోవాలంటే ఆంధ్రవాణి చదవాలి.

వివరాలకు:— మేనేజరు
'ఆంధ్రవాణి'
గవర్నరుపేట—బెజవాడ.

విద్యావనం

బాలబాలికలకు ఆదర్శ ప్రాయమైన పాఠశాల

వివరాలకు:—
అన్నాప్రగడ సరళాదేవి,
మంతెనవారిపాలెం,
(via) పొన్నూరు
గుంటూరు జిల్లా.

NEW AGE

Editor: S. V. GHATE

Are you yet going without the New Age? It is the only Marxist Monthly in India. You are missing a lot. It is within your reach as cheapest as you could desire.

Annual Subscription	Rs. 1-8-0
Single Copy	0-2-0

270 Triplicane High Road
Madras.

లక్ష్మీ ప్రావిడెంటు ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్, మచిలీపట్టణము.

కార్మికులకు, కర్షకులకు సులభముగా నుండు భీమా ప్రణాళికలు గలవు.

1. రు 50 లు మొదలు, రు 500 లు, వరకు భీమాచేయుటకు వీలగునట్లు, ప్రావిడెంటు ఇన్సూరెన్సు ప్రణాళికలు గలవు.
2. వైద్య పరీక్షతోను, లేకుండగను, భీమాచేయుట కవకాశము ఏర్పరుపబడినవి.
3. ఏజంట్లకు పంకపారంపర్య కమీషన్ పద్ధతులు గలవు.

ప్రావిడెంటు శాఖలో రు 250 లకు నెలసరి ప్రీమియము రు 1—0—0 మాత్రమే. వైద్య పరీక్ష లేదు.

కమీషను పద్ధతిమీదగాని, జీతముమీదగాని పనిచేయుటకు అన్ని ప్రాంతములకు ఏజంట్లుఆర్గనైజర్లు కావలెను.

వివరములకు—మేనేజింగు డైరెక్టరు పేర కంపెనీకి వ్రాయుడు.

సంపుటం 2

నవశక్తి

బుధవారం

సంచిక 13

15–3–39

సంపాదకవర్గం: మద్దుకూరి చంద్రశేఖరరావు (సంపాదకుడు). కంభంపాటి సత్యనారాయణ పుచ్చలపల్లి సుందరయ్య. తుమ్మల వెంకట రామయ్య.

త్రిపురీ కాంగ్రెస్

త్రిపురీ కాంగ్రెస్ అతి క్లిష్ట సమయంలో సమావేశ మయింది, సామ్రాజ్య వాదులు మనపై రుద్దనున్న ఫెడరేషను, విజృంభిస్తూన్న సంస్థాన ప్రజాఉద్యమాలను గురించి స్పష్టమైన కార్యక్రమం యిస్తుందని దేశం ఎదురు చూచింది.

అధ్యక్ష ఎన్నికానంతరం బోసుగారి మార్గానికి గాంధీయులు అవరోధం కలిగించక పైదొలగుతారని మహాత్ముడు సెలవిచ్చాడు. కాని గాంధీయులు ప్రతినిధుల క్యాంపులకు తిరిగి, అధికారం, పలుకుబడి, మొగమోటమి, గాంధీజీ పేరు వినియోగించి, ఎన్నికలో బోసుకు ఓటు చేసిన ప్రతినిధులలో కొందరిని తిరగదీయుటలో సఫలీకృతు లయ్యారు. తమపై ప్రజలకు విశ్వాస మున్నదనియు, ఆరోపణలు చేసినందుకు సంతాపం తెలుపుచూ ఒక తీర్మానం వల్లభ పంత్ గారిచే ప్రతిపాదింప చేసారు. ప్రజాస్వామిక సూత్రాలప్రకారం అధ్యక్షుడుగా బోసు ఎన్నుకోబడిన తరువాత వక్రమార్గాన కక్ష సాధించడానికో అన్నట్లు ఇట్టి తీర్మానాన్ని తేవడం వృధాకాలయాపనయే. గాంధీజీ కోరిక ప్రకారం వర్కింగు కమిటీని నియమించాలనడం ప్రజాతంత్ర సూత్రాలకు విరుద్ధం. గాంధీజీ కాంగ్రెసులో వున్నా లేకపోయినా, మహాత్ముడే అయినా ఒక వ్యక్తికంటే కాంగ్రెసు గొప్పది. కాంగ్రెస్ సోషలిస్టు నాయకులు చివరకు తాటస్థ్యం వహించి తమ నాయకత్వానికై ఎదురు చూచుచున్న తీవ్రవాదపక్షీయులకు ఆశాభంగం కల్గించారు. సోషలిస్టు నాయకులు అత్యంత అవసర సమయంలో వామపక్షానికి నాయకత్వం వహించి నడుపలేకపోయారు.

జాతీయ వాంఛను తెల్పు తీర్మానం, స్వాతంత్ర్య ఆశయాన్ని తెలుపుతూ రానున్న పోరాటానికి సిద్ధంగా వుండాలనీ, కాంగ్రెస్ మంత్రివర్గాల పని, బయట ప్రజాసామాన్య ఉద్యమాన్ని ప్రోత్సహించునదిగా ఉండాలన్నది. కాని జరుగవలసిన పని స్పష్టపరచలేదు. పోరాటానికి సన్నిద్ధం గావడానికి కార్యక్రమం యివ్వలేదు. కనీసం మెహరాలీ సూచించిన వాలంటీరుసైన్యాన్ని సమకూర్చాలను సవరణనుకూడ త్రోసిపుచ్చారు. స్పష్టమైన కార్యక్రమం యివ్వక ఏవో కొన్ని తీవ్రపదజాలంతో తీర్మానం చేసినపుడు కాంగ్రెసు యంత్రాంగాన్ని తమ స్వాధీనంలో వుంచుకొన్న గాంధీయులు, మితవాదులు, ఆచరణలో పెట్టరేమోనన్న సందేహం రాకమానదు.

సంస్థానాల విషయముపై తీర్మానముచూదాం. ప్రస్తుత మభివృద్ధిచెందిన ప్రజాపోరాటం, అందరిచే ఆక్షేపించబడిన హరిపురా తటస్థ తీర్మానం ఫలితంగానే నని తెల్పుతూంది. హరిపురా తీర్మానమూ, గాంధీయులూ నిరుత్సాహ పరచినప్పటికీ, సంస్థాన ప్రజా పోరాటం దానంతటదే అభివృద్ధి పొందినదన్న సత్యాన్ని త్రిపురీ తీర్మానం మరుగుపరుస్తూంది. బహుశః క్రిందటి యేడాది హరిపురా తీర్మానాన్ని—సోషలిస్టుల వాదనలు పెడచెవినిబెట్టి—బలపరచిన గాంధీయుల ప్రతిష్టకు భంగమనియెంచి ఇట్లు చేసియుండవచ్చు. లేనిచో హరిపురా తీర్మానం బోధించిన తాటస్థ్యాన్ని గాంధీజీ, పటేలులే ఉల్లంఘించి యుండగా హరిపురా తీర్మానాన్ని పొగడుటలో అర్ధమేమీ లేదు, ఇంతేగాక యీ తీర్మానం రాజకోట సమస్యపై మహాత్ముని ఉపవాసము ఏదో మహావిజయాన్ని సమకూర్చినట్లు సూచించుతోంది. ఠాకూర్ సాహెబుపై ప్రజలు జరుపుచున్న పోరాటాన్ని ఆపి, తాను ఉపవాసం మొదలిడి, సంస్థానాధీశులకు అండయైన సామ్రాజ్య ప్రతినిధి లిన్‌లిత్గో సలహాపై, ఠాకూర్ సాహెబు యిచ్చిన ఫర్మానా అర్ధం చెప్పడానికి, సామ్రాజ్యపు సొమ్ము తింటూన్న ఫెడరలు జడ్జీ చేతిలో నిడుడకు అంగీకరించుట; ఎటుల విజయమో, పరిష్కారమో మా కర్ధం కావడం లేదు. నిజం చెప్పవలసివస్తే యీ ఉపవాసం సమస్యను పరిష్కరించలేదు; త్రిపురీ కాంగ్రెసు దృష్టిని ముఖ్య సమస్యలనుండి మరల్చింది, ప్రజా పోరాటము ద్వారా గాని బాధ్యతాయుత ప్రభుత్వం రాదను సత్యాన్ని మరుగు పరచింది. అంతే! ఇక తీర్మానం సంస్థానాలలో జోక్యం కల్గించుకునే హక్కు కాంగ్రెసుకు ఉన్నదని చెబుతూంది. కాని నాయకత్వం వహించి నడపాలని నిర్ణయించలేదు. అంటే యీ తీర్మానం కాలానికి, అవసరాలకు వెనుకబడి వుందని చెప్పాలి.

కాంగ్రెసులోని కుళ్లు తొలగించాలను శ్రీ ప్రకాశగారి తీర్మానం ప్యాసయింది. దీనిపై చర్చలో తీవ్రవాదులు యిప్పుడున్న కుళ్లు మితవాదులు తమ అధికారాన్ని నిలబెట్టుకోడానికి స్వంత డబ్బుతో సభ్యులను చేర్పించుట ద్వారా వచ్చిందని స్పష్టపరచి వుండాలిసింది. అట్టి సవరణ ఉపపాదించి వుండాలిసింది.

ఈజిప్టు దేశ రాయబార వర్గము వచ్చుట త్రిపురీ కాంగ్రెస్ కొక ప్రత్యేకత, ప్రతినిధులకు స్వాగతమిస్తూ కాంగ్రెసు తీర్మానించింది.

అన్నిటికంటే విషాదకరమైన సంగతి కాంగ్రెసు రాజకీయఖైదీల విడుదలను గురించి తీర్మానించకపోవుట. బెంగాల్, పంజాబులలో యింకా వందలకొలది రాజకీయ ఖైదీలు క్రుగ్గుచున్నారు. గాంధిగారి సలహాపై ప్రభుత్వానికి పట్టుబడిన పృధ్వీసింగ్ యింకా జైలులోనే వున్నాడు—వాగ్దానం చేసినటుల గాంధిజీ వారి విడుదలకై ప్రయత్నించినటులే కన్పడదు. ఢిల్లీ జైల్లో రాజకీయ ఖైదీలు నిరశన వ్రతము చేస్తున్నారుకూడ. అట్టి యెడ జైళ్లలో క్రుగ్గుచున్న దేశసేవారాధకుల విడుదల విషయమై కాంగ్రెస్ కార్యక్రమం యివ్వకపోవుట, కనీసం తీర్మానించకపోవుట మన్నింపదగిన విషయం కాదు.

అటులే దేశంలో జరుగుచున్న సాంఘిక తగవుల గమనించిన కాంగ్రెసు, సాంఘిక సమస్యా పరిష్కారానికి కొన్ని సూచనలైన యివ్వలేకపోయింది. అల్పసంఖ్యాక సంఘాలలో ప్రత్యేక ప్రచారంచేయుట, ఉద్యోగాలు జన సంఖ్య ననుసరించి గ్యారంటీ చేయుట, మొదలగు వాటి ద్వారా సాంఘిక సమస్యా పరిష్కారానికి ప్రయత్నించి వుండాలసింది.

ప్రజలంతా త్రిపురీ కాంగ్రెస్ స్వాతంత్ర్య పోరాటానికి కార్యక్రమం, యిస్తుందని ఆశించారు. తీవ్రవాదులు, సోషలిస్టులు, కమ్యూనిస్టులు, రాయిస్టులు ఐక్యతతో వామ పక్షాన్ని నడపలేక పోవుటచే మితవాదులు సంపూర్ణ విజయం పొందారు. ప్రజలు ఆశించిన లీడ్; కార్యక్రమం కాంగ్రెసు యివ్వలేకపోయింది,

త్రిపురీ కాంగ్రెస్‌లో వామపక్షం పూర్తిగా విఫలమయిందనే చెప్పాలి. రాజీ కొరకు తీవ్ర ప్రయత్నాలు చేసి, సోషలిస్టులు బాధ్యత గలవారని యశం గడించుకొన్నా, విస్పష్టమైన కార్యక్రమం యివ్వలేకపోయారు. ఉపన్యాసాలలో ప్రస్తుతం అవలంబించబడుతున్న దిగజారుడుపాలసీతో తమకున్న భేదాలను, ఆచరణలో మితవాదులు చేయుచున్న అవక తవకలు స్పష్టపరచలేకపోయారు. అన్నిటికంటే విషాదకరమైనది మహాసభలో పంత్ తీర్మానం చర్చలో సోషలిస్టులు తటస్థులగుట. ఒక సంస్థలో వచ్చు రాజకీయ విభేదాలలో వ్యక్తుల విషయం కొంత—మనం కోరకపోయినా—మిళితం అవుతుంది. సోషలిస్టులమైన మనం వానినుండి దూరంగా వుంటామని మడిగట్టుకోవడంతో మన విధి నెరవేరదు. వ్యక్తులను దాటి, రాజకీయ విధానంలో వున్న భేదాన్ని గమనించి నడచుటలోనే వుంది గొప్పతనం. బోసు కాంగ్రెసును ముందుకు తీసుకుపోయే స్పష్టమైన కార్యక్రమం యిచ్చాడు గాన అతన్ని బలపరచుట సోషలిస్టుల కర్తవ్యం. అటుల చేయక తటస్థులవడంతో వారు వామ పక్షానికి నాయకత్వం వహించలేకపోయారు. ఇతర తీవ్రవాదుల విశ్వాసాన్ని గోల్పోయారు,

మొత్తంపై త్రిపురీ కాంగ్రెస్, ఆశించినటుల దేశానికి ముఖ్యసమస్య లన్నిటిలోను సరియైన పంథా చూపలేకపోయింది. స్పష్టమైన కార్యక్రమం యివ్వలేకపోయింది. అధ్యక్షుని ఎన్నికతో ప్రారంభమైన గడబిడలోనే త్రిపురీ కాంగ్రెసు గడచిపోయింది.

వివిధ రాజకీయాలు

కాశీపట్నములో నిరంకుశత్వ తాండవం

కాశీపట్నం రైతులు చిరకాలంనుండి వంశపారంపర్యంగా అనుభవిస్తున్న చేపలు పట్టుకొనే హక్కును కాశీపట్నం జమీందారు అపహరించి, అభూముల్ని యితర రైతులకు విక్రయించే సందర్భములో రైతులు యీ నెల 7 వ తేదీ మొదలు 10 వ తేదీ వరకు వరుసగా నాలుగురోజులు సత్యాగ్రహ మొనర్చి డా॥ పట్టాభి, రాజగోపాలాచారిగార్ల కోరికపై తాత్కాలికంగా విరమించారు. సత్యాగ్రహ మొనర్చిన దాదాపు 100 మంది స్త్రీ పురుషుల్ని పోలీసులు ఎరస్టు చేయడమే గాక, రూల్సుకి వ్యతిరేకముగా వారి మీద అనేక అమానుషకృత్యాలు జరిపారు. శాంతముగా సత్యాగ్రహ మొనర్చిన ప్రజలపై లాఠీచార్జీ చేయుట. గర్భిణీస్త్రీలను —90 యేండ్ల వృద్ధులను క్రూరముగా బాదుట. స్త్రీలను బండబూతులతో అవమానించుట. విచారణసమయంలో అబద్ధపు కాగితాల మీద దౌర్జన్యంగా సంతకాలు చేయించుకొనుట. పాలుతాగే పసిపిల్లల్ని తల్లులతో జైళ్ళకు తీసుకొనిపోకుండా చేయుట. జాతీయ పతాకాలను కాలికింద నలిపి అవమానపరచుట—ఇట్టి నిరంకుశ కృత్యాలు పూర్వపు జస్టిస్ మంత్రుల కాలంలో జరిగినప్పుడు అంత యెక్కువ ఆశ్చర్యము ఉండేది కాదుగాని, నేటి కాంగ్రెసు పరిపాలనలో కూడా జరగడము ఘోరము.

రెవిన్యూ మంత్రి ప్రకాశంగారు కాశీపట్టణంవెళ్ళి దెబ్బలతిన్న రైతులను విచారించారని తెలుస్తూవుంది. వారు రైతులకు జరుగుతూన్న అన్యాయాన్ని గమనించి, నిరంకుశత్వంగా ప్రవర్తించిన ఉద్యోగులపై చర్య గైకొనునట్లును రైతుల అనాది సిద్ధంగా అనుభవించుతున్న హక్కులు కాపాడబడునట్లు చూస్తారని ఆశిస్తాము.

యీ విషయమై ఆంధ్ర పత్రిక "అటుల గాకుండ దౌర్జన్య పూరితములగు కార్యములకు గడంగుటయు, దానిపై శాంతి భంగము కాకుండ కార్య నిర్వాహకోద్యోగులు కట్టు దిట్టములు జేయుటయు" జరిగిందని వ్రాస్తూ బహిరంముగా ఆధారంలేని విమర్శన గావించడము శోచనీయం. "శాంతికి భంగము కాకుండా" చూచే అదుర్దా ఈఆంధ్ర పత్రికకు కూడా ఎందుకు పట్టిందో బోధపడ్డం లేదు. కాశీపట్నపు సత్యాగ్రహాన్ని గురించి స్థానిక శాసన సభ్యులు, కాంగ్రెస్ సేవకులు, పత్రికలలో చేసిన ప్రకటనలు చూచియూ కూడా, ఆంధ్రపత్రిక యీ విధముగా ప్రజలే "దౌర్జన్య పూరితములగు కార్యములకు" దిగారని అసత్యాన్ని వ్రాయడము క్షంతవ్యము కాదు.

వార్కీగారు—జనరల్ ఫ్రాంకో

మదరాసు నగరంలో ఆమధ్య ప్రారంభించబడిన త్రిశతాబ్దోత్సవానికి అప్పుడు విద్యాశాఖ మంత్రికి కార్యదర్శిగా ఉండిన శ్రీయుత వార్కీగారుఅత్యుత్సాహముతోసన్నాహాలు సాగించి,ఇండియాలో బ్రిటిష్ సామ్రాజ్యానికి పునాదులు వేసిన ఈస్టుఇండియాకంపెనీకి జోహారులు చేశారు. ఆంధ్ర రాష్ట్ర, తమిళనాడ్ కాంగ్రెసు అధ్యక్షులు ఎంత మందలించినా వినలేదు. మంత్రిగా నియమించిన తర్వాత మాత్రం ఈయన ఆ మహా పవిత్రోద్యమాన్ని విరమించుకోవలసివచ్చింది.అయితే, మంత్రిగా వచ్చాక వార్కీగారు మరొక మెట్టు పైకి వెళ్లారు. అఖిల భారత కాంగ్రెస్ సంస్థయొక్క ప్రధాన తీర్మానాలనే ఉల్లంఘించ నమకట్టారు. ఫైజ్‌పూర్, హరిపూర్ కాంగ్రెసు మహా సభలలో ఏకగ్రీవముగా ప్యాసయిన తీర్మానము ప్రకారము, స్పెయిన్ స్వాతంత్ర్య పోరాటములో పాల్గొంటూన్న ప్రజల్ని భారతీయులు అభినందించడము, ఆపోరాటాన్ని ధ్వంసము చేయ నమకట్టిన ఫ్రాంకో యిత్యాదుల్ని ఖండించడం చేయాలి. కాని, కాంగ్రెస్ టిక్కెట్ మీద నేడు మంత్రిగా ఉన్న వార్కీగారికి యీ తీర్మానము రుచించలేదు. ఆవిషయంకూడా మొన్ననే, ఫ్రాంకో జయించిన తర్వాతనే, ప్రజలకి తెలిసింది. "ప్రపంచ శాంతిని అభిలషించే ప్రతి వ్యక్తి జనరల్ ఫ్రాంకో యొక్క విజయాన్ని చూచి సంతోషించాలి" అంటూ ఈనెల 5 వ తేదీని వార్కీగారు ప్రకటన ఒకటి చేశారు. "జనరల్ ఫ్రాంకో మతాన్ని, శాంతి—భద్రతల్నీ, ప్రజాస్వామ్య పరిపాలనను రక్షించేవా"డని కూడా వార్కీగా రన్నారు. కాంగ్రెస్ తీర్మానాల్ని బహిరంగంగా ఉల్లంఘిస్తూ, ఫేసిస్టు రక్త పిపాసుల రాక్షస కృత్యాల్ని సమర్థించే యిట్టి వ్యక్తులు దేశానికి ఎంత హానికరంగా పరిణమిస్తారో ప్రజలు ఇప్పటినుంచీ జాగ్రత్తతో కనిపెట్టి యుండాలి.కాంగ్రెసు బురఖాతో యిట్టి ఫేసిస్టు అనుకూల చర్యలనుసాగనివ్వరాదు.

మదరాసు అమ్మకపు పన్నుల చట్టం

మదరాసు రాజధాని ఆదాయవ్యయ పట్టికలోని తరుగును నింపడానికి,ప్రజోపయోగకార్యాలకు ఖర్చుపెట్టబోయే సొమ్మును రాబట్టడానికి మదరాసు ప్రభుత్వం సరకుల అమ్మకాలమీదకొత్తగాపన్నువిధించనిశ్చయించుకొంది. ఏవర్తకపు సరకైనా బజార్లలో విక్రయించబడినప్పుడు ప్రభుత్వం కొంతపన్ను వసూలుచేస్తుంది. మద్యపాన నిషేధం, పన్నుల రెమిషన్, మొదలైన ప్రజోపయోగ కార్యాలవల్ల కాంగ్రెసు ప్రభుత్వానికి కొన్నిలక్షల రూపాయలు నష్టం వచ్చింది ఈ నష్టాన్ని నింపడానికి కొత్త పన్నులు విధించడం తప్ప మరొక మార్గంలేదు. కాబట్టి, ఎక్కువగా భరించ సామర్థ్యం గల ప్రజల మీద కొన్ని కొత్త పన్నులు విధించడం ఏ మాత్రం తప్పుకాదు. ప్రతి నాగరీక ప్రభుత్వములోను యీ సూత్రాన్ని పురస్కరించుకొనే పన్నుల విధానము ఉంది. కాని, మన రాజధానిలో ఈ కొత్తపన్నుకు వ్యతిరేకముగా తీవ్రమైన ఆందోళన బయల్దేరింది. నెల్లూరు, రాజమండ్రి, బందరు, కాకినాడ, కోయంబత్తూరు, తిరునవ్వేలి, మదరాసు మొదలయిన పట్టణాలలో వర్తకులంతా హర్తాళ్ చేశారు. "రాజధాని యొక్క వ్యాపార,పరిశ్రమలను ఈకొత్తపన్ను ధ్వంసము చేస్తుం"దని మదరాసుయందలి దక్షిణ భారత వ్యాపార సంఘం, తోలు వ్యాపారస్థుల సంఘం, బట్టల వ్యాపారస్థుల సంఘము, ధాన్యం వ్యాపారస్థుల సంఘం మొదలయిన సంస్థ లెన్నో ఖండిస్తూ మదరాసు ప్రభుత్వానికి మెమొరాండములు పంపించాయి.మధుర,ట్యూటికొరిన్, రాజపాళయం, తిరుచినాపల్లి, తాడివపం మొదలయిన ప్రదేశాల్లలో కూడా ఇదేవిధముగా విపరీతమైన ఆందోళన బయల్దేరింది.

మదరాసు మంత్రివర్గము దీన్ని లక్ష్యము చేయక. ధైర్యమైన విధానాన్ని అవలంబించవలసి యున్నది. బీహార్, అస్సాం రాష్ట్రాలలో మాదిరిగా వ్యవసాయదారుల ఆదాయము మీద ఇన్‌కంటాక్సు పద్ధతిని పన్ను విధించవచ్చు. లేక, వారసత్వపు టాస్తుల మీద కూడా పన్ను విధించడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు హక్కు ఉంది. కాని, కేంద్ర ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు సంపూర్ణాధికారము లేనంతవరకు రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయము తక్కువగానే ఉంటుంది. కనుక మన మంత్రులు ఫెడరేషన్ ప్రతికూలోద్యమానికి ప్రత్యక్ష సహాయం చేయవలసి యుంటుంది.

బర్మాలోపత్రికాశాసనపు రద్దు

1935 వ సంవత్సరపు నూతన ఇండియా రాజ్యాంగ చట్టము అమల్లోకి వచ్చాక ఇండియాలో ఒక్క సరిహద్దు రాష్ట్రంలో తప్ప, మిగిలిన ఏ కాంగ్రెసు రాష్ట్రంలో గాని, నిర్బంధ శాసననాలను రద్దు చేసే ప్రయత్నము జరగలేదు. కాని, బర్మాలో మాత్రము ప్రెస్ ఎమర్జెన్సీ పవర్సు ఆక్టు అనే పత్రికా శాసనాన్ని రద్దు చేస్తూ ప్రతిపాదించబడిన తీర్మానము అత్యధిక సంఖ్యాకులచే ఆమోదించబడింది. మంత్రులు సహితం వోటింగులో తటస్థంగా ఉన్నారట. "నిర్బంధ శాసనాలను రద్దు చేయడములో బర్మా మార్గదర్శకం అయిం" దని పత్రికలన్నీ తెలియజేస్తున్నాయి.

బర్మాలో యీమధ్య వెల్లివిరిసిన ప్రజా ఉద్యమాన్ని అరికట్టడానికి అక్కడి ప్రభుత్వము జరిపిన నిర్బంధ విధానము శాసన సభ్యులలో తీవ్ర అసంతృప్తికి కారణమై, ప్రజానుకూల చట్టాలు, తీర్మానాలు, అనేకము ప్రతిపాదించబడి, ఆమోదించబడుతున్నాయి. అట్టివాటిలో ఈ తీర్మానం ఒకటి. తమ ఎన్నికల ప్రణాళికలో బర్మా ప్రజలకు ఎన్నెన్నో వాగ్దానాలు చేసి కొత్తగా అధికారానికి వచ్చిన మంత్రివర్గ సభ్యులు యీ తీర్మానానికి వ్యతిరేకముగా ఓటు చేయలేకపోయారు. అయితే, బర్మా గవర్నరు కూడా ఈ తీర్మానికి ఆమోదంతెలిపి, ప్రజాభిప్రాయాన్ని మన్నిస్తాడో లేక తన చేతులోఉన్న "వీటోయింగ్" అధికారాన్ని వినియోగిస్తాడో చూడవలసి యుంది. వినియోగిస్తే ఆశ్చర్యము లేదు.

బెంగాల్‌లో కొత్త నిర్బంధ శాసనాలు

ఈవిధంగా బర్మాలో ప్రజాభిప్రాయంయొక్క ఒత్తిడి బర్మా మంత్రుల్ని, శాసన సభ్యులను అభివృద్ధికరమైన మార్గాలకు తిప్పుతోంటే, బెంగాల్‌లో హక్ మంత్రివర్గం రోజు రోజుకీ కొత్త నిర్బంధ శాసనాలు ప్రవేశపెట్టుతూంది. బెంగాల్, పబ్లిక్ సెక్యూరిటీ ఆక్టు అమెండుమెంటు బిల్లు ఒకటీ, కల

కత్తా సబర్బన్ పోలీసు బిల్లు ఒకటీ బెంగాల్ శాసన సభలో హోం మినిష్టరు నజీముద్దీన్ ప్రతిపాదించబోతున్నాడు. మొదటి బిల్లు ప్రకారం, ఏ పోలీసు అధికారి అయినా సరే (కానిస్టేబిల్‌కు పై తరగలకి చెందినవాడు) ఎట్టి సమయంలోనైనా ప్రతి యింట్లోను ప్రవేశించడానికి అధికారం కలిగియుంటాడు. కొద్దిమందితో గూడిన ప్రయివేటు సమావేశాలకు సహితం వారు హాజరు అయి, నోట్సు తీసుకొని, కోర్టులలో దాన్ని సాక్ష్యంగా దాఖలు చేయవచ్చు. రెండో బిల్లు ప్రకారం. కలకత్తా నగరంలో జరిగే బహిరంగ సమావేశాలలో సన్మాన సంఘంవారు పోలీసు రిపోర్టర్లకు ప్రత్యేకపు రేట్లతో టిక్కెట్లు ఏర్పాటు చేసే అధికారం రద్దుచేయబడుతుంది. ఈ రెండు బిల్లులు బెంగాల్ పౌరుల సామాన్య పౌరసత్వపు హక్కుల్ని అపహరిస్తున్నాయి ప్రజాభిప్రాయాన్ని గడ్డిపోచతో సమానంగా చూచే బెంగాల్ హక్ మంత్రివర్గం యిట్టి దారుణ శాసనాలను అమలు జరుపుతోందంటే, దానికి కారణము బెంగాలు యూరపియన్లయొక్క, మత ద్వేషాలను రెచ్చగొట్టే మహామహులయొక్క, సహాయం పూర్తిగా ఉన్నందుననే అని చెప్పాలి.

హిందూ—మహమ్మదీయ కొట్లాటలు

ప్రజలలో పరమత ద్వేషము ఎంత హెచ్చుగా ఉందో గత వారము—పది రోజులలో జరిగిన హిందూ—ముస్లిము కొట్లాటలు చూస్తే బోధపడుతుంది. మొహరం, హోళీపండగల సందర్భములో బెనారస్, కాన్పూరు, కలకత్తా మొదలైన ప్రదేశాలలో వందల కొద్దీ ప్రజలు గాయపడ్డారు. ఒక్క బెనారస్‌లో 38 గురు చనిపోయారు.సుమారు 300 మందికి గాయాలు తగిలాయి. 450 మందిని పోలీసులు ఎరస్టు చేశారు. కాన్పూరులో 20 మంది చనిపోయారు. కలకత్తాలో కూడా 35 గురికి గాయాలు తగిలాయి. దుకాణాలు తగులపెట్టబడ్డాయి. అమృతసర్‌లో కూడా ఇదే ధోరణి. అనేక ప్రదేశాలలో కలెక్టర్లు నిషేధాజ్ఞలు ఇచ్చారు. ఈవిధముగా దేశములో విపరీతముగా ప్రబలియున్న హిందూ—మహమ్మదీయ కలహాలను ఆధారముగా చేసుకొని, స్వరాజ్యానికి భారతీయులు అనర్హులని బ్రిటిషు ప్రభుత్వము 160 సంవత్సరాల నుంచి ఇండియాలో పరిపాలన చేస్తూన్న బ్రిటిషు ప్రభుత్వము వేర్వేరు మతస్థుల మధ్య సామరస్యం ఏర్పరచ జాలకపోయినదంటే, అట్టి విదేశీ పరిపాలన దేశీయులకు ఎంత హానికరమో ఊహించుకో వచ్చును. దేశానికి సంపూర్ణ స్వరాజ్యము వస్తేగాని ఇతర సమస్యలతో బాటు ఈ హిందూ—మహమ్మదీయ సమస్య కూడా పరిష్కరింపబడజాలదు.

జమియత్-ఉల్-ఉలేమా

ముస్లిం ప్రజలలో విరివిగా వ్యాపించియున్న మతద్వేషాన్ని ఊతగా తీసుకొని బ్రిటిషు పరిపాలకులతో చేతులు కలిపే ముస్లిం లీగ్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన జమియత్-ఉల్-ఉలేమా యొక్క వార్షిక సమావేశంలో, ముస్లిం ప్రజలందరూ కాంగ్రెసులో సభ్యులుగాచేరి స్వాతంత్ర్య పోరాటాన్ని బలపరచవలసిందనీ, ఫెడరేషన్ ప్రతికూల పోరాటంలో విరివిగా పాలొనవలసిందనీ, తీర్మానాలు ఏకగ్రీవముగా ఆమోదించబడ్డాయి. దీన్ని బట్టి, ముస్లిం ప్రజలలోకూడా జాతీయాభిమానం ఎక్కువగా వ్యాపిస్తూందనీ తెలుసుకోవచ్చు.

"రాజాజీ చిల్లుల పడవ"

మదరాసు ప్రధాని రాజగోపాలాచారి త్రిపురీలో ఒక బహిరంగ సభలో ఉపన్యసిస్తూ, సుభాష్‌బోసును చిల్లుల పడవతోనూ, గాంధిజీని మంచి పడవతోనూ పోల్చి ప్రజలెవరూ చిల్లుల పడవలో ఎక్కవద్దని హెచ్చరించాడు. దానికి వన్నె వన్నెల అలంకారాలు ఉన్నాయట. ప్రజల్ని దగా చేస్తుందట. బోసు పడవకి ఏమేమి తూట్లు ఉన్నాయో యెవరికీ తెలియదుగాని, గాంధీజీ నాయకత్వాన పటేలు ముఠావారు నడిపే పడవకి మాత్రం చీరాల కాల్పులు, చిట్టివలస దుండగాలు, బొంబాయి కార్మిక చట్టం, బీహార్ రైతాంగపు చట్టము, మొదలయిన తూట్లు ఎన్నో చూస్తున్నారు ప్రజలు. ఏ పడవకైనా తూట్లు ఉన్నట్లయితే వాటిని అందరూ కలిసి బాగుచేసుకోవడం వివేకంగాని, ప్రయాణాన్నే కట్టిపెట్టడం తెలివితక్కువ అనిపించుకొంటుంది.

సంస్థానాధీశులకు వైస్రాయి హితబోధ.

ఈనెల 13 వ తేదీని ఢిల్లీలో సమావేశమయిన సంస్థానాధీశుల మహాసభ (ప్రిన్సెస్ ఛాంబర్)కు వైస్రాయి ప్రారంభోత్సవం జరుపుతూ,సంస్థానాధీశులకు కొంత హితబోధ చేశాడు. సంస్థాన ప్రజల యిబ్బందుల్ని సాధ్యమైనంత వరకు తొలగించవలసిందనీ, తమ తమ సంస్థానాలు విడిచిపెట్టి ఇతర దేశాలలో సంచారము సాగించడము అంత క్షేమకరం కాదనీ, చిన్న చిన్న సంస్థానాలు ఒక్కొక్క ముఠాగా ఏర్పడి ఒకే పరిపాలనా విధానాన్ని అనుసరించవలసిందనీ,రాబోవు ఫెడరేషన్‌లో అందరు సంస్థానాధీశులూ చేరవలసిందనీ, సలహా యిచ్చాడు. కాలమాన పరిస్థితుల ననుసరించి సంస్థానాధీశులు ప్రవర్తించాలని వైస్రాయి యొక్క కోరిక. కాని, నిరంకుశత్వములో పుట్టి, నిరంకుశత్వములో పెరిగిన ఈ సంస్థాన ప్రభువులకు వైస్రాయి ఇచ్చిన సలహా ఎంతవరకు బుర్రకెక్కుతుందో అనుమానమే. సంస్థానాలలో రాజ్యాంగసంస్కరణలు తీసుకొనిరమ్మని బ్రిటిషుప్రభుత్వం నిర్బంధించనూ నిర్బంధించదు, అడ్డుపెట్టనూ అడ్డుపెట్టదని వైస్రాయి మరొకసారి హామీ యిచ్చాడు. దీన్ని పురస్కరించుకొని, కొన్ని సంస్థానాలలో పేరుకు మాత్రం కొన్ని సంస్కరణ లీయబడవచ్చు. కాని వాటితో ప్రజలు సంతృప్తిపడి యుంటారని భావించడము వెర్రితనము.

సర్ సి. పి. రామస్వామి అయ్యర్

కాంగ్రెసులో ఉన్న అవినీతి, కాంగ్రెసులో ఉన్న కలతలు, కాంగ్రెసులో ఉన్ననిరంకుశత్వమూ, మా తిరువాన్కూరు సంస్థానానికి మాత్రం వద్దంటున్నాడు దివాన్ సర్ సి. పి. రామస్వామి అయ్యర్. బయటివారెవరూ తన సంస్థాన వ్యవహారాలలో జోక్యము కలిగించుకోవద్దని హెచ్చరించాడు. తాను కూడా బయటివాడే నన్న విషయం మరచిపోయి! తిరువాన్కూరు సంస్థానంలో యిటీవలన బయలుదేరిన ప్రజా ఉద్యమం గట్లుతెగి ప్రవహిస్తోంటే, గాంధీ మహాత్ముని కోరికమీద తాత్కాలికంగా విరమించారు. దివాన్‌మీద చేయబడిన ఆరోపణలను ఉపసంహరింకోవలసిందని సలహా యిస్తే, స్టేట్ కాంగ్రెసు నాయకులు ఆ విధంగానే చేశారు. ఈ విషయం అప్పుడే మరచిపోయి, సర్ సి. పి. గాంధిమహాత్మునిమీద కారాలు-మిరియాలు నూరు తున్నాడు. ఢిల్లీలో సంస్థానాధీశులకు వైస్రాయి యిచ్చిన సలహా ఎంతవరకూ ఆచరణలో పెట్టబడుతుందో సర్ సి. పి. అదే రోజున నిరూపించాడు.

రైతులలో సంచలనం

బెంగాలులో బర్ద్వాన్ జిల్లా రైతులు హెచ్చు నీటి తీరువాయికి వ్యతిరేకముగా సల్పుతూన్న ఆందోళన సందర్భములో ప్రభుత్వం 76 గురిని ఎరస్టు చేసింది. తీవ్రమైన నిర్బంధ విధానము అక్కడ అమల్లో ఉంది. బెంగాలులో అధికారములో ఉన్నది కాంగ్రెస్ ప్రతికూల మంత్రివర్గం కాబట్టి యిట్టి నిర్బంధ విధానము అమలు జరపడంలో ఆశ్చర్యం లేదు. కాని. బీహార్, ఆంధ్ర, మలబార్ మొదలయిన రాష్ట్రాలలో కూడా రైతులపై యింత ఎక్కువ నిర్బంధ విధానం అమలు జరుగుతోంది. శాసన సభలలోనూ, బయటా, కాంగ్రెసు వాగులు ప్రజలతో ప్రత్యక్ష సంబంధము గలిగి ఉండాలనే కాంగ్రెసు తీర్మానాలు రైతుల విషయంలో నిర్లక్ష్యము చేయబడుతున్నాయి. సుమారు 200 మంది బీహార్ రైతులు 50 మైళ్ళు నడిచివచ్చి, మాంఘీరులో జిల్లా కలెక్టరు బంగాళా యెదుట ప్రదర్శనం జరిపి, తమకూ—తమ కుటుంబాలకూ జీవనాధారం కల్పించకపోతేవెళ్ళం అని సత్యాగ్రహం ప్రారంభించారంటే, ఎంతటి తీవ్ర పరిస్థితులు అక్కడ ఏర్పడ్డాయో ఊహించుకోవచ్చును.

సెంట్రల్ బడ్జట్

ఫిబ్రవరి 28 వ తేదీని ఢిల్లీ కేంద్ర శాసన సభలో ప్రవేశపెట్టబడిన బడ్జట్ అన్ని సెంట్రల్ బడ్జట్‌లలాగే, బ్రిటిషు పెట్టుబడిదారుల నియంతృత్వాన్ని గట్టిపరుస్తోంది, వచ్చే యేడాది కేంద్ర ప్రభుత్వానికి 82,15 లక్షల రూపాయలు ఆదాయం 82,65 లక్షలు ఖర్చు చూపబడింది, తరుగు 50 లక్షల రూపాయలు పూర్తి చేయడానికి "లాంగ్ స్టేపుల్ పత్తి" మీద దిగుమతి పన్ను ఎక్కువ చేయబడుతుంది. మన దేశములో బట్టల మిల్లులు ఏటేట 7 లక్షల బేళ్ల "లాంగ్ స్టేపుల్ పత్తి"ని ఇతరదేశాల నుంచి దిగుమతి చేసుకొంటున్నాయి. వీటి మీద అదనపు పన్ను విధించడం వల్ల యూరపు పత్తితో తయారయ్యే లంకషయిర్ బట్టలు దేశీయ బట్టలకంటె చౌకగా దిగుమతి అవుతాయి.

ఇంతేకాదు. సైనిక ఖర్చు 45,18 ల రూపాయల వరకూ ఉంది. అంటే, రాబడిలో సగంకంటె ఎక్కువ భాగం యీ సైనిక వ్యయమే మింగి వేస్తోంది. విదేశీ పరిపాలన దేశంలో ఉన్నంత కాలం యిట్టి విపరీతాలు జరుగుతూ ఉండవలసిందే.

అఖిల భారత కాంగ్రెస్ మహాసభ

“మహాత్ముని అభీష్టమనుసరించి వర్కింగు కమిటీ ఏర్పరచాలి”

రైటిస్టుల దాడి: లెఫ్టిస్టుల అపజయం

విభేదాలంతరించ లేదు.

సుభాస్ చంద్రబోసు గాంధీయులను ఎదిరించి ఎన్నికకు నిలచి గెలుచుటచే మహాత్ముడు సుభాస్‌జయం తన అపజయం అన్నాడు. వివేచనాదృష్టితో ఆలోచించిన అది గాంధిజానికి అపజయంకాదు. తీవ్రవాదుల జయంకాదు. సోషలిస్టుల జయం అంతకంటే కాదు. మితవాదనాయకులచే నేను కాంగ్రెసు ప్రణాళికను అపరణలో పెట్టుటకంటే, లా-అండ్-ఆర్డర్ రక్షించుటే పరమావధిగా ఎంచబడుతున్న కాన్స్టిట్యూషనల్ తత్వానికి స్వల్పమార్పులలో ఫెడరేషనును అంగీకరించవచ్చుననుట దిగజారుడు విధానానికి ఓటమిమాత్రమే. కాని గాంధీయులు యీ ఓటమి తమదేఅని అధ్యక్షుడు బోసును కక్షతో సాధింప బూనుకొన్నారు. 11 మంది గాంధీయులు వర్కింగు కమిటీ సభ్యత్వానికి రాజీనామా యిచ్చారు జవహర్‌లాల్‌కూడ వారిని బలపరచాడు. ఏమి రాను పైపోలిక మాటంగా వుండి బోసుకు అప్తుడామన్నాడు కాని అపరణలో గాంధీయులు చేసుమంతటా విపరీత ప్రచారంచేసారు. మంత్రిపదవులు, రాష్ట్ర కాంగ్రెసు అధికారులు ఒత్తిడి, పలుకుబడి ఉపయోగించబడింది. తమతమ పార్టీ ప్రతినిధులనందరిని త్రిపురికి జేర్చడానికి ఏర్పాట్లుచేయబడ్డాయి.

అఖిలభారత కాంగ్రెసుకమిటీ

7 వ తేదీ అ. భా. కాంగ్రెసు కమిటీ అసాధారణ పరిస్థితుల్లో సమావేశమయింది. వర్కింగుకమిటీలేదు. అధ్యక్షుడు జబ్బుగా ఉండుటచే హాజరుకాలేదు. నాటికే రాజకోటలో ప్రాయోపవేశం చేయుటచే అందరిదృష్టి అటు త్రిప్పబడింది. సభకు మౌలానా అజాద్ అధ్యక్షత వహించారు. కార్యదర్శిరిపోర్టు ఆచార్య కృపాలినిచే (అతనే తయారు చేశాడుగాన) ప్రవేశపెట్టబడింది. కాంగ్రెసుసభ్యత్వం 44,78,820 కు అనగా క్రిందటి యేడాదికంటే 13,76,607 పెరిగిందనీ ఈ పెరుగుదలకు కారణం కాంగ్రెసు బలం శక్తి వృద్ధి పొందుటతోపాటు “కొందరు స్వార్థపరులు యీ పలుకుబడిని వినియోగించుకోడానికి జేరడం” వలన అని అన్నాడు. పార్లమెంటరీ కార్యక్రమం జయప్రదమైనదా అనుసంగతి నిర్ణయించడానికి గత 1½ సంవత్సరకాలం చాలదనీ, ప్రజోపయోగకరమైన శాసనాలు కొన్ని గావించబడ్డాయనీ చెప్పారు. ఒకే గారిపై డిసిప్లినరీ చర్య గైకొనుట, అస్సాంలో సంయుక్త మంత్రివర్గం ఏర్పరచుటను గురించి తెలియజేశారు జాంజిబారు లవంగాల బహిష్కరణ జయప్రదంగా జరుపుట. చైనాకు వైద్యదళాన్ని పంపుట. స్పైనుకు సహాయం పంపుటనుగురించి. కాంగ్రెస్ ముస్లింలీగ్ రాయబారాలు విఫలముగుట. పరిశ్రమల ప్లానింగుకమిటీ ఏర్పాటు. ఢిల్లీ అసెంబ్లీలో కాంగ్రెస్‌పార్టీపని. బార్డోలీ రైతులభూమి తిరిగి యిప్పించుట, సంస్థాన ఉద్యమాన్ని గురించి రిపోర్టులో వివరించాడు.

గాంధిగారు వైస్రాయి సలహాపై రాజకోట విషయం ఫెడరల్ జడ్జీ నిర్ణయానికి వదలుటకు అంగీకరించి ఉపవాసం చాలించిన వార్తను



కృపాలినీ

నెహ్రూ చదివి వినిపించాడు సభ్యులు గాంధీజీకి జేజేలతో తమ సంతోషాన్ని వెల్లడించారు. నాటికి సభ చాలింపబడింది.


రాత్రి సర్దార్ పటేల్. కృపాలినీ. రాజేంద్ర బాబు ప్రతినిధుల క్యాంపులకువెళ్లి కాన్వాసు చేసుకొన్నారు. గాంధీయులు బోసుగారికి అటంకం కల్గించుటను మాటలు నీటిమూటలయ్యాయి. సోషలిస్టులు, కమ్యూనిస్టులు రాజీకై చేసిన ప్రయత్నాలన్నీ మితవాదు లంగీకరించ నందున విఫలమయ్యాయి మితవాదుల షరతులు (1) బోసు వర్కింగుకమిటీ సభ్యులపై చేసిన ఆరోపణలు ఉపసంహరించుకోవాలి (2) వర్కింగు కమిటీ రాజీనామా యిచ్చినవారితోనే ఏర్పరచాలి. (3) కొద్దిమంది తీవ్రవాదులను నియమించినా వారు ప్రాతవర్కింగ్‌కమిటీ సభ్యులు అంగీకరించిన వారుగా వుండాలి. అధ్యక్షుడు (1) రెండు వైపులనుండి చేసిన ఆరోపణలు ఉపసంహరించు కోవాలనీ.(2) వర్కింగ్ కమిటీలో మితవాదులు, తీవ్రవాదులు సమానంగా వుండాలనీ సూచించాడు. కాని మితవాదు లంగీకరించలేదు.

ఇట్టి భీషణ పరిస్థితులలో 8 వ తేదీ అ. భా. కాంగ్రెసు కమిటీ మరల సమావేశమయింది. జబ్బుగావున్నా బోసు స్ట్రెచరుపై సభకువచ్చి అధ్యక్షత వహించాడు. డాక్టర్లు ప్రక్కనే హాజరుగా వున్నారు. దాదికలు ఉపచారం చేస్తున్నారు. జనరల్ కార్యదర్శి రిపోర్టు అంగీకరింపబడింది. తరువాత గోవింద వల్లభపంత్ తన తీర్మానాన్ని ఉపపాదించాడు. నారిమన్, ఎం. యన్. రాయి, శరత్‌బోసులు ఆతీర్మానం అ. భా. కాంగ్రెస్ కమిటీలో ఉపపాదించరాదని వాదించారు. షామ్‌లాల్, శాక్జానా, అపటనే చర్చింపాలని వాదించారు. అధ్యక్షుడు ఆ తీర్మానం విషయ నిర్ణయసభలో చర్చించబడవచ్చుననియు, కాంగ్రెసు నిబంధనావళి సాంప్రదాయం ప్రకారం, అ. భా. కాం. కమిటీలో చర్చింపబడరాదనియు రూలింగు యిచ్చాడు. అధ్యక్షునకు వర్కింగుకమిటీ సభ్యుల రాజీనామా అంగీకరించు హక్కులేదను సిద్ధాంతెచ్చిన పాయింట్ అఫ్ ఆర్డరునుకూడా అధ్యక్షుడు త్రోసివేశాడు. అంతటితో అ. భా. కాం. కమిటీ సభ పూర్తిఅయింది.

విషయ నిర్ణయ సభ

ఫలహారానంతరం సమావేశమున విషయ నిర్ణయసభలో అధ్యక్షుడు సుభాస్ చంద్రబోస్ 160 సభ్యుల సంతకముతో పంపబడిన యీక్రింది తీర్మానాన్ని పంత్ ఉపపాదించాడు.

“గాంధి మహాత్ముని సలహాక్రింద వెనుకటి సంవత్సరాలలో అవలంబించిన నిర్ణీత కార్యక్రమాన్ని కాంగ్రెసు మూలసూత్రాలను ఈసభవారు సంపూర్ణంగా బలపరచుచూ ఇవి విచ్ఛేదం కావడానికి ఒప్పుకోరు. ఇకముందు కూడా కాంగ్రెస్ కార్యక్రమం యీసూత్రాల మీదనే నడపవలెను.



పంత్

గత సంవత్సరం పనిచేసిన వర్కింగు కమిటీవారి కార్యక్రమంపట్ల యీ కమిటీవారు పూర్తి విశ్వాసాన్ని ప్రకటిస్తున్నారు. ఆసభ్యులలో ఎవరిపైనైనా నిందారోపణలకు చింతిల్లుచున్నాము.

రాబోయ్యే సంవత్సరం క్లిష్టపరిస్థితుల గురించిన్నీ, అటువంటి క్లిష్టపరిస్థితుల్లో గాంధిజీ ఒక్కరే కాంగ్రెసును, దేశాన్ని విజయవంతంగా నడుపగల శక్తిగలవారు కాబట్టిన్నీ, కాంగ్రెసు కార్యనిర్వాహక వర్గం గాంధిజీ విశ్వాసపాత్రమై ఉండాలని ఈసభవారు అభిప్రాయపడుచూ, గాంధిజీ కోరిక ప్రకారము వర్కింగుకమిటీ నియామకం జరగాలని యీసభవారు అధ్యక్షుని కోరుచున్నారు.”

పంత్‌గారి ఉపన్యాసం తరువాత అధ్యక్షుడు బోసు తాను వర్కింగుకమిటీ సభ్యులపై ఎట్టి ఆరోపణ గావించలేదనియు, వారి ప్రవర్తనను గురించి సందేహించలేదనియు ప్రకటించారు.

రాయ్ సవరణ


ఎం. యన్. రాయ్‌గారు పైతీర్మానములో రెండవ భాగానికి బదులు యీమాటలను చేర్చవలెనని సవరణ ఉపపాదించారు.

“సంపూర్ణస్వాతంత్ర్యమును పొందవలెనను నుద్దేశము ననుసరించియే కాంగ్రెస్‌విధానమును తీర్మానించవలెనని యీ కాంగ్రెస్ సభవారు కోరుచున్నారు. నిరంతరము ఒకటే విధానమును ఏర్పాటుచేయుటకు వీలులేదని యీ సభవారు అభిప్రాయపడుచున్నారు. కాలానుగుణముగా కాంగ్రెస్ విధానముకూడ మారుచుండవలెను. గాంధిగారి విధానము యొక్క విజయమును యీ సభవారు ప్రశంసించుచు, గాంధిజీ వ్యక్తికి భక్తిప్రమాణమర్పించుచున్నారు. ఈ సభవారు సుభాసుబోసుగారియందు సంపూర్ణ విశ్వాసమును వెల్లడించుచున్నారు భారతదేశ కాంగ్రెస్ ప్రతినిధులందరును బోసుగారిని తమ అధ్యక్షుడుగా (అధిక సంఖ్యాకులతో) ఎన్నుకొనిరి. కనుక గాంధిగారును యితరనాయకులును బోసుగారికి తోడ్పడి వారి బాధ్యతను నిర్వర్తించునట్లు చేయవలెనని యీ సభవారుకోరుచున్నారు.”

కాన్పూరు కమ్యూనిస్టు నాయకుడు భరద్వాజ్‌గారు తీర్మానంలోని “గాంధిజీ కోరిక ప్రకారం వర్కింగుకమిటీ సభ్యులను నియమించాలను” భాగాన్ని తొలగించాలని సవరణ తెచ్చారు. ఉపన్యాసంలో సోషలిస్టులు, కమ్యూనిస్టులు చేసిన రాజీ ప్రయత్నాలు విఫలమయినందులకు విచారించారు. అచ్యుత పట్వర్దన్ గారు “ఆరోపణలు చేయుట” అను భాగాన్ని తీసివేయాలని సవరణ తెచ్చారు.

కాంగ్రెస్ సోషలిస్టు నాయకుడు జయప్రకాశ్ నారాయణగారు తీర్మానములోని చివరి భాగాన్ని యీవిధంగా మార్చాలని సవరణ తెచ్చారు.

“రాగల సంవత్సరము క్లిష్టపరిస్థితు లేర్పడవచ్చును. అట్టి పరిస్థితుల నెదుర్కొనుటకు దేశమంతటిని సిద్ధము చేయవలెను. కాంగ్రెస్ సంస్థనేగాక దేశమునుగూడ జయప్రదముగ నడపించుటకు గాంధిగారి నాయకత్వము అత్యవసరం



యం. యన్. రాయ్

అంతేగాక అట్టిక్లిష్ట పరిస్థితులలో కాంగ్రెసు కార్యవర్గము గాంధిగారి సంపూర్ణ విశ్వాసమును పొందవలెను కనుక అధ్యక్షుడు గాంధిగారి సలహా ననుసరించి కార్యవర్గ సభ్యులను నామినేటు చేయవలెను ”

సర్దార్ శార్దూల్‌సింగ్‌గారు “ఆరోపణలు” భాగాన్ని తీసివేయాలని చివరి భాగానికిబదులు. “ఇకముందు కూడ గాంధిగారి నాయకత్వం అత్యవసరము” అని సవరణలు ప్రతిపాదించారు. ఉపన్యాసంలో బోసు ఎన్నిక వర్కింగు కమిటీ గాంధీజంపై అవిశ్వాసం కాదనియు. అధ్యక్షుని ప్రకటానంతరం “ఆరోపణల” భాగం తీసివేయక పోవడంలో అర్థంలేదనీ చెప్పారు.

నూరుద్దీన్‌బిహారీ “కాంగ్రెసు ప్రజాస్వామిక సంస్థయనీ యేఒక వ్యక్తి చేతిలో కీలుబొమ్మ గాదనీ ప్రకటించాలనీ” సవరణ తెచ్చారు గాంధీజీ కాంగ్రెసు తండ్రివంటివారైనా, అతడు సైతం పెద్దవారైన బిడ్డల సలహా తీసుకోక తప్పదనీ చెప్పాడు. సత్యమూర్తి తీర్మానాన్ని బలపరచాడు. దత్తు ముజుందారు (కమ్యూనిస్టు) తీర్మానం దురుద్దేశాలతో తేబడిందని ఆక్షేపించాడు. విలువైన కాలం తుక్కు తీర్మానంపై చర్చతో వృథా పరుచబడుతూన్నదన్నాడు. ఇది అధ్యక్షుని కాలు చేతులు బంధించడానికినీ, నామమాత్రుడుగా చేయు ప్రయత్నమ చెప్పాడు. రామమనోహర లోహియా, రాజగోపాలాచారి, గిద్వానీ, కాశేశ్వరరావుగార్లు తీర్మానాన్ని బలపరచారు. తీర్మానాన్ని వ్యతిరేకించుతూ, రంగా, అన్నపూర్ణయ్యగారలు మాట్లాడారు. నరేంద్రదేవ్‌గారు, కాంగ్రెసు ఎడమ కుడి భేదములు లేవనియు అంతా ఫెడరేషన్ వ్యతిరేకించువారేననియు, గాంధిగారి నాయకత్వం సోషలిస్టులకు నమ్మకముందనియు. బోసు ప్రకటనతోసంతృప్తిపడి పంత్‌గారు సోషలిస్టుల సవరణ అంగీకరించాలనీ చెప్పారు. మరునాడు సవరణలపై ఓటింగు జరిగింది. రాయ్‌గారి సవరణకు 38 ఓట్లు, నూరుద్దీన్‌గారి సవరణకు 52 తక్కిన సవరణలకు 127 లేక 128 చొప్పున వచ్చి అన్నీ ఓడిపోయాయి. తీర్మానం 218-135 ఓట్లతో నెగ్గింది.

ఊరేగింపు.

కాంగ్రెసు చరిత్రలో ఇదివరకు లేని 52 ఏనుగులపై బ్రహ్మాండమైన ప్రజాసమూహంతో



అచ్యుత పట్వర్ధన్

అధ్యక్షుల పటములు ఊరేగించబడెను. జండా చౌకులో జహ్వర్‌లాల్ నెహ్రూ జాతీయ పతాకాన్ని ఎగురవేశాడు. ప్రస్తుతం కాంగ్రెసులో కాన్పించుతున్న తగవులు జీవిత చిహ్నాలనీ, వానినిచూచి నిరుత్సాహ పడరాదనీ భేదాలు మరచిపోయి రానున్న పోరాటానికి అంతా సిద్ధంకావాలనీ ఉపన్యసించాడు.

కాంగ్రెస్ మహాసభ.

విష్ణుదత్తనగరంలోకల్లా అతి విశాలమైన సభామంటపములో 10 వ తేదీ సాయంకాలపు 6-30గంటలకు కాంగ్రెస్ మహాసభ సమావేశమైంది. ప్రేక్షకులు,డెలిగేట్లు మొత్తం 2 లక్షల మంది హాజరయ్యారు.వీరుగాక డబ్బు పెట్టిసభామంటపములోనికి రాలేని పేదప్రజల సమీపమునున్న కొండ ఏటవాలు ప్రదేశంలోవుండి సభాకార్యక్రమమును వీక్షింప సాగారు. క్రిందటిరోజు విషయనిర్ణయ సభలో పాల్గొనుటవల్ల జ్వరం హెచ్చుటచే సుభాస్ చంద్రబోస్ హాజరుకాలేదు. వారి కోరికపై వున్నవారిలో సీనియర్ అధ్యక్షులైన మౌలానా అబ్దుల్ కలాం అజాద్‌గారు అగ్రసనాధిపత్యం వహించారు. ఆహ్వాన సంఘాధ్యక్షుడు సేట్ గోవిందదాస్‌గారి ఉపన్యాసానంతరం, అధ్యక్షోపన్యాసం యింగ్లీషులో శరత్ బోసుగారును, హిందూస్థానీలో ఆచార్యనరేంద్ర దేవ్ గారును చదివారు.

ఈజిప్టు రాయబారవర్గమును అభినందించుచు తీర్మానం ప్రతిపాదించారు.



జయప్రకాశ నారాయణ

ఈజిప్టు ప్రతినిధులకు స్వాగత మొసగుతూ పండిత జవహర్లాల్ నెహ్రూగారు చేసిన ప్రసంగంలో ఇండియా ఈజిప్టుదేశాల సమస్యలు చాలావరకు సమానమైనవే అన్నారు. ఏమంటే ఇరుదేశాలవారికి ముఖ్య సమస్య బ్రిటిషుసామ్రాజ్యతత్వాన్ని ప్రతిఘటించడమే. రాజకీయ కారణాంతరాల వల్ల వాఫ్డిస్టు పక్ష నాయకుడయిన నాహస్‌పాషాగారు ఈ ప్రతినిధి వర్గానికి నాయకత్వం వహించి రాజాలకపోయినందుకు విచారము వెలిబుచ్చారు. భారతదేశం ఈజిప్టుకు ఆశాసందేశము పంపగలదని ఆశిస్తున్నామని పండిత నెహ్రూగారు వ్యక్తం చేశారు.

ఈజిప్టు ప్రతినిధుల నాయకుడయిన మహమద్ బీ గారు తమ ప్రతినిధి వర్గానికి ఒసగిన ఘనమైన స్వాగతానికి అఖిల భారత కాంగ్రెసు వారికి కృతజ్ఞతాభివందనాలు తెలిపి, జాతీయ మహాసమావేశ సందర్శన భాగ్యం లభించినదుకు ఆనందం వెల్లడించారు. మహాత్మా గాంధీగారికి సత్వరారోగ్యసిద్ధిని ఆశిస్తూ, భారతదేశములో సమైక్యత అత్యవసరమనిన్నీ, ఈజిప్టుదేశం ఒకమత్య బలంవల్లనే సాతంత్ర్యవిజయం చేకూర్చుకొన కలిగిందనిన్నీ ఉగ్గడించారు. ఇండియా ఈజిప్టు దేశాలు రెంటనడుమా సఖ్యభావం అభివృద్ధిచేసే నిమిత్తం ఒక భారత ప్రతినిధివర్గం ఈజిప్టు దేశానికి రావలసిందని కూడా ఆహ్వానించారు. అంతటితో నాటికి మహాసభ ముగిసింది.

3 వ రోజు విషయ నిర్ణయ సభ

11 వ తేదీ ఉదయం 8-30 గంటలకు తిరిగి విషయ నిర్ణయ సభ సమావేశమునకు



నెహ్రూ

అధ్యక్షుడు రాజాలనందున అజాద్‌గారు అగ్రాసనాధిపత్యం వహించారు. జహ్వర్‌లాల్ నెహ్రూ యీక్రింది తీర్మానాన్ని ఉపపాదించారు.

భారత జాతీయాశయం

“కాంగ్రెసు మహాసభ గత 50 సంవత్సరములు పైగా ప్రజాభ్యుదయముకొరకై పాటుబడు చుండెను. ప్రజా స్వాతంత్ర్యము కొరకు కాంగ్రెసు దీక్ష వహించెను. బ్రిటిషు సామ్రాజ్య అధికారమును యెదిరించి ఈ దేశములోని జనసామాన్య క్షేమముకొరకై గత 20 సంIIలనుండియు కాంగ్రెసు మహాసభ పోరాడు చుండెను. ఈ పోరాటమునందు ప్రజలను కట్టుదిట్టమయిన క్రమశిక్షణలో స్వార్థత్యాగమునకు సమర్థులుగ సంసిద్ధులచేసి, కాంగ్రెసుయొక్క లక్ష్యమయిన, స్వాతంత్ర్య సంపాదమునకు దేశమును చాలవరకీ మహాసభ నడిపించెను.

ఆయా కాలమాన పరిస్థితులనుబట్టి కాంగ్రెసు మహాసభ తన కార్య విధానమును మారుకొను చుండినను భారత స్వాతంత్ర్యము కొరకే సదా కృషిచేయుచుండెను. ఈ దేశములో ప్రజాస్వామ్య ప్రభుత్వ పద్ధతినే స్థాపించుట కీ మహాసభ పూనుకొనియున్నది. ఇండియా రాజ్యాంగ చట్టమును కాంగ్రెసు మహాసభ నిరాకరించి దానిని తుదముట్టింపవలెననియే సంకల్పించెను కాని ఈ రాజ్యాంగ చట్టములో నిరూపింపబడిన రాష్ట్రీయ స్వాతంత్ర్య విధానము స్వల్ప అధికార పరిమితమైనను దానిని స్వీకరించి తన్మూలమున ప్రజలకు చేయదగిన సహాయమును, చేయూత ఒసంగి, జాతీయోద్యమమును మరింత బలపరుపవలెనని సంకల్పించెను. కాని ఈ రాజ్యాంగ చట్టములోని ఫెడరేషను విధానమును కాంగ్రెసు మహాసభ ఎంత మాత్రమును అంగీకరించుటలేదు. దానిని పూర్తిగ ప్రతిఘటింప సంకల్పించియున్నది.

జాతీయ స్వాతంత్ర్యమును సాధించుటయే ఈ మహాసభయొక్క స్థిర సంకల్పమని ఈ తీర్మానము తిరిగి ధృవపరచుచున్నది. అఖిలభారత జాతీయ ప్రతినిధివర్గముగల ప్రజాపరిషత్తుచే దేశ స్వాతంత్ర్యమునకు తగిన రాజ్యాంగ విధానము నిర్ణయింపబడవలెను. ఇది విదేశీయులవలన నిర్ణయింపబడవలసినదిగాదు. భారతీయులచేగాక, మరొకవిధముగ నిర్ణయింపబడిన ఏ రాజ్యాంగమును భారతీయులకు అంగీకారము గానేరదు. భారతీయులు స్వతంత్రమైన ప్రజాస్వామ్య ప్రభుత్వమును తమకుతామే తమ ప్రజాపరిషత్తుమూలమున నిర్ణయించుకొనవలెనను స్వయం నిర్ణయసూత్రమును పర్తింపజేయవలసిన కాల మాసన్నమైనది. మన జాతీయోద్యమము, నానాటికి బలవత్తరమగుచున్నది. ప్రజాసామాన్యము ప్రబోధింపబడుచున్నది. స్వదేశ సంస్థాన ప్రజలలోగూడ, నూతన చైతన్యముద్భవించినది. ప్రపంచపరిస్థితులు ప్రచండవేగమున మారిపోవుచున్నవి. కనుక ఈ సమయములో మన దేశప్రజలు తమకు కావలసిన సంపూర్ణ స్వాతంత్ర్యమును నిర్ణయించుకొనవలసిన సహజసిద్ధమగు అధికారముగలిగియున్నారు. అంతేగాక జనసామాన్యమును పీడించుచున్న దేశదారిద్ర్యమును తొలగించుట కనేక ఆర్థికసమస్యల పరిష్కరింపవలసి యున్నది. ఆత్మవికాసావకాశముల నొసంగెడి స్వాతంత్ర్యములేని యెడల నీయార్థికసమస్యల పరిష్కరించుకొనజాలము. మన మిపుడు నిర్వహించుచున్న రాష్ట్రీయ స్వాతంత్ర్య విధానమువలన ప్రజాక్షేమాభ్యుదయమునకై మనము విశేషించి కృషిచేయుట కవకాశము లేదు. వున్నటువంటి కొలది అవకాశములయినను అపుడే ముగిసిపోవుచున్నవి. ఫెడరేషను విధానము భారతదేశమునకు పురిత్రాడువంటిది.అది మనలను మరింత నొక్కి నలిపివేయును. దానిని మనము అంగీకరింపజాలము. కాబట్టి ఇండియా రాజ్యాంగ చట్టము పూర్తిగ రద్దుచేయబడవలెను. దాని స్థానే భారతజాతి స్వయముగ నిర్ణయించెడి స్వరాజ్య ప్రభుత్వవిధానము అమలులోకి రావలెను. స్వాతంత్ర్య ప్రజాస్వామ్య ప్రభుత్వముగల భారతదేశము ప్రపంచములోని ఇతరదేశములతో సరిసమానమైన గౌరవస్థానమును పొంది ప్రజాస్వాతంత్ర్యధర్మముల రక్షింపగలదు.

స్వదేశమునందును అఖిల ప్రపంచమునందును ముమ్ముందు రానున్న నూతన విషమావస్థల గ్రహించి, ఇపుడే, మనకాంగ్రెసు సంస్థను సంస్కరించి సుశిక్షితముగ నొనర్చి అంతర్గత దౌర్బల్యమును, అనేక అపభ్రంశములను సంస్థలోనుండి తొలగించి, ఐకమత్యమును, ఆత్మబలమును పెంపొందింప జేయుటకు ఆయా రాష్ట్రములలోని కాంగ్రెసు ప్రభుత్వములును, కాంగ్రెసు సంస్థలును కలసి పనిచేసి ఈ మహాసభను అఖిల భారత జాతీయపీఠముగ నొనర్పవలెను.”

విదేశాంగ విధానము, ఈజిప్టు రాయబారులకు స్వాగతము, చైనాకు సానుభూతి తరువాత తెలుపు దిగువ తీర్మానాలు ఉపపాదింపబడి చర్చలేకయే ఆమోదింపబడెను.

విదేశాంగ విధానము.

కాంగ్రెసు విదేశాంగ విధానమునుగూర్చి ఈ క్రిందివిధముగ నుండెను అది చర్చలేకయే ఆమోదింపబడెను.

“మ్యూనిక్ ఒడంబడికను వ్రాసికొనుటలోను ఇంగ్లాండు ఇటలీ ఒడింబడిక నేర్పరుచుకొనుటలోను, స్పెయిను ప్రభుత్వమును పై తిరుగుబాటుచేసిన తిరుగబాటువారల అధికారమును విజయమును బ్రిటిషువారామోదించుటవలనను, ప్రజా స్వామ్య సూత్రములను బ్రిటిషువారు బుద్ధిపూర్వకముగ తృణీకరించిరి. తా మొసంగిన అభయహస్తములను, వాగ్దానములను వ్యర్థమొనర్చిరి. జాతిసమితి ద్వారా ఏర్పరచిన సమిష్టి రక్షణమును అంతమొందించిరి. ప్రజాస్వామ్యమునకు ప్రబలశత్రువులైన ప్రభుత్వము

(మిగతా 18 వ పేజీలో)

ఆంధ్ర విద్యార్థుల వయోజన విద్యాప్రచారం

శ్రీ యర్రమిల్లి నరసింహారావు

ప్రభుత్వం ప్రజలయెడ తన కర్తవ్యాన్ని నెరవేర్చకపోతే, ప్రజలే ఆ బాధ్యత వహించవలసి వస్తుంది. మన దేశంలో నూటికి 8 మంది మాత్రమే చదువవచ్చును. ఈ పరిస్థితులలో చదువురానివారికి చదువు నేర్పడం చాలా ప్రధాన విషయం. దేశాన్ని తన చెప్పుచేతల్లో ఉంచుకోవాలని కోరే సామ్రాజ్యవాద ప్రభుత్వం యీ విషయాన్ని తలపెట్టకపోవడం ఆశ్చర్యంకాదు. అందువల్ల కొంత కాలంనుంచి, విద్యా ప్రచార ఆవశ్యకతను దేశమందలి కొన్ని ప్రజాసంఘాలు గుర్తించాయి.

బీహారు రాష్ట్రంలో, ప్రభుత్వ సహకారంతో ప్రజా సంస్థలు, 3 లక్షల మందికి చదువను వ్రాయను నేర్ప గలిగాయి. ఈ సమస్యనే పరిష్కరింప గోరిన బొంబాయి రాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ 1000 మందిని మాత్రమే తయారు చేయ గల్గింది. ప్రభుత్వ సహకారం, ప్రజా సహకారం లేకపోవడమే యిందుకు కారణం.

ఈ సమస్యయొక్క ప్రాధాన్యతను, అవశ్యకతను గుర్తించి కృష్ణా జిల్లా యందు నిరక్షరాస్యత నిర్మూలన, వయోజన విద్యా ప్రచారము చేయవలెనని బెజవాడలో ఆంధ్ర విద్యార్థుల సమావేశములో తీర్మానింపబడినది. ఈ తీర్మానమును పురస్కరించుకొని, ఈ సంవత్సరం ఏప్రిల్ 20 నుంచి మే 1 వరకు శిక్ష శిబిరము బెజవాడలో నెలకొల్పబడును. ప్రవీణులగు విద్యాశాస్త్ర వేత్తలు క్యాంపునకు ఆహ్వానింపబడుదురు. సుమారు 100 మందికి సౌకర్యములు చేయబడుచున్నవి.

ఈసందర్భంలో బొంబాయి విద్యార్థి ఫెడరేషన్‌వారి కార్యక్రమము మన ప్రచారమునకు ఉపయోగింపగలదు.

ప్రచారకులు

విద్యా ప్రచారమునందు. పాల్గొన నంగీకరించి, బెజవాడ క్యాంపునందు జేరనవసరములేని విద్యార్థులు కొందరు, ముందుగా, గ్రామములందు తిరిగి ప్రజలకు చదువునందాసక్తి కలుగచేసి ప్రచారమునకు పునాదులు వేయవలెను. ఈ కార్యము, సరిగా పని ప్రారంభింపబడిన తరువాత, కాలహరణము కలుగకుండ చేయ నుపకరింపగలదు.

నిరక్షరాస్యత నిర్మూలన

జనవరి నెల 29 వ తారీఖున బెజవాడలో సమావేశమైన రాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ వర్కింగు కమిటీ తీర్మానము ననుసరించి ప్రచారము మే 2 వ తారీఖున ప్రారంభింపబడును. 6 వారములపాటు జరుపబడును.

దళనిర్మాణం

నలుగురు లేక ఐదుగురు శిక్షణ పొందిన విద్యార్థులు నియమిత ప్రదేశములందు మరి 5 లేక 6 గురు విద్యార్థులను తరిఫీదు చేసి, ఒక దళము చొప్పున ఏర్పరచవలెను. అనగా, ఒక్కొక్కదళము 10 లేక 12 గురు సేవకులను కల్గియుండును. ఒక్కొక్కదళము ఒక గ్రామమును చూచుచుండును. దళమందలి ప్రతి ప్రబోధకుడు 20 మందిని తరిఫీదు చేయవలెను. ఆ ప్రబోధకుడు వారి నామముల పట్టికను. యభివృద్ధిని వ్రాయుచు లెక్కలు తయారు చేయుచుండవలెను. అట్లు కానిచో, పని జరుగుచున్నదీ, లేనిదీ గుర్తించుట కష్టమగును. ప్రతి దళము ఆ గ్రామమును వదలిపెట్టి వచ్చివేయునప్పుడు తన పనిని ఉత్సాహవంతులగు ఆ గ్రామ నివాసులగు యువకులకు వప్పజెప్పవలెను. వారితో ప్రతి దళాధిపతి తరువాత ఉత్తర ప్రత్యుత్తరములు జరుపవలెను. లేనిచో, పని పూర్తిగా అంతరించు పరిస్థితులు లేర్పడ వచ్చును.

చదువుట, వ్రాయుట నేర్పుట ప్రధాన కార్యక్రమమైనను, ఈ పని విజయవంతముగా జరుగవలెనన్న గ్రామ కొలతలు, ప్రదర్శనములు, శరీర పరిశ్రమ, ఆటలు మొదలగు పనులద్వారా భిన్నభిన్న రుచులుగల ప్రజల నాకర్షింపవలయును.

గ్రామకొలత లేక లెక్కలు తయారుచేయుట

గ్రామములందలి నిజపరిస్థితులు తెల్సుకొనుటకిది యుపకరింపగలదు. ఇది చేసేందుకు ప్రతి విద్యార్థియు గుడిసె-గుడిసెకువెళ్ళి గ్రామస్థుల సాంఘిక, ఆర్థిక విద్యా విషయక పరిస్థితులనుగూర్చి లెక్కలను తయారుచేయవలెను. ఈ పని గ్రామవాసులలో, నిరక్షరాస్యత నిర్మూలనా ప్రచార సమయమున, వారితో ఎట్లు మసలవలెనో తెల్పుట కెంతయు ఉపయోగకారి కాగలదు. మన విద్యా విధానంద్వారా మనలో రేకెత్తుతూన్న ఆధిక్య అహంభావాన్ని, చదువురాని కోటానుకోట్ల శ్రమజీవుల యెడల మనలో కలుగుతూన్న నిర్లక్షతను యీ కార్యక్రమం రూపుమాపగలదు.

ప్రదర్శనాలు.

గ్రామవాసులందరూ ఒక ప్రదేశానికి చేరేటట్లు చూడాలి. వారిని ఆకర్షించే కొన్ని ప్రదర్శనాలు దీనికెంతైన ఉపకారి కాగలవు. దైనందిన కష్టాల్ని సూచించే నాటకాలు, జాతీయ భావాల్ని పెంపొందింపచేసే హరికథలు ఏర్పాటు చేయించాలి. గ్రామఫోన్లు, రేడియోలు యిందుకు చాల ఉపయోగ కారిగా ఉంటాయి. మ్యాజిక్ లాంతరుమూలమున గ్రామ పునర్నిర్మాణపు యేర్పాటులు, ఆరోగ్య విషయములు ప్రబోధింపవీలగును.

శరీర పరిశ్రమ — ఆటలు.

గ్రామ వాసులలో ఆరోగ్య సూత్రాల్ని, అన్యోన్య భావాల్ని, కలుగజేయ ప్రయత్నించాలి. చెడుగుడి మొదలగు ఆటలు ఆడించి, వారిలో "టీం స్పిరిట్" కలుగచేయాలి.

గ్రామమందలి యువకులయందు శిక్షణ, కట్టుబాటు కల్గునట్లు ప్రయత్నింపవలెను. దీనికి డ్రిల్లు చాలవరకు ఉపయోగ పడగలదు.

వయోజనవిద్య.

ప్రజలు దినదినం, ఎదుర్కొనవలసిన సమస్యలను గూర్చి చెప్పడం చాలా ప్రాముఖ్యమైన పని. వారికి ముఖ్యంగా ఆరోగ్య సూత్రాల్ని కొంతవరకు తెలియజెప్పాలి. జబ్బుచేయడానికి కారణం, అందువలన కలుగు నష్టం, అది రాకుండా ఏవిధంగా చూడగలమో మొదలైన విషయాలను వారికినేర్పాలి. సాంఘిక సమస్యలే గాక ఇతర ప్రజా సమస్యలనుగురించికూడా వారికి తెలియ జెప్పాలి.

ప్రచార గ్రంథాలయాలు.

గ్రామస్థులు చదువనేర్చిన తరువాత, విద్యార్థులు వెళ్ళి పోయేముందు.ప్రచార గ్రంథాలయాల ప్రశ్న వస్తుంది. ప్రతి కేంద్రంలోనూ ఒక ప్రచారక గ్రంథాలయం స్థాపించాలి. గ్రామస్థులకు ఉచితంగా కావలసిన పుస్తకాలు సరఫరాచేయాల్సి యుంటుంది. ఈగ్రంథాలయాన్ని దగ్గరలో నివసించే దళాధిపతిగాని, భాద్యతను వహించే యింకొకరుగాని, చూడవల్సి యుంటుంది. ప్రతీ ఒక్కటీ అధమం 500 పుస్తకాలైనాకల్గియుండాలి. ఈపుస్తకాలు గ్రామంలోని భాద్యతగల వ్యక్తులద్వారా పంచిపెట్ట బడతాయి. ప్రతిగ్రామంలోనూ, భాద్యతగల వారిద్వారా యీప్రచారం చేయబడేటట్లు చూడవల్సి యుంటుంది.

ఈ పై కార్యక్రమమును అమలు జరపాలంటే దళ నిర్మాణంలో చాలా శ్రద్ధ వహించాలి. ప్రతీ దళం అనేక రంగములలో ప్రత్యేకత సంపాదించిన అధ్యాపకులను సంపాదించాలి. ప్రతీ దళం వైద్య విద్యార్థి; చిత్రకారుడు; పాటగాడు; ఉపన్యాసకుడు; ఫొటో గ్రాఫర్; ఒక స్త్రీ వాలంటీరును కల్గియుండేటట్లు ప్రయత్నించాలి. అప్పుడు ప్రతి దళం, అన్ని రంగాలలోను ప్రబోధం చేయగల్గుతుంది. అప్పుడు ఈ కార్యక్రమం సరియైన పంథాలో జయప్రదంగా నడిపేందుకు సాధ్యమౌతుంది.

* * *

గుంటూరు జిల్లా విద్యార్థి మహాసభ

ఫిబ్రవరి 11 వ తారికున ఉదయం 8 గంటలనుండి 10 గంటలవరకు గుంటూరు జిల్లాయందలి విద్యార్థి ప్రతినిధులు సత్తెనపల్లి పట్టణమంతయు ఫెడరేషన్ నశించాలి, డిటెన్సను పద్ధతి, సామ్రాజ్యవాదము నశించాలి, విద్యార్థి సంఘాలకు జై మొదలైన నినాదములతో ఊరేగింపు చేసిరి. పదిగంటలకు మునిసిపల్ హైస్కూలు హాలులో జిల్లా విద్యార్థి మహాసభ ప్రారంభింపబడెను. విద్యార్థులు, పురజనులు చాలమంది విచ్చేసిరి.

ఆహ్వాన సంఘాధ్యక్షుడు ప్రతినిధులను, అధ్యక్షులను వారి ఆహ్వానాన్ని ఆమోదించి వచ్చినందుకు అభినందించుచూ, విద్యార్థులు స్వాతంత్ర్య పోరాటములో ముందంజవేసి, జాతీయ స్వాతంత్ర్యానికి, అభివృద్ధికి పాటుపడవలెనని చెప్పిరి. తరువాత బెల్లంకొండ రాఘవరావుగారు సభా ప్రారంభోత్సవము చేస్తూ, విద్యార్థులు నూతన ఆదర్శములను, మార్పులనూ, అర్థం చేసుకుంటూ, సంఘాలద్వారా తమ కష్టములను పోగొట్టు కొనుటకు ప్రయత్నించుకొనవలెననిచెప్పిరి.

అధ్యక్షోపన్యాసం

కంభంపాటి సత్యనారాయణ ఎం. ఏ.; బి. యల్. (ఆనర్సు) గారు ఆహ్వాన సంఘమువారికి తమ కృతజ్ఞతను తెల్పుచూ, తమ అధ్యక్షోపన్యాసమును ప్రారంభించిరి. స్పెయిన్, చైనా, పాలస్టయిన్ మొదలగు దేశాల్లో నేడు జరుగుతూన్న యుద్ధవిషయాల్ని మనము ప్రతిరోజు పత్రికలద్వారా తెలిసికొంటున్నాము. ప్రతిచోట విద్యార్థులు కళాశాలలు, హైస్కూళ్ళు వదలివేసి, యుద్ధరంగాలు ప్రవేశిస్తున్నారు. మన జాతీయ పోరాటంకూడ నానాటికి అభివృద్ధి చెందుతూంది. అఖిలభారత విద్యార్థిసంఘము ఈపోరాటాన్ని బలపరుస్తూ జాతీయ సంస్థయైన కాంగ్రెసుకు తోడ్పడుతోంది. చాలమంది విద్యార్థులు, ఇంతకు పూర్వం జరిగిన జాతీయోద్యమాలలో పాల్గొన్నారు. ప్రస్తుతం జరుగుతూన్న సంస్థాన ప్రజా పోరాటాల్లో విద్యార్థులు తీవ్రంగా పాల్గొంటూన్న విషయం మనకు తెలిసిందే. ఇదేవిధంగా ఇకముందు రాబోయే ఫెడరేషన్‌ను ఛిన్నంచేసే యత్నంలో కాంగ్రెసు చేయు ప్రయత్నాలతో మనం పూర్తిగా ఏకీభవించాలి.

రాజకీయాల్తో విద్యార్థులకు సంబంధం లేదని చాలామంది పెద్దలు, నాయకులు చెప్పడం పరిపాటయిపోయింది. తీవ్రరాజకీయాల్లో (active politics) విద్యార్థులు పాల్గొనగూడదని చెప్పుతున్నారు. దీనికితోడు కళాశాలాధికారులనుండి, తలిదండ్రుల నుండి ఒత్తిడి హెచ్చవుతూంది. మనదేశంలో నూటికి చదువుకున్నవాళ్లు తొమ్మిది మంది అందులో సగం విద్యార్థులు. ఈ సగం రాజకీయాల్లో పాల్గొనకూడదటం శోచనీయమైన విషయం. ఇంతేగాక, విద్యార్థులు సమ్మె చేయకూడదనీ, కూలీలకే సమ్మెలుగాని విద్యార్థులకు సమ్మెలేమిటి అనీ, తలిదండ్రులతో సమానులైన ఉపాధ్యాయులద్వారానే తమ కష్టాలను నిర్వర్తించుకోవాలనీ చెప్పడం మొదలెట్టారు. కాని నిజం చెప్పవలసివస్తే,విద్యార్థులు కోరటమూ మేము వారికి లొంగటమూ అనే పట్టుదలలే సమ్మెలకు కారణం అవుతున్నవి.

జ్ఞానసంపాదనకు హద్దులేదు. కనుక విద్యార్థి తన జీవిత పర్యంతం జ్ఞానసంపాదనకే వినియోగించక గ్రామాలలో నివసించు రైతులకు పట్టణాలయందలి కార్మికులకు కాంగ్రెసు ఆదర్శాలనుగురించి చెప్పి, వారిలో రాజకీయ చైతన్యం కలిగించి ప్రజాసామాన్యాన్ని జాతీయపోరాటములో నూటికి తొంబదిమందియైన ప్రజాసామాన్యాన్ని తీసికొని రావలెను.

అధ్యక్షోపన్యాసం పూర్తిఅయాక సభముగింపబడెను. 12-30 గంటలకు విషయనిర్ణయ సభ జరిగెను. అందు ముఖ్యమైన తీర్మానాలు:

ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ తరపున ప్రారంభింపబడుచున్న వయోజనవిద్యావ్యాపకాన్ని ప్రోత్సాహిస్తూ, గుంటూరు జిల్లా తరపున రు 100 లు ఇచ్చుట కనుమతించుట. ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి సంఘమువారి కృషిఫలితంగా, రాబోవు సంవత్సరం, విద్యార్థుల కష్టాలను నివారించు ప్రయత్నం అసాధ్యం అయితే జనరల్ స్ట్రయికుకు తయారగుట.

ఆంధ్ర యూనివర్సిటీ ఆర్డినెన్సుల ఖండించుట.

ఈ తీర్మానాలన్నీ సాయంత్రం బహిరంగ సభలో ఆమోదింపబడెను.

ఈ సంవత్సరం, జిల్లా ఫెడరేషన్ ఆఫీసు నరసరావుపేటలో ఉంచుటకు తీర్మానింపబడెను. ఆఫీసు సెక్రటరీగా వి. రాజమణి గారు ఎన్నుకోబడెను.



మునగాల జమీన్ యువజన మహాసభ

పైమహాసభ 20-2-39 వ తేదీని శిరిపురం గ్రామంలో జయప్రదంగా జరిగెను. సభకు సుమారు వేయిమంది రైతులున్ను యువజనులున్ను అరుదెంచిరి. ఎఱ్ఱజండాలు, జాతీయ జండాలు, విప్లవ నినాదాలు ఊరేగింపులో ప్రాముఖ్యత వహించాయి: ఊరేగింపు పూర్తి అయినపిమ్మట యువజనసంఘ ఆఫీసువద్ద శ్రీయుత అల్లూరి సత్యనారాయణ గారిచే జాతీయ ఎర్రజండాలు ఎగురవేయ బడెను, సాయంత్రం 6 గంటలకు మహాసభ ప్రారంభింపబడెను. నాయకుల పరిచయానంతరం శ్రీ వాసిరెడ్డి శివలింగప్రసాద్ గారు ప్రారంభోపన్యాసమొసంగిరి. యువకులేభావి భారత భాగ్యనిర్ణేతలనియు, రాబోవు స్వాతంత్ర పోరాటంలో యువకులు ముందంజవేసి ఉద్యమాన్ని జయప్రదం గావింపాలనియు, ప్రస్తుతం ఈఎస్టేటులో జర్గుచున్న జమీందారీ వ్యతిరేక పోరాటంలో యువకులు చేయుచున్న కృషిని ప్రశంశించుచు, శ్మశానాల్నికూడా కల్పుకొని సాగుజేసే జమీందారీ పద్ధతి నశించేవరకు ఈపోరాటాన్ని సాగించవలసిన బాధ్యత యువకులపై వున్నదనియు, హెచ్చరించిరి. పిమ్మట సభాధ్యక్షులైన కామ్రేడ్ అల్లూరి సత్యనారాయణగారు గంభీరముగా 2 గంటలసేపు ఉపన్యసించిరి. ఈఎస్టేటులో యువజనసంఘ మేర్పడుట తమ కెంతయు ఆనంద దాయకమనియు, నేటి జాతీయోద్యమ పరిస్థితులు యువజన సంఘాల నిర్మాణాన్ని ఎంతయు కోరుచున్నవనియు, దేశమంతటా చెలరేగుచున్న కూలీ రైతుల పోరాటాల్ని నడిపించుటకు యువజనులు ముందుకు రావలెననియు, జమీందారీ పద్ధతితోటి పోరాటము ఆ పద్ధతి అంతరించువరకు ఉండునదేయనియు, ప్రకాశంబిల్లు రైతుల తాత్కాలికావసరములను మాత్రమే తీర్చగల్గినదనియు, అదైననూ రైతులందరునూ ఆందోళన ద్వారా ప్రకాశంగార్కి బలమిచ్చిననే ప్యాసగుననియు, అది ప్యాసుకానిచో ప్రజలు సత్యాగ్రహము చేయుటకు సంసిద్ధులు కావలెననియు, రాబోవు ఫెడరేషన్ ప్రతికూల పోరాటంలో ప్రజలందరు కాంగ్రెసు ఆదేశానుసారం పాల్గొని పోరాడ వలెననియు, పక్కనున్న నైజాం రాజ్యంలో ప్రజలు జరుపుచున్న పోరాటానికి కూడా సహాయ పడవలెననియు, ఉపన్యసించిరి. అనంతరము శ్రీఎర్నేని సుబ్రహ్మణ్యంగారు ఎస్టేటులో ప్రబలంగా వున్న కల్లు, సారాయి, త్రాగుడును మాన వలసినదిగా ప్రజలను ధ్రోధించిరి. కామినేని వెంకటప్పయ్యగారు నాము పద్ధతిని మానుకోవలసినదిగా షావుకార్లను హెచ్చరించిరి. సభలో హాజరైయున్న ఇమ్మడి పాపయ్యగారు వగైరా కొంతమంది అందుకు అంగీకరించినారు. పిమ్మట నందూరి ప్రసాదరావుగారు జమీందారు రైతులకు మధ్య జరిగిన రాజీషరతులను తెల్పి, రైతులందరూ తాము నిర్వర్తించ వలసిన షరతులను వెంటనే నెరవేర్చ వలెననియు. జమీందారు తాను స్వాధీనపర్చు కొన్న భూములు మొదలైన వాటిని తిర్గి యిచ్చుటకు నిరాకరించినచో సత్యాగ్రహమును ప్రారంభించుటకు సంసిద్ధులుగా ఉండవలెననియు, ప్రతిగ్రామంలోనూ రైతు వలంటీరు దళములు వెంటనే ఏర్పాటు గావించ వలెననియు, జమీందారీ దౌర్జన్యముల కెవ్వరున్ను భయపడ వలదనియు, హెచ్చరించిరి. నల్లపాటి వెంకట్రామనర్సయ్యగారున్ను నాము పద్ధతిని గూర్చి చెప్పినపిమ్మట కొందరు రైతులు తమ్ము ఎస్టేటువారు సాంఘికంగా బహిష్కరింపచేసిన విషయములను దెల్పుకొనిరి. అధ్యక్షుని అంత్యోపన్యాసముతో సుమారు రాత్రి పది గంటలకు సభముగిసెను 6 నెలలలో బ్రిటిష్ ప్రభుత్వం ఫెడరేషనును ఉపసంహరించుకోనిచో సత్యాగ్రహమును ప్రారంభించెదమని కాంగ్రెసు, బ్రిటిషు ప్రభుత్వానికి అంత్య సందేశాన్ని పంపవలెననియు, సంస్థానాలలో జరుగు పోరాటాన్ని కాంగ్రెసే స్వయంగా నడుపవలెననియూ, వాలంటీరు దళాలను ఏర్పాటు చేయవలెననియు తీర్మానములు గావింపబడెను.

* * *

రత్నవరం జమీ పరిస్థితులు.

కామ్రేడ్ నందూరి ప్రసాదరావుగారు యిట్లు వ్రాయుచున్నారు: —

రత్నవరం (కృష్ణా జిల్లా) బహు స్వల్ప ఎస్టేటు అయినా తగాదాలుమాత్రం ఏయెస్టేటులో లేనివన్ని వున్నాయి. మునగాల రాజాగారి భావమరదిగారే ఈ జమీందారుగారు. తరుచు హైద్రాబాదు స్టేటులో నివాసముంటూ ఎప్పుడైన వక్కసారి ఈ ఎస్టేటును దర్శించి వెళ్లుతూ వుంటారు. 8 నెలల నుంచి ఆ రైతులు హృదయవిదారకమగు తమ బాధలనుగూర్చి తెలుపుకుంటూవచ్చారు. భూముల్ని దౌర్జన్యంగా ఆక్రమించుకోవడం, బందాలను తెగ నరకటం, దెబ్బలు కొట్టడం, స్మశానాలను, దొంకలను, మొత్తం సాముదాయక భూముల్ని ఆక్రమించుకోవడం, పండినా పండకపోయినా, జమిందారీ జలాధారాలు లేకపోయినా, హెచ్చు శిస్తులు వసూలు చేయడము మొదలగు విషయములలో రత్నవరం పట్టి ప్రక్కనున్న మునగాల ఎస్టేటుకు ఉజ్జీగానే వున్నది. ఆంజనేయులు, పరంధామయ్యగార్ల కృషివల్ల ఈ రైతులలో అద్భుతమయిన సంచలనం కలిగింది, తమ కష్టాలు ఈదేరువరకు తాము శిస్తులను చెల్లింపజాలమని రైతులు సత్యాగ్రహాన్ని సాగించారు. అనేక పర్యాయములు జమీందారుగారి తరఫున కొందరు మావద్దకువచ్చి రాజీ కుదర్చాలని అర్థించారు. ఈ నెల (మార్చి) 4 వ తేదీ రాత్రి గూడా క్యాంపులో వుండగా వచ్చి మరునాడు రావలసిందిగా కోరి వెళ్ళినారు. మునగాల జమీన్ రైతుసంఘ ప్రతినిధులయిన కోదాటి వెంకట నరసింహారావు, కందుల రాములుగార్లతో రత్నవరం వెళ్ళినాము. ప్రథమంలో రయితులను కలుసుకున్నాము. వారు తమకు గల కష్టాలను మెమోరాండం మూలకంగా మాకు సమర్పించారు. కాంగ్రెసుపక్షాన ఎవ్వరైనను మధ్యవర్తి పరిష్కారమును చేసినచో తాము బద్ధులైయుందుమని ఖరారునామాను వ్రాసియిచ్చుటకు అంగీకారమును తెల్పిరి. అందుపై జమీందారుగారి వద్దకు వెళ్ళి రయితులు తెల్పినట్లుగానే వారును మధ్యవర్తి పరిష్కారమునకు అంగీకరించి ఖరారునామాలు వ్రాసుకుందురా అని ప్రశ్నించాము. కాని వారు నిరాకరించారు. మహాత్మ గాంధి, నెహ్రూగార్లు వచ్చి పరిష్కరించినచో తమ ఒడంబడికపై సంతకములు చేసెదమన్నారు. లేదా ఎర్నేని సుబ్రహ్మణ్యంగారుగాని,గొట్టిపాటి బ్రహ్మయ్యగారుగాని,వచ్చినచో వారి పరిష్కారములు తనకు లాభదాయకముగానున్నచో అంగీకరింతుమనియు, అప్పటికిన్ని ఖరారునామాను వ్రాయననియు తెల్పారు. అట్లయిన మమ్ములను ఇంత దూరము పిలిపించుట హేళన చేయుటకేననియు, పరిష్కార విషయమై మేమేయును సహాయమును చేయజాలమనియు తెల్పాము. దానిపై వారు కొంచెం దురుసుగా మాట్లాడుటచే లేచి వచ్చినాము—ఈ విధంగా రాజీ కుదుర్చమని ఒక మూల మాతో మాట్లాడుతూ, ఇంకొక ప్రక్క రైతులపై నిర్బంధములు అధికంచేస్తున్నట్లు నాకు తెలియవచ్చింది. రైతులమీద రెండు క్రిమినలు కేసులు పెట్టారు-రైతుల చేలలో తుమ్మచెట్లను నరుక్కపోతున్నారు-ఆచారం ప్రకారం గొల్లలు తుమ్మకాయలు కొట్టుకొంటూండగా మీదినుంచి గొడ్డళ్ళను లాక్కొనుట, గొర్రెలను తోలుకొనుపోవుట సాగించారు-సమ్మరీ దావాలను వేస్తున్నారు-ఇట్టి పరిస్థితులలో రైతులు తమ ప్రతిఘటనను తీవ్రతరమొనర్చుటతప్ప గత్యంతరమేమియులేదని అభిప్రాయపడుచున్నాను.

* * *

గ్రామ మునసబుగారి మోసము.

తెనాలి తాలూకా చెమ్డుబాడు గ్రామ మునసబుగారు అమాయకులైన రైతులవద్ద శిస్తు యెక్కువ వసూలుచేసి, రసీదులివ్వక యిచ్చిన రసీదులలో కొంత సొమ్ము అపహరించినట్లుగా రైతులు తెనాలి రివిన్యూ డివిజనల్ ఆఫీసరుగార్కి అర్జీల ద్వారా తెలియపర్చుకొనిరి, కాని అవి విచారణకు రాక పూర్వమే, ఎన్నో మాయోపాయములు పన్ని భయభ్రాంతులుగా చేసి, యేవో కాగితములమీద సంతకములు చేయించుకొనినారనియు, ఆ సంతకములు బుద్ధిపూర్వకముగా చేసినవికావనియు, తిరిగి వారే రి॥ డి॥ ఆఫీసరుగార్కి అర్జీలు పెట్టుకొన్నట్లు తెలియుచున్నది. యిట్టి మోసమునకు గురియైన మరి కొంతమంది ఇట్టి యర్జీలే పెట్టుకొనుటకు ప్రయత్నము చేయుచుండగా, వారిని సామ, దాన, బేధ దండోపాయములచే బెదరించుచూ వారిని బయటకు రానిచ్చుటలేదు. గ్రామ కరణముగారుకూడా వారిలోనే యైక్యమై రైతులను లెక్కచేయుటలేదు. జిల్లా కాంగ్రెసు నాయకులు వెంటనే యీ గ్రామమువెళ్ళి యీ మోసమును గురించి విచారణ సలిపి రైతులకు న్యాయము కలుగచేయవలసియున్నది. తెనాలి రివిన్యూ డివిజనల్ ఆఫీసరుగారు రైతుల యర్జీలన్నియు ఉపసంహరించుకొన్నట్లు వ్రాయించుకొన్నప్పటికి సక్రమమైనవిగానే పరిగణించవలసి యున్నది.

* * *

పెదపాడు చెరువులో డిప్యూటీ కలెక్టరుగారి పిట్టలవేట

మాగ్రామ పంచాయతీ సరిహద్దులలో పెదపాడు క్రొత్తచెరువు అను పేరుగలిగిన చెరువునీరు త్రాగుటకు మాత్రమే ఉపయోగింపబడవలెను. ఇంతే గాక మాగ్రామ పంచాయితీ వారు (1) చెరువులో పశువులను కడుగరాదని, (2) ఎవ్వరును స్నానము చేయరాదని (3) బట్టలుతుకుట, అంట్లుతోముట మొదలగునవి చేయరాదని (4) చెరువు యందలి పిట్టలను కొట్టరాదని రూల్సు ప్యాసుచేసినారు. ప్యాసుచేయుట మాత్రమేగాక యీ నిబంధనలను వివరించు నోటీసు బల్లలను నాల్గింటిని నాల్గుచోట్ల ఏర్పరచి ఎవరును నిబంధనల నతిక్రమింపకుండ జూచుటకు ముగ్గురను కావలా కూడ పెట్టినారు.

ఇట్టి సందర్భములో 4-4-1934 వ తేదీన అప్పటి రివిన్యూ డివిజనల్ అఫీసరు ఖాన్‌బహదూర్ ఇస్మాయెల్ సాయిబుగారును 6-6-34 తేదీన సబ్ మేజస్ట్రేటు సుందరరాజన్ గారును పైని బంధనలను లక్ష్యపెట్టక, చెరువులోనికి మనుష్యులను దింపి నీరంతయు పాడుచేయించి పిట్టలను వేటాడి చాలా భీభత్సము జేసినారు అప్పుడు మాపంచాయితీ బోర్డువారు జిల్లా కలెక్టరుగారికి సంగతి తెలియ బరచిరి. అట్టి దౌర్జన్యములను మాన్పవలసినదిగ విన్నవించుకొనుచు 12-5-34 వ తేదీన తాము ప్యాసుచేసుకొనిన నెం 26, 27, రిజల్యూషనులను వివరించినారు. అంతటితో ఆచర్యలు ఆగినవి.

కాని, నేడు అనగా 1-3-39 వ తేదీన మాడిప్యూటీ కలెక్టరుగారు, గ్రామోద్యోగస్థుల వెంట మారణ సాధనములతో వచ్చి లక్షల కొలది పిట్టలు పరమానందముతో కోలాహల ధ్వనులు చేయుచుండగా చెరువులోనికి దిగి, వాటిని వేటాడి. అధికార సామర్థ్యముతో శాసనధిక్కార మొనర్చినారు. కలెక్టరుగారు పిట్టల షికారునకు వచ్చెదరని యెరిగియుండియు పంచాయతీ సభ్యులును; అధ్యక్షులును ఉపేక్షా భావమేల వహింప వలసెనో తెలియరాకున్నది. వారికి సంగతి తెలియలేదనుటకైనను, కలెక్టరు గారు పిట్టల షికారునకు వచ్చెదరని, వారు తమ నోటనే అనియున్నారు. పంచాయితీ బోర్డు వారుగాని, ప్రభుత్వము వారుగాని, విధించు శాసనోల్లంఘన శిక్షలుదిక్కు మొక్కులేని అనాథులకేనా? అందరికినా?

సత్యాహింసాతత్వములకే ప్రధాన్యమిచ్చు కాంగ్రెస్ ప్రభుత్వములోనే యిటువంటి అవకతవక పనులకు ప్రతిక్రియ జరుగక పైగా దోహదము జరుగుట శోచనీయ విషయము. అని ఒక పెదపాడుగ్రామస్థుడు వ్రాయుచున్నాడు.

మద్రాసు చూళై మిల్లులో సమ్మె

కార్మికులయెడ మద్రాసు ప్రభుత్వ ప్రతికూల వైఖరి.

మద్రాసులోని చూళై టెక్స్టయిల్ మిల్లు కార్మికులు 2700 మంది ఫిబ్రవరి 23 వ తేది నుంచి సమ్మెచేస్తున్నారు. పికెటింగు చేయుచున్న 80 మంది కార్మికులు అరెస్టుచేయబడిరి. ఈ సమ్మెనుగూర్చి ప్రచురణ శాఖామంత్రి మార్చి 5 వ తేదిన ఒక ప్రకటనచేశాడు. ఈ ప్రకటన కార్మికులకు జనాదరణ లేకుండనట్లు చేయుటకై వినియోగపడుచున్నది. సమ్మె పూర్తి వివరాలు ప్రజానీకము తెలుసుకొనిన యడల ప్రభుత్వపు ప్రకటనలో యిమిడివున్న యజమానుల పక్షపాతము బహిర్గతం కాగలదు

1932 లో ఈ చూళైమిల్లు కార్మికులను యజమానులు పర్మనెంటు, తాత్కాలిక, అవసర తాత్కాలిక అను మూడు భాగాలక్రింద విభజించిరి. ఈ పనివారందరికి యించుమించు సమానమైన సర్వీసువున్ననూ, పర్మనెంటు, పర్మనెంటు కానివారికి యిచ్చు రేట్లలో చాలా వ్యత్యాసమున్నది. పర్మనెంటులిస్టులో లేనివారికి సంవత్సరమునకు 15 రోజుల సగము జీతము ప్రివిలేజి లీవు, 10, 11 దినాల పండగ శలవులులేవు. అంతేగాక కొన్ని డిపార్టుమెంట్సు లోగల బోనసు కూడ పర్మనెంటు కానివార్కి లేదు. పీసురేటు పనివారలకు చాలా సంవత్సరాల నుంచి ప్రమోషనులేదు. ఈ టెంపరరి పనివారి సంఖ్య 1939 సం॥ నాటికి 850 వర్లకు పెరిగినది.

ఈటెక్స్టయిలు కార్మికులు మద్రాసు లేబరు యూనియన్‌గా యేర్పడిరి. ఈ సంఘమును మిల్లు యజమానులు గుర్తించారు. కార్మికులు కష్టాలనుగూర్చి తీవ్రమైన ఆందోళనచేశారు. కాంగ్రెస్ మంత్రివర్గమునకు, పర్మనెంటు పనివారలకుగల సౌకర్యములు మిగతా పనివారలకు కూడ వుండాలని, ప్రివిలేజిలీవు అధికము చెయ్యాలని, సిక్కులీవు యేర్పరచాలని, రేట్లు అధికము చెయ్యాలను ఆదిగాగల కోర్కెలను తెలియచేసిరి. కార్మికులందు కల్గిన చైతన్యాభివృద్ధిని గమనించి కాంగ్రెసు మంత్రివర్గము 1938 మే 17వ తేదిన (Conciliation board) మధ్యవర్తికమిటీని నియమించింది. కాని యీకమిటీ యజమానులయందు పక్షపాత దృక్పథముతో విచారణ సల్పింది. యజమానుల అకౌంట్సు తనిఖీచేయుటకు కార్మికసంఘమువారి సూచనలు గమనించనైననూ లేదు. అంతేగాక యజమానుల ప్రకటనలు వేదవాక్కులుగ భావించి, కార్మికుల కొనుగోలుశక్తి, జీవనోపాధులనుగూర్చి యించుకైనా విచారించలేదు. ఈకమిటీ కార్మికులకోర్కెలు నెరవేర్చు స్థితిలో యజమానులులేరని తీర్పు యిచ్చింది. కార్మికులకు పనిశాంతి కల్గించుటకు పర్మనెంటు వారికిచ్చు ప్యాసు ఓళ్ళులు అందరికి యివ్వాలని సూచించుచూ (Substitute) తాత్కాలిక పనివారలకు 600 మందికి కొద్దిపాటి సౌకర్యములు కల్గించాలని సూచించింది. ఈ రిపోర్టును కాంగ్రెస్ మంత్రివర్గము అంగీకరించింది.

అందుమీదట కార్మికులు కాంగ్రెస్ మంత్రివర్గధోరణితో అసంతృప్తి చెంది సమ్మె చేయుటకు సంకల్పించుకొని, 1938 జూన్ 10 న సమ్మెచేయుటకు యజమానులకు 7 రోజుల నోటీసు యిచ్చి 17 వ తేదీన సమ్మె ప్రారంభించిరి. యజమానులు మిల్లు మూసివేసిరి. సమ్మె నెలరోజులకు పైగా సాగింది. కార్మికమంత్రి, గిరిగారు యెట్టకేలకు జోక్యము కలుగచేసుకొని, యజమానులు తమ అకౌంట్సు గవర్నమెంటు నియామకుకు పరిశీలించుటకు అంగీకరించాలని; పనివారలు సమ్మె విరమించాలని ఇందుకు యిరుపక్షములవారిని ఒప్పించారు. సమ్మె ఆపుచేసినతరువాత లేబరు కమిషనరును అకౌంట్సు పరిశీలించుటకు ప్రభుత్వము పంపినది. వీరుకార్మికులు యజమానులు కార్మికుల కోర్కెలు నెరవేర్చు స్థితిలో లేరని 1938 నవంబరు 30 తేదీన ప్రకటించారు. కార్మికులందు వుద్రేకసంచలనము లధికమయి, తమ కోర్కెలు నెరవేరుటకు సమ్మె తప్పనిసరియని దృఢపరచుకొనిరి. ఇప్పటికి షుమారు సంవత్సరము నుంచి యీ మిల్లుకార్మికులు ప్రక్కనే వున్న మిల్లులందు పనివారలకు గలిగినకొద్దిపాటి సౌకర్యములైననూ సంపాదించుటకు తీవ్రముగా అందోళనచేశారు. ఒకతడవ నెలరోజుల పైన సమ్మెకూడ చేశారు. కాని కార్మికుల కష్టాలు యేమాత్రము తొలగలేదు. ఈ పరిస్థితులలో ప్రభుత్వము కార్మికులను రొందరపడ్డారనటము యజమానుల పక్షపాతముగాక మరే మగును?

ప్రభుత్వం పరోక్షముగా యజమానులను బలపరచింది. కాని కార్మికుల సంకల్పము మాత్రం సన్నగిల్ల లేదు. టెంపరరిగా పనిలోనున్న 850 మంది కార్మికులు ఫిబ్రవరి 9వ తేదీనతమకుకూడ పర్మనెంటు కార్మికులకు గల సౌకర్యాలు గల్గించాలని స్టే-యిన్-స్ట్రయిక్ చేశారు. పారిశ్రామిక మంత్రి గిరిగారు ఫిబ్రవరి 10 వ తేదీన జోక్యముకలుగచేసుకొని బొంబాయిలో వున్న యీ మిల్లు అధికారులకువ్రాసి 10 రోజులలో పనివారలకు తెలియజేస్తానని బాధ్యత తీసుకొని పనివారలచేత సమ్మె ఆపుచేయించారు. 21 వ తేదీన గిరిగారు బొంబాయిలోని మిల్లు అధికారులు యీ 800 మంది కోర్కెలు నెరవేర్చజాలమన్నారని తెలియజేస్తూ లేబరు కమిషన్ గారుకూడ ప్రయత్నించువరకు వేచియుండమనిరి. కాని 'తాను బోతే లేదుగాని, తన చీటీపోతే వుందా' అన్నట్లు మంత్రిగారి ప్రయత్నమే విఫలమయినప్పుడు లేబరు కమిషనరు సఫలీకృతులగుదురని తలచుట యెట్లు? కేవలము కాలయాపనముకై యిచ్చిన సలహాతప్ప వేరేలేదు.

గిరిగారి రాజీప్రయత్నము లన్నియు విఫలమయినతరువాత 23 వ తేదీ ఆ మిల్లుకార్మికులందరూ 2700 మంది 24 గంటల నోటీసు యిచ్చి సమ్మె ప్రారంభించినందులకు పనివారల చర్యను నిరసించుచూ ప్రభుత్వము ప్రకటించడము కడుశోచనీయము. కార్మికులపై కోర్టులో కేసులు జరుగుచుండగా ప్రభుత్వము నిందారోపణలు చేయటము చట్టవిరుద్ధం కూడాను. యజమానులు మిల్లు మూసివేసిరి. 10 మంది కార్మికులను పనిలోనికి పోకుండా ఆపారని ప్రభుత్వము అరెస్టుచేసిరి. విచారణయందు యీ కార్మికులు తమ్ములను విడదిననూ, సమ్మె జరిగినన్నాళ్ళు పికెటింగుచేసేదమని నిర్భయముగా తెలియజేశిరి. కాంగ్రెస్ మంత్రివర్గము స్టే-యిన్-స్ట్రయిక్ లను నిరసించుచూ యిచ్చిన ప్రకటనలను యజమానులకు పూర్తిగా వినియోగపడినవి. మిల్లుకోపై పనిచేయు కూలీలు గుమాస్తాలుకూడ సమ్మెలో పాల్గొనిరి. యజమానులు వీరిని పనిలోనికి పోనివ్వకుండా ఆపుతున్నారని ప్రకటనచేశారు. ఇలా వుత్పత్తికి సంబంధించని పనివారలను పికెట్‌చేయుట అచారముకాదని, సమ్మెచేయుచున్నవారు యీ పద్ధతిని విడనాడాలని ప్రభుత్వము ప్రకటించింది. కాని, కాన్పూరులో టెక్స్టయిల్ జనరల్ స్ట్రయిక్ సమయమందు గుమాస్తాలను మాత్రమే కాక, పాకీపనివారిని కూడ కాంగ్రెస్ వాలెంటీర్ల సహాయముతో ఆపేవారు యజమానులమీద అన్నివిధముల ఒత్తిడి కలిగించిననే కాని సమ్మెలు జయముపొందవు అందుకు అవసరమైతే మిల్లు యజమానులను సాంఘికబహిష్కరణ కూడ చేయువలసివుండును. అంతేగాక, కార్మికుల హక్కులకొరకు సానుభూతి సమ్మెలుచేసి, తద్వారా యజమానులమీద ఒత్తిడి కలిగించటము కూడ కలదు.

కార్మికులు శాంతముగా పికెటింగు చేసుకొను హక్కును భంగపరచరాని కాంగ్రెస్ మంత్రివర్గము ప్రకటనలు చేయుచూ, పికెట్ చేయుచున్న కార్మికులను మిల్లు వుద్యోగస్థులను పికెట్‌చేశారని, పనిలోనికి పోకుండా ఆపారని అరెస్టు చేయటము పికెటింగును నిరుపయోగము చేయుటకు ప్రయత్నించుటయే.

ఈ సమ్మెలందు అరెస్టులు కూడ సత్యాగ్రహోద్యమమును జ్ఞాపకము చేయుచున్నవి. ఫిబ్రవరి 24, 25 తేదిలందు 41 మందిని 27 వ తేదిన 29 మందిని అరెస్టుచేసిరి. మొత్తము 80 మందిపైగా అరెస్టు చేయబడిరి.

కాంగ్రెస్ మంత్రివర్గము కార్మికులకు వ్యతిరేకముగా ప్రకటనలు చేసిననూ కార్మికులు ప్రజా సానుభూతిని సంపాదించ గల్గుతున్నారు. మద్రాసు కార్పొరేషన్‌లో, మద్రాసులో, డమొసిషన్, పబ్లిషింగుహౌసు, చూళైమిల్లు సమ్మెల వలన కల్గిన విపరీత పరిస్థితులందు ఆతురత తెలుపుతూ, మద్రాసు మంత్రివర్గము వెంటనే పరిష్కరించుటకు పూనుకోవాలని తీర్మానము ఆమోదింపబడినది. ఈ తీర్మానమును వుపపాదించనవారు, ప్రభుత్వము, ప్రజానీకము కార్మికులను పెట్టుబడిదారుల నుంచి కాపాడాలని చెప్పారు; శెల్వపతి చెట్టియారు, సమ్మె చేయుచున్న కార్మికులకు 5000 రూపాయలు సహాయము చెయ్యాలని సవరణ తెచ్చాడు. కాంగ్రెస్‌పార్టి పురజనుల సహాయనిధి యేర్పరచిన తరువాత సహాయము చేయవచ్చునని యీ సవరణను అంగీకరించలేదు. కాని కార్మికులకు సహాయము చెయ్యాలనే ధోరణే, కార్పొరేషను యందు గన్పట్టినది. కార్మిక నాయకులగు గిరిగారే, స్టే-యిన్-స్ట్రయిక్సును తూలనాడి, సమ్మెలు, లాకౌట్సులేకుండా చేస్తానని, అందాకా కార్మికులు శాంతంగా వేచియుండాలంటున్నారు. లాభనష్టములను తారుమారు చేయుటకు పెట్టుబడిదారుల కుయుక్తులు గిరిగారికి తెలియవనుట సాహసం. కాని యజమానులు తమకు లాభాలు లేకపోవుటవల్ల కార్మికుల కోర్కెలు నెరవేర్చటము లేదనునట్లు గిరిగారు మాట్లాడటము ఆశ్చర్యం కలిగిస్తున్నది స్టే-యిన్-స్ట్రయిక్స్ కార్మికులకే అనర్థకమనటము, సమ్మెలు లేకుండా చేయడం యేవిధముగానో బోధపడదు. కాని, సంపూర్ణ స్వతంత్రము అనుభవించుచున్న దేశాలలోకూడ సోషలిస్టు పార్టి అధికారములోనికి వచ్చిన ఫ్రాన్సులో కూడ, స్టే యిన్—స్ట్రయిక్సు అనేకములు జరిగినవి సోవియట్ రష్యాలో తప్ప, పెట్టుబడిదారుడు—కార్మికుడు వున్నంతవరకు సమ్మెలు తప్పవు. గిరిగారు ప్రస్తుతము తామనుసరించుచున్న కార్మిక విధానమును పునరాలోచించుకొని, సమ్మెచేయుచున్న కార్మికులను అరెస్టు, లాఠీఛార్జీ కాల్పులకు గురిచేయుటకు మారుగా కార్మికోద్యమ విజృంభణకు సహకారము చెయ్యాలి. ఇప్పుడు కార్మికులపై బనాయించిన కేసులు వుపసంహరించాలి.

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ.

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టపార్టీ సమావేశమై 15 మాసాలు అవుతూంది. ఈ లోపల జరిగిన వ్యవహారమంతయు పరిశీలించవలసివుంది. ప్రస్తుతము దేశములోని పరిస్థితిని గూర్చి చర్చించి, త్రిపురీ కాంగ్రెసు నిర్ణయాల ననుసరించి ఏవిధముగా మనము పని చేయవలసియుండునని నిర్ణయించుకోవలెను. అందుచే ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టుపార్టీ వార్షిక సమావేశము ఈనెల 16వ తేదీన ఉదయం 9 గంటలకు బెజవాడలో సమావేశమగును. 17, 18 తేదీలలో కూడజరుగును.

ప్రతి జిల్లా పార్టీయును 6 గురు ఆక్టివ్ సభ్యులకొకరు నంతున ప్రతినిధుల నెన్నుకొని నెన్నుకొని పంపవలయును. ఇంతవరకు జిల్లా పార్టీ సమావేశములు పూర్తిగానిచోట్ల వెంటనే జరపెదరని కోరుచున్నాను. అట్లు జరుపుటకు వీలులేని జిల్లాలలో ఆయా స్థానిక సంఘాలు తమ ఆక్టివ్ సభ్యులలో 6 గురికి ఒకరువంతున ఎన్నుకొని పంపవలెను. స్థానిక సంఘాలు లేనిచోట్ల జిల్లా కార్యనిర్వాహక వర్గమే ఎన్నుకొని పంపవలయును.

ఎజెండా

1. పార్టీ కార్యదర్శి నివేదిక
2. నవశక్తి నివేదిక
3. త్రిపురీ కాంగ్రెసు సమావేశము, దాని నిర్ణయములు
4. పార్టీ నిర్మాణము
5. వివిధ సంఘాలలో పార్టీ జేయవలసిన పని
6. ఫెడరేషన్ వ్యతిరేక పోరాటం
7. ఇతర తీర్మానాలు

బెజవాడ,
11—3—39.

ఇట్లు,
పి. సుందరయ్య,
కార్యదర్శి.

కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగించాలి.

మార్చి 20 వ తేదీన సభలు జరపాలి.

కామ్రేడ్ పి. సుందరయ్య

నేటి సమాజములో వున్న బానిసత్వమును, పెట్టుబడిదారి దోపిడీ విధానమును అంత మొందించి, ప్రపంచమంతటా శాంతిని నెలకొల్పుటకు ప్రతి దేశములో కమ్యూనిస్టు పార్టీ పని చేయుచున్నది. ప్రపంచములోని పారిశ్రామిక కార్మికుల నిర్మాణ యుక్తమైన శక్తియగు కమ్యూనిజము, నేడు ప్రజా సామాన్యమును ఆకలిమంటలు, నిరుద్యోగము, బీదతనము మొదలగు బాధల నుండి తొలగించి, వర్గ రాహిత్యమైన సమాజమును ఏర్పరచుటకు ప్రయత్నించుచున్నది. కమ్యూనిస్టులు, అంతర్జాతీయవాదులనియు, జాతీయవాదమునకు పూర్తి వ్యతిరేకులని కొందరు అపోహలు కలుగజేయుచున్నారు. కాని యిది సత్య విరుద్ధము: కమ్యూనిస్టులు, వారి దేశము యొక్క సభ్యతను, భాషను, విజ్ఞానము మొదలగువాటికి పూర్తి అభివృద్ధిని ఆశించుచున్నారు. తమ దేశములోని పెట్టుబడిదారులు, ఇతరదేశములోని పెట్టుబడిదారులతో చేతులు కలిపి, జాతీయ విద్రోహకరమైన కార్యములు జేయుచూ, ప్రజాసామాన్యం యొక్క స్వాతంత్ర్యమును అరికట్టుచుండగా, కమ్యూనిస్టులు అట్టి కుట్రలకు, జాతీయ విద్రోహ సన్నాహములకు వ్యతిరేకముగా పోరాడుచూ, నిజమైన జాతీయవాదమును నెలకొల్పుటకు తీవ్ర కృషి జేసే వారిలో అగ్రగణ్యులు. ఈ రోజున ఫాసిస్టు శక్తుల చేతులలో నలిగిపోతూవున్న జాతీయ వాదమును, ప్రజాస్వామ్యమును రక్షించుటకు, సాంఘిక పురోభివృద్ధిని, ప్రజాస్వామ్యమును కోరు వివిధ శక్తులతో కలసి ఫాసిస్టు, సామ్రాజ్యవాద ప్రభుత్వములతో పోరాడుచున్నారు. ఈ ఉద్దేశములతోనే బానిస దేశములలోని కమ్యూనిస్టులు, దేశస్వాతంత్ర్యము కొరకు పోరాడుచున్న శక్తులను ఐక్యపరచి, స్వాతంత్ర్య పోరాటాభివృద్ధికి అమోఘముగా సహాయపడుచున్నారు. ప్రజల తరపున నిరంతరముగా పోరాడుచున్నందున ఫాసిస్టు ప్రభుత్వాల నిర్బంధ విధానమునకు కమ్యూనిస్టుపార్టీ గురి యగుచున్నది. జర్మనీ, ఇటలీ, జపానుదేశాలలో కమ్యూనిస్టుపార్టీని నిషేధించి, సామాన్యపౌరసత్వపు హక్కునుగూడా అరికట్టుచున్నారు.

ఈ పార్టీ ఇండియా లాంటి బానిస దేశములో తీవ్రముగా ప్రజా సామాన్యములో జేస్తున్న కృషి, అది కలుగజేస్తూ వున్న రాజకీయ చైతన్యమును, తద్వారా పెంపొందుచున్న స్వాతంత్ర్య పోరాటమును చూచి బ్రిటిషు సామ్రాజ్యవాదులు భయకంపితులయి 1934 జులైలో యీ పార్టీని నిషేధించారు.

ఈ సామాన్య పౌరసత్వపు హక్కును నిషేధించటము ప్రజా సామాన్యపు సూత్రములను నాశనము జేయుట తప్ప ఏమౌతుంది? కార్మికుల పోరాటములను అణగదొక్కుటకు, జాతీయ పోరాటము నాశనము జేయుటకు, ప్రజా సామాన్యముయొక్క హక్కులకు పోరాడు ముఖ్య శక్తియగు కమ్యూనిస్టు పార్టీని నిషేధించింది, బ్రిటిషు ప్రభుత్వం.

ఇట్టి పరిస్థితులలో స్వాతంత్ర్య సంపాదనకు పోరాడుచున్న సోదర రాజకీయ సంస్థయైన కాంగ్రెసుపై కమ్యూనిస్టు పార్టీ నిషేధమును, తొలగించే బాధ్యత ఎంతో వుంది. కాంగ్రెసు సల్పుచున్న స్వాతంత్ర పోరాటమును అణచుటకుగాను, ప్రభుత్వము ప్రయోగించుచున్న నిర్బంధ విధానమునకు వ్యతిరేకంగా వాక్, సభా, సంఘ, పత్రిక మొదలగు ప్రజా తంత్ర హక్కులకొరకు రోజు రోజు పోరాటమును, ఆందోళనను సాగించుచున్నది. కరాచీ కాంగ్రెసు యీ ప్రజా తంత్ర హక్కులను స్పష్టపరిచే తీర్మానమును ప్యాసు జేసి, నిర్ణీతమైన కార్యక్రమము యిచ్చింది. తరువాత కాంగ్రెసు ఎన్నిక ప్రణాళికలో కూడా యీ ప్రజా తంత్ర హక్కులను గురించి స్పష్టీకరించింది. కాంగ్రెసు మంత్రిత్వాలు ఎన్నికల ప్రణాళికను దృష్టిలోవుంచుకొని ప్రజా తంత్ర హక్కులను కాపాడవలసిన కర్తవ్యము చాలా వుంది.

కాంగ్రెసు, మంత్రివర్గాలు స్వీకరించిన తరువాత కమ్యూనిస్టు పార్టీపై నిషేధము తొలగించాలసినదనే ఆందోళన కూడా తీవ్రరూపం దాల్చటం మొదలిడింది. మార్చి 20, 1938 సం॥న అఖిల భారత దినముగా నిర్ణయించబడి దేశమంతటా ప్రతిపట్టణములో కమ్యూనిస్టు పార్టీపైన నిషేధం తొలగించాలని కోరారు. ఆరోజున జరిగిన బహిరంగ సభలలో అనేకమంది కాంగ్రెసు నాయకులు పాల్గొన్నారు. ప్రజాతంత్ర హక్కులకొరకు బద్ధకంకణులయిన కాంగ్రెసు మంత్రులు తమంతట తాము యీ సమస్యను త్రీసుకొని బయట సాగుతున్న ఆందోళనకు పూర్తి తోడ్పాటు కావలసింది పోయి పూర్తి విముఖత చూపటం చాలా విషాదకరమైన విషయము కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగించాలని బొంబాయి శాసనసభలో చర్చకు వచ్చినప్పుడు, మొరార్జీ దేశాయిగారు కాంగ్రెసు మంత్రివర్గము తరపున జవాబిచ్చుచూ, కమ్యూనిస్టు పై పార్టీ నిషేధం తొలగించుట దేశమునకు క్షేమంకాదని నుడివారు. ఇది విచారకరం.

ఈ పరిస్థితులలో దేశమంతటా కమ్యూనిస్టుపార్టీపై నిషేదము తొలగించాలని ఆందోళన జరపడం అవసరము:

10 ఏండ్ల క్రిందట, 1929 మార్చి 20 వ తేదీన కమ్యూనిస్టుల అరెస్టుచేసి మీరటు కుట్రకేసు పెట్టారు. మార్చి 20 వ తేదీ రాబోవుచున్నది. ఆ రోజున యీక్రింది విధంగా బహిరంగ సభలు, వూరేగింపులు జరపాలి.

1. వెంటనే కాంగ్రెసు కమిటీ, కాంగ్రెసు సోషలిస్టు పార్టీ, ట్రేడ్ యూనియన్, కిసాను, విద్యార్థి సంఘాల పిలచి ఆ రోజు కార్యక్రమము నిర్ణయించాలి. వీలుంటే దీనికోసం ఒక కమిటీని ఏర్పాటు జేయాలి.

2. స్థానిక కాంగ్రెసునాయకుల వద్దనుంచి కమ్యూనిస్టు పార్టీపైన నిషేధం తొలగించాలంటూ స్టేటుమెంట్లు తీసుకోవాలి. ఆ స్టేటుమెంట్సును స్థానిక పత్రికలలో ప్రకటించేటట్లు చూడాలి.

3. సామాన్య పౌరసత్వపు హక్కులైన, వాక్ సమావేశ సంఘ స్వాతంత్రము కమ్యూనిస్టులకు కూడా ఉండాలి, కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగించాలనీ తీర్మానంజేయాలి. కాంగ్రెసు మంత్రులు తమ రాష్ట్రములలో వెంటనే నిషేధమును తొలగించాలని కోరాలి.

చిట్టివలస కాల్పులు :

కొయ్య తోటయ్య
తుపాకి గుండు దెబ్బ తిన్నాడు.

కండివలస రామస్వామి
రెండు కాళ్లమీద తుపాకి గుండ్లు దూరినాయి.

బైరెడ్డి అప్పలస్వామి
పాదాన్ని చితుక బొడిచారు.

మామిడి అప్పన్న
పనినుండి తొలగించుటచేత మగ్గంవద్ద సత్యాగ్రహం ప్రారంభించాడు ఇతనితోనే కథ ప్రారంభమైనది.

కొయ్య ఎల్లయ్య
తల, ముక్కు, కండ్లపైన లాఠీ దెబ్బలు తగిలాయి.

నమ్మి నరసింహులు :
కాలిమీద తుపాకిగుండు దెబ్బ తగిలింది.



"స్వరాజ్య సంపాదనకై ఇంత చక్కని అవకాశం ఎప్పుడూ కలుగ లేదు."

సుభాష్ బోసు అధ్యక్షోపన్యాసం

10—3—1339 వ తేదీని త్రిపురీలో సమావేశమైన 52 వ అఖిల భారత కాంగ్రెస్ మహాసభలో శ్రీ సుభాస్‌చంద్రబోసు యిచ్చిన యీ క్రింది అధ్యక్షోపన్యాసాన్ని శ్రీ శరత్‌చంద్రబోసు చదివెను. ఇంత చిన్న ఉపన్యాసం యిదివరలో ఏ కాంగ్రెస్ అధ్యక్షుడూ ఇచ్చియుండలేదు:—

"ఆహ్వాన సంఘాధ్యక్షా! ప్రతినిధి సోదర, సోదరీ మణులారా! నన్ను అఖిలభారత కాంగ్రెసు మహాసభాధ్యక్ష పదవికి రెండవసారి ఎన్నుకొని నాయెడల మీరు కనబరచిన గౌరవానికి హృదయ పూర్వకంగా కృతజ్ఞతను తెలియజేస్తున్నాను. త్రిపురీలో కూడ మీరందరూ



సుభాసు స్థానే మహాసభకు అధ్యక్షత వహించిన
అబ్దుల్ కలాం అజాద్

ప్రేమతో నాకిచ్చిన ఆహ్వానానికి కృతజ్ఞుణ్ణి. ఇట్టి సమయాలలో రివాజుగా ఏర్పాటు చేయబడే కొన్ని అట్టహాసాలను నా కోరికపై మీరు వదలివేయవలసివచ్చిన మాట నిజమే. అయినప్పటికీ నాకు మీరిచ్చిన ఆహ్వానంలో ఒక్క వీసమైనా ప్రేమ తగ్గలేదు. కాబట్టి ఆ అట్టహాసాలను విడిచివేయడం ఎవ్వరికీ విచారం కలుగజేయదని నమ్ముతున్నాను.

"మిత్రులారా! నా ఉపన్యాసాన్ని ప్రారంభించక పూర్వం, రాజకోటలో గాంధీ మహాత్ముడు జయమొంది, తత్ఫలితంగా తన ఉపవాస దీక్షను ముగించినందుకు మీ అందరి పక్షాన మన సంతోషాన్ని తెలియజేస్తున్నాను. దేశం అంతా నేడు యీ వార్త విని సంతోషిస్తుంది. ప్రజల హృదయభారం తీరిపోయింది.

వర్కింగ్ కమిటీ సభ్యుల రాజీ నామాలు.

"స్నేహితులారా! ఈ సంవత్సరం అనేక విషయాలలో ప్రాధాన్యత వహిస్తోంది. కాంగ్రెసు అధ్యక్షుని యెన్నిక ఈ యేడు మామూలు ధోరణిని జరుగలేదు. ఎన్నిక అనంతరం ప్రజల దృష్టినంతటినీ ఆకర్షించిన ఘటనలు ఎన్నో జరిగాయి. సర్దార్ పటేల్, మౌలానా అబ్దుల్ కలాం అజాద్, బాబూ రాజేంద్ర ప్రసాద్, గార్ల నాయకత్వాన్ని 15 గురు వర్కింగ్ కమిటీ సభ్యులలో 12 గురు రాజీనామా లిచ్చారు. మరొక సుప్రసిద్ధ వర్కింగ్ కమిటీ సభ్యుడైన పండిత జవహర్లాల్ నెహ్రూ యితర సభ్యులవలె రాజీనామా పత్రం యివ్వకపోయినా, ఆయన చేసిన ప్రకటనవల్ల ప్రతివారూ నెహ్రూ కూడా రాజీనామా యిచ్చినట్లే అభిప్రాయపడుతున్నారు. ఈ త్రిపురీ కాంగ్రెస్ మహాసభ జరుగబోయేముందు, రాజకోట పరిస్థితులవల్ల గాంధీ మహాత్ముడు ప్రాయోపవేశ దీక్ష గైకొనవలసి వచ్చినది. కాంగ్రెసు అధ్యక్షుడు ఈ యేడు త్రిపురీకి జబ్బుతో వచ్చాడు. ఇట్టి పరిస్థితుల్లో, అధ్యక్షోపన్యాసం పూర్వపు ఉపన్యాసాల మాదిరిగా కాక, క్లుప్తంగా ఉండక తప్పిందికాదు.

ఈజిప్టు రాయబారం

"సోదరులారా! ఈజిప్టు దేశంనుంచి నేడు వాఫ్డు జాతీయ పక్ష నాయకులు రాయబారంగా వచ్చి, కాంగ్రెసు మహాసభకు అతిధులుగా ఉన్నారనే విషయం మీ అందరికీ తెలుసు. వారు మన ఆహ్వానాన్ని అంగీకరించి, ఇండియాకు ప్రయాణమై వచ్చినందుకు మీ అందరి తరపున ప్రేమాభి వందనములర్పిస్తున్నాను. ప్రస్తుతం ఈజిప్టులో ఉన్న రాజకీయ పరిస్థితులు వాఫ్డు పార్టీ అధ్యక్షుడైన ముస్తాఫా నహాస్ పాషాను యీ రాయబారానికి నాయకత్వం వహించకుండా చేసినందుకు మనం విచారించవలసియుంది. ఆయన్ని, ఇతర వాఫ్డు జాతీయ పక్ష నాయకుల్ని, నేను స్వయంగా ఎరిగియుండడంవల్ల నా సంతోషం మరింత ఎక్కువౌతోంది. దేశీయులందరి పక్షాన వీరికి మరొకసారి ఆహ్వానమిస్తున్నాను.

ఇంగ్లండు ఫ్రాన్సుల కుట్ర

"హరిపురాలో మనం ఫిబ్రవరి 1938 లో సమావేశమైనాం. అప్పటినుంచి నేటివరకు అంతర్జాతీయంగా ఎన్నో ప్రధాన ఘటనలు సంభవించాయి. వీటిలో ముఖ్యమైనది, సెప్టెంబరు 1938 లో జరిగిన మ్యూనిక్ ఒడంబడిక. ఫ్రాన్సు, ఇంగ్లండుదేశాలు ఈ ఒడంబడికలో పాల్గొని నాజీజర్మనీకి పూర్తిగా లొంగిపోయాయి. తత్ఫలితంగా యూరప్ ఖండంలో ఫ్రాన్సు ఆక్రమించి



అధ్యక్షోపన్యాసం చదివిన
శరశ్చంద్ర బోసు

యున్న ప్రధాన స్థానం పోయింది. ఒక్క తుపాకి పేల్చకుండా జర్మనీకి ఆ స్థానం లభించింది. మొన్న యీమధ్య స్పెయిన్ ప్రజాస్వామికం ఏవిధంగా నాశనమయిందో చూశాం. దీనితో ఇటలీ, జర్మనీ దేశాలలో ఫేసిస్టు నిరంకుశత్వం ఇంకా తీవ్ర రూపాన్ని దాలుస్తోంది. ప్రజాస్వామ్య దేశాలనబడే ఫ్రాన్సు, ఇంగ్లండులు, ఇటలీ—జర్మనీలతో కలిసి కొంతవరకైనా సోవియటు రష్యాను యూరపియన్ రాజకీయాలనుండి తరిమివేయడానికి కుట్రలు పన్నుతున్నారు. కాని ఇది ఎంత కాలం వరకు సాధ్యమవుతుంది? రష్యాను అవమానపరచే ప్రయత్నాలలో ఫ్రాన్సు, గ్రేట్ బ్రిటన్‌లకు ఎట్టి ప్రయోజనం కలిగింది?

"యూరప్, ఆసియా ఖండాలలో ఇటీవల సంభవించిన అంతర్జాతీయ ఘటనల ఫలితంగా బ్రిటిష్, ఫ్రెంచి సామ్రాజ్యాల బలం, గౌరవం పడిపోయిందని చెప్పవచ్చు.

ఫెడరేషన్‌ను అమలుజరపకపోతే—

ఇక మన రాజకీయాలకు వద్దాం. ప్రధానమయిన ఒకటి రెండు సమస్యల్ని గురించి మాత్రమే చెప్పడానికి దారుఢ్యం కలిగియున్నాను. మొదటిది: స్వరాజ్య సమస్యను మనం వెంటనే ముందుకు తీసుకువచ్చి, ప్రజాభీష్టాన్ని బ్రిటిషు ప్రభుత్వానికి తెయజేసి, ఒక నిర్ణీతకాలంలోగా సరియైన జవాబు రాకపోతే ప్రజా పోరాటము ప్రారంభించవలసి యుంటుందనీ; ఇట్టి కార్యకలాపం జరపడానికి నేడు కాలం ఆసన్నమయిందనీ—నా దృఢ విశ్వాసం. ప్రభుత్వం మనపై ఫెడరల్ విధానాన్ని బలవంతంగా అమలు జరిపే పర్యంతం చేతులు ముడుచుకొని కూర్చోవడం నేడు మన కర్తవ్యం కాదు. ఇట్టి ముఖావానికి నేడు సమయం కాదు. మనపై ఫెడరల్ విధానాన్ని ఎప్పుడు బ్రిటిషు ప్రభుత్వము రుద్దుతుందా—అనేది సమస్య కాదు. యూరప్ ఖండములో శాంతి ఏర్పడేవరకు, అనగా కొద్ది సంవత్సరాల వరకు ఫెడరేషన్‌ని అమలు జరపకుండా ప్రభుత్వం చల్లగా జారవిడిస్తే మనం ఎట్టి కార్యక్రమం అవలంబించాలి—అనేదే సమస్య. నాలుగు రాజ్యాల ఒడంబడిక ద్వారా గాని, మరొక మార్గము అవలంబించడంవల్ల గాని, యూరప్‌లో శాంతి ఏర్పడేటట్లయితే, గ్రేటు బ్రిటను తన సామ్రాజ్య దేశాల యెడల బలమైన పంథాను తొక్కుతుందనడంలో సందేహం యేమాత్రము లేదు. పాలస్టయినులో నేడు యూదులకువ్యతిరేకంగా అరబ్బుదేశస్థుల్ని సంతృప్తిపరచడానికి బ్రిటన్ ప్రయత్నాలు చేస్తూందంటే, అంతర్జాతీయంగా ఎక్కువ బలం లేకపోవడ వల్లనే. కాబట్టి, మన ప్రజాభీష్టాన్ని నెరవేర్చవలసినదిగా బ్రిటిషు ప్రభుత్వానికి మనం తెలియజేసి, ఒక కాలపరిమితిని నిర్ణయించి, ఆగడువులోగా సంతృప్తికరమైన జవాబు రాకపోతే, మన ప్రజాభీష్టాన్ని అమలు జరిపేటందుకు ఒక నిర్ణీత కార్యక్రమం దేశానికి యివ్వవలసి ఉంటుందని నా యభిప్రాయం.

కార్యక్రమం

"అట్టికార్యక్రమమే ప్రజలందరివల్లను పాల్గొనబడే శాసనోల్లంఘనోద్యమం; ఇదే సత్యాగ్రహోద్యమము. దేశం మొత్తంమీద యిట్టి ఉద్యమము ప్రారంభింపబడితే, బ్రిటిషు ప్రభుత్వము దాన్ని ఎదుర్కొనే స్థితిలో లేదు, బ్రిటిషు ప్రభుత్వంతో మనకున్న బలాన్నంతటినీ ఉపయోగించి బ్రహ్మాండమైన ప్రజా పోరాటం సాగించడానికి తగిన సమయం ఇంకా రాలేదని నిస్పృహచెందేవారు కొందరు కాంగ్రెసులో ఉన్నారని తెలుసుకొన్నప్పుడల్లా నా హృదయం బాధపడుతుంది. యదార్ధ పరిస్థితుల్ని పరిశీలిస్తే మాత్రం అట్టి నిస్పృహకు కారణం ఏమాత్రమూ కనపడదు. 8 రాష్ట్రాలలో కాంగ్రెసువారు అధికారంలో ఉండి, కాంగ్రెసు సంస్థ యొక్క బలం, ప్రతిష్ట, అనేకరెట్లు ఇనుమడించింది. బ్రిటిషుఇండియా అంతటా ప్రజా ఉద్యమము ఎంతో వృద్ధి చెందింది. దీనికి తోడు స్వదేశ సంస్థాన ప్రజలలో చైతన్యము బయలుదేరింది. స్వరాజ్య సంపాదనకై అంతిమ పోరాటము సల్పాలంటే ఇంతకంటె చక్కని అవకాశము మన జాతీయోద్యమ చరిత్రలో ఎప్పుడూ కలుగలేదు. పైగా, అంతర్జాతీయ పరిస్థితులు పూర్తిగా మనకే అనుకూలంగా ఉన్నాయి.

"ప్రతి భారతీయుడూ తన ఆశలు సఫలమయ్యే సమయం వచ్చిందని మితిలేని ఉత్సాహాన్ని నేడు కలిగియుండవచ్చు. మనలో గల భేదాలు మరచిపోయి, జాతీయ పోరాటంలో మనకున్న యావచ్ఛక్తినీ పూర్తిగా వినియోగిస్తే, బ్రిటిషు సామ్రాజ్యంమీద మనం తీయబోయే దెబ్బకు ఎదురుండదు.

"నేడు మనకున్న అనుకూల పరిస్థితుల్ని పూర్తిగా ఉపయోగించుకొనగలిగే రాజకీయ దూరాలోచనను ప్రదర్శించగలమో, లేక మన దేశచరిత్రలో ఎన్నడూ లభించని యీ సదవకాశాన్ని జారవిడుస్తామో!

సంస్థాన ప్రజా ఉద్యమం

"బ్రిటిషు ఇండియా ప్రజల్లోనూ, సంస్థాన ప్రజల్లోను నేడు వెల్లి విరుస్తూన్న నూతన చైతన్యాన్ని గురించి పైన చెప్పాను. హరిపురా కాంగ్రెసులో ప్యాసయిన తీర్మానం ప్రకారం సంస్థాన ప్రజల యెడ మనం ప్రకటించిన వైఖరిని మార్చుకొనవలసియున్నదని నా దృఢమైన విశ్వాసం. సంస్థానాలలో కాంగ్రెస్ యజమాన్యాన కొన్ని కార్యక్రమాలు జరపకూడదని హరిపుర తీర్మానం నిషేధించింది. ఆ తీర్మానం ప్రకారము, పార్లమెంటరీ కార్య క్రమంగాని ప్రజల హక్కులకై ప్రత్యక్ష పోరాటంగాని కాంగ్రెస్ సంస్థ పేరుతో జరగకూడదు. కాని, ఆ తీర్మానం ప్యాసయ్యాక అనేక ఘటనలు సంభవించాయి. అనేక ప్రదేశాలలో నేడు బ్రిటిషు ప్రభుత్వం సంస్థానాధీశులకు ప్రత్యక్షంగా సహాయం చేస్తోంది. ఇట్టి పరిస్థితులలో మనం సంస్థాల ప్రజలవైపు పూర్వంకంటె దగ్గర సంబంధాన్ని యేర్పరచుకోవద్దా? ఈ విషయంలో మన కర్తవ్యమేమో నా మనస్సులో ఎట్టి సందేహంలేదు. హరిపుర తీర్మానంలో విధించిన నిషేధాన్ని నేడు తొలగించడమే కాకుండా, సంస్థానాలలో పౌరసత్వపు హక్కుల కొరకు—బాధ్యతాయుత పరిపాలన కొరకు నేడు జరుగుతూన్న ప్రజా పోరాటాన్ని కాంగ్రెసు వర్కింగు కమిటీయే ఒక నిర్ణీత కార్యక్రమంపై నడుపవలసియుంది. ఇంతవరకు జరిగిన కృషి కొన్ని ప్రదేశాలలో మాత్రమే అదైనా ఒక ప్రణాళిక ప్రకారంగాని, నిర్ణీత కార్యక్రమంపైగాని, జరగలేదు. యిప్పుడీ బాధ్యత వర్కింగు కమిటీపై పడింది. అవసరమైతే, యిందుకయి ఒక ఉపసంఘాన్ని కూడా వర్కింగు కమిటీ నియమించవచ్చును. మహాత్ముని నాయకత్వాన్ని, అఖిలభారత సంస్థాన ప్రజా సంఘంయొక్క సహకారాన్ని మనం పూర్తిగా వినియోగించుకోవాలి.

సామ్రాజ్య వ్యతిరేక సంఘటన

"స్వరాజ్య సంపాదనకు మనమే ఇప్పుడు ముందంజ వేయాలని చెప్పాను. అయితేమనం అందుకు తయారు కావలసిన అవసరం కూడా ఉంది. మొట్ట మొదటి విషయం: అధికార వాంఛవల్ల మనలో యేర్పడిన కుళ్లును, దౌర్బల్యాన్ని నిర్దాక్షిణ్యంగా కడిగివేయాలి. తరువాత దేశంలో వ్యాపించియున్న కార్మిక—కర్షకోద్యమాలతోను, ఇతర సామ్రాజ్య ప్రతికూలోద్యమాలతోను కలసి పని చేయాలి. అతివాద శక్తులన్నీకూడా ఐకమత్యంతో పని చేయవలసియుంది. అన్ని సామ్రాజ్య ప్రతికూల సంస్థల కృషి బ్రిటిషు సామ్రాజ్యాన్ని ఆఖరుసారి కూలద్రోయడానికే ఉపయోగపడాలి.

"సోదరులారా! నేడు మన కాంగ్రెస్ సంస్థలో కలతలు ఏర్పడ్డాయి. అందువల్ల మన శ్రేయోభిలాషులు దిగులుపడి నిరుత్సాహంతో ఉన్నారు. కాని నామనస్సు మాత్రము ఎప్పుడూ ఆశతోనే నిండి యుంటుంది. మనపై ఆవరించియున్న మేఘాలు త్వరలోనే చెదిరిపోతాయి. నా దేశీయుల దేశభక్తిలో నాకు సంపూర్ణమైన విశ్వాసం ఉంది. త్వరలోనే మనము యీ క్లిష్ట దశను దాటి, మనలో మనకు ఐక్యతను సంపాదించుకోగలము.

"1923 లో జరిగిన గయ కాంగ్రెసు నాడును, ఆ తరువాతను కొంచెము యించుమించు ఇట్టి పరిస్థితులే దేశములో ఏర్పడ్డాయి. దేశబంధు చిత్తరంజన్‌దాసు, మోతీలాల్ నెహ్రూ, ఆ రోజులలో స్వరాజ్య పార్టీని స్థాపించారు. వారియొక్క ఇతర భారత వీరపుత్రుల యొక్క, స్మృతి నేటి క్లిష్టదశలో మనకు ఉత్సాహము కలిగించుగాక! గాంధీమహాత్ముడు దేశానికి మార్గము చూపుతూ మనకు సహాయమొనర్చి, కాంగ్రెసును ప్రస్తుతపు చిక్కులలోనుంచి తప్పించుగాక! ఇదే నాహృదయపూర్వకమైన ప్రార్ధన. వందేమాతరం."

ఆహ్వాన సంఘాధ్యక్షోపన్యాసం

ఆహ్వానసంఘాధ్యక్షు డయిన శ్రీ సేట్ గోవిందదాసుగారు కాంగ్రెసు ప్రతినిధులకు స్వాగతమిస్తూ, ఈ క్రింది విధముగా చెప్పారు.

"నేడిచట మనము చాల క్లిష్టమగు సందర్భంలలో సమావేశమైయున్నాము. నేటి అధ్యక్షుని ఎన్నిక తన పరాజయమని మహాత్ముడు ప్రకటించెను. క్రొత్త కార్యక్రమమును దలపెట్టువారు, బ్రిటిషు ప్రభుత్వమువారికి ఆరు నెలలు గడువు ఒసగి, తిరిగి శాసనోల్లంఘనోద్యమమును ప్రారంభింపవలెనని కోరుచున్నటుల దెలియుచున్నది. నాకు మాత్రం ఎట్టి రహస్యములును తెలియవు. కాని గాంధిమహాత్ముడుగాని, వారి మిత్రులలో నెవరుగాని ఫెడరలు రాజ్యాంగము నేమాత్రముగాని అంగీకరింప నుద్దేశించిరని నాకు తెలియదు. ఈ విషయము నంగీకరించిన యెడల, మన యెదుటనున్న సమస్య చాల సులభమైంది. ఎవరున్నను ఫెడరేషనుపై పోరాటము మాత్రము నిశ్చయం. ఈ పోరాటమును ఎపుడు ప్రారంభింపవలెను, ఎటుల ప్రారంభింపవలెను అనునదియే ప్రశ్న. ఈ పోరాటం దౌర్జన్యరాహిత్య పద్ధతులపైననే జరుగవలెనని అందరు అంగీకరించెదని నమ్మెదను. గాంధిమహాత్ముడు అహింసా పోరాట శాస్త్రమున కాచార్యుడు. కనుక ఆ విషయంల నిర్ణయం అతనికి వదలివేయుట న్యాయము. సరిగ చూచినచో పోరాటమిప్పుడే ప్రారంభమైనటుల గన్పించెను. సంస్థానములకును, బ్రిటిషు రాష్ట్రములకును కలిసి ఫెడరేషను ఏర్పడవలెనని రాజ్యాంగ చట్టమునందుద్దేశింపబడెను. బ్రిటిషు ఇండియా రాష్ట్రములందధిక భాగము ఇపుడు కాంగ్రెసు ఆధిపత్యమునందున్నవి. మిగిలిన రాష్ట్రములకుగూడ కాంగ్రెసు ఆధిపత్యమును వ్యాపింపజేయుటయే అధ్యక్షుని అభిప్రాయమని భావించుచున్నారు. గాంధిమహాత్ముడు అపుడే, సంస్థానములలో పోరాటమును ప్రారంభించెను. శ్రీమతి కస్తూరిబాయి, మణిబెన్ పటేలు, జమ్నాలాల్ బజాజ్ గారలపుడే ఈ పోరాటమున మనలనుండి లాగుకొనబడిరి. కాంగ్రెసువారు మిగిలినరాష్ట్రములలో గూడ తమ ఆధిపత్యమును నెలకొల్పి, సంస్థానంలలో స్వపరిపాలను స్థాపించుటకు ప్రారంభింపబడిన పోరాటమును తమ శక్తినంతను కేంద్రీకరింపవలెను. సమయమును కనిపెట్టి మహాత్ముడే ఈ పోరాటమును ప్రారంభించుననుట కేమాత్రమును సందేహము లేదు. మన అధ్యక్షులవారు నేడు గోరుచున్నది—రేపు దానియంతట నదియే తప్పక సిద్ధించును. పోరాటము కొరకు తొందరపడుతున్న ఉత్సాహం చూచుట యెంతయు సంతోషదాయకము. కాని రాజకీయములలో కేవల ఉత్సాహ మొక్కటే విజయమును సమకూర్పజాలదు. నాయకుని యందు విశ్వాసము, క్రమశిక్షణము అవసరము. అవి లేనిది విజయము సాధ్యము గాదు. గాంధి మహాత్ముని నాయకత్వమున గత 20 వత్సరములలోను, భారతీయులు పెంపొందించుకొనిన అపారమగుశక్తి మన రాజకీయ చారిత్రమున అపూర్వము. సంగ్రామరంగమున సైన్యముల నడిపించు మహా సేనానివలె గాంధి మహాత్ముడు అనేక సమయములలో జాతీయ వాహినుల సమరరంగమునకు నడిపించెను. అవసరమగునపుడు ముందుకు పోనీయకుండ నిలిపియుంచెను. వారి నాయకత్వమున మన మింతవరకును ఎక్కడను తప్పటడుగు వేయలేదు. ఎచ్చటను పడలేదు. ఇట్టిస్థితిలో ఇంతవరకును అనుసరించుచున్న మార్గమును వదలుట కెట్టి కారణమును గనుపింపదు.

జాతీయ వ్యవహారములును, అంతర్జాతీయ వ్యవహారములును గూడ అత్యంత విషమములుగ నున్న ఈ సమయమున ఇచట సమావేశమై యున్న ప్రతివారికిని గూడ సరియగు నిర్ణయమును గావించుకొనగల శక్తి నొసగవలెనని భగవంతుని ప్రార్ధించుచున్నాను."

వందేమాతరమ్

తిరువాన్కూర్‌లో మరల సత్యాగ్రహము

రాజకోటలో మహాత్ముడు ప్రాయోపవేశము విరమించుట.

తిరువాన్‌కూరు స్టేట్ కాంగ్రెసు వర్కింగు కమిటీ ఈనెల 6 వ తేదీని సమావేశమై 25 వ తేదీ నుండి సత్యాగ్రహము సాగించడానికి నిశ్చయించింది. కమిటీ వారు, ప్రభుత్వముతో ఘర్షణకు ఇష్టపడక పోయినను మరొక మార్గము లేనందువలన తిరిగి సత్యాగ్రహము సాగించుటకు తీర్మానించితిమని ప్రకటించారు. ఈసారి సత్యాగ్రహము, కల్లు సారాయి దుకాణముల వద్ద పికెటింగు, ఉప్పును తయారుచేసి అమ్ముట, నిషేధింపబడిన పత్రికలను పంచిపెట్టుట, అటవీశాసనమును ఉల్లంఘించుట మొదలగు కారక్రమంతో సాగిస్తారు. పన్నుల నిరాకరణ కూడ కార్యక్రమములో ఉన్నదిగాని, మొట్ట మొదటనే ఆ ఉద్యమము త్రీసుకొసిరారట. పట్టంతాను పిళ్ళె, పి. కె. కుంజు, జి. రామచంద్రన్, పి. జె. సబాస్టియన్, భూతలింగం పిళ్లెగార్లు గల ఒక సత్యాగ్రహ సంఘము కూడ ఏర్పరుపబడింది. సత్యాగ్రహము ఇది వరకుకంటె తీవ్రంగా సాగించుటకు గ్రామాలలో ఎక్కువగా ప్రచారం సల్పుచున్నారు. స్టేట్ కాంగ్రెసుసంఘం వారు తమ ఈ నిశ్చయాన్ని అఖిల భారత కాంగ్రెసు సంఘమువారికి తెలియజేస్తూ సంస్థానాలలోని స్వాతంత్ర్యోద్యమాలలో హెచ్చుగా కాంగ్రెసు పాల్గొనవలసిన దంటూ కోరారు.

అప్పుడే అరెస్టులు ప్రారంభము

సత్యాగ్రహము ప్రారంభము కాకుండానే ప్రభుత్వం సంస్థాన కాంగ్రెసు నాయకులను అరెస్టు చేయడము ప్రారంభించింది. ఈనెల 9 వ తేదీని తిరువాన్‌కూరు సత్యాగ్రహ కమిటీ సభ్యుడైన పి. కె. కుంజు గారిని కంటోన్మెంటు పోలీసులు అరెస్టుచేసి తీసుకుపోయారు. తన ఆరోగ్యం బాగులేదని అందుచేత బెయిలు ఇవ్వవలసినదని, ఆయన మేజస్ట్రీటును కోరాడు. కాని మేజస్ట్రీటు నిరాకరించాడు. కనీసము గవర్నమెంటు ఆసుపత్రిలోనయిన తనను వుంచమని ఆయన మరల కోరాడు. అది కూడ నిరాకరింపబడింది. ఆయనను కొత్యం జెయిలులో నిర్బంధించి వుంచారు.

గాంధిగారి షరతులు.

రాజకోటలో నున్న గాంధిగారికి, తిరువాన్‌కూరు కాంగ్రెసువారి నిశ్చయాన్ని తెలియజేయగా, ఆయన కొన్ని షరతులను నియమించి వాటి ప్రకారము సత్యాగ్రహం సాగించవలసి యుంటుందని ప్రకటన చేశాడు. ఆ షరతులు ఇవి. "సత్యాగ్రహము సాగించడానికి ముందు, సత్యాగ్రహులలోగాని, ప్రజలలోగాని ఏ మాత్రము హింస చెలరేగకుండా కాపుదల వుండాలి. తరువాత, సంస్థానాధికారులే హింసను రేపారని చెప్పడం సరియైన సమాధానంకాదు. రెండవది, శాసనోల్లంఘనం చేసేటప్పుడు, ప్రజలకు హానికరమైనట్టివియును, వానిని ఉల్లంఘించుటవలన ప్రజలకు బాధ కలిగించక ప్రభుత్వానికి పని చెప్పేశా, నాలను మాత్రమే ఉల్లంఘించాలి. మూడవది, ఈ ఉద్యమము అత్యధిక సంఖ్యాకులైన ప్రజలు పాల్గొనేదిగా వుండాలి. నాల్గవది, విద్యార్థులు ఈ ఉద్యమంలో పాల్గొనకూడదు."

రాజకోట పరిష్కారం

వల్లభాయి పటేలుతో చేసుకొనిన ఒడంబడికను రాజకోట ఠాకూర్ సాహెబ్ భగ్నము గావించడము వలన, గాంధిగారు తానే రాజకోటకు పోయి రాజీ కుదర్చడానికి నిశ్చయించుకున్నాడు. రాజకోట సంస్థానానికి పోయి, రైతులను, సత్యాగ్రహంచేసి జైలులో బంధింపబడిన ఖైదీలను విచారించి పరిస్థితులు తెలుసుకున్నారు. గాంధిగారి సంచారంలో ఆయనతోవున్న సంస్థాన దివాన్ వీరవల్లా ఒక దాని కొకటి సంబంధం లేకుండా నిమిషాని కొకమాట చెబుతూరావడముతో, సంస్థానాధికారుల వైఖరి గాంధిగారికి మరింత స్పష్టముగా కనబడింది. గాంధిజీ ఠాకూర్ సాహెబ్‌కు 2 వ తేదీన ఒకలేఖ వ్రాసి 24 గంటలలో సమాధానము ఇవ్వ



కపోతేనిరాహార దీక్షబూనుతానన్నాడు. ఆ లేఖలో గాంధిగారు కోరిన షరతులివి. (1) సంస్థాన ప్రభుత్వము జనవరి 21 వ తేదీని చేసిన 61 వ నంబరు ప్రకటన రద్దు చేయాలి. (2) సంస్కరణల సంఘములో ప్రజా పరిషత్తు తరఫున ఈ క్రింది నల్గురిని అంగీకరించాలి. 1. యు. యన్. ఢేబర్ 2. పి. పి. ఆనందా 3. వి. యం. శుక్లా 4. జె. హెచ్. జోషి 5. యస్. వి. మోడీ. ఈ సంఘానికి ఢేబర్‌గారు అధ్యక్షులుగా ఉండాలి. (3) ముగ్గురుగాని, అంతకు తక్కువగాని ప్రభుత్వోద్యోగులను ఈ కమిటీకి అవసరమైన కాగితాలు లెక్కలు సప్లయిచేసి సహాయకారులుగా నుండడానికి నియమించాలి. (4) మార్చి 22 వ తేదీకి ఈ కమిటీ పనులన్నీ పూర్తి కావాలి. (5) సత్యాగ్రహ ఖైదీల నందరిని వదలాలి. జరిమానాలు వాపసు ఇవ్వాలి.

ఠాకూర్ సాహెబ్ ఈ సూచనల నంగీకరించలేదు. గాంధిజీ 3 వ తేదీన నిరాహార దీక్ష బూనాడు. వివిధ రాష్ట్రాలలోని కాంగ్రెసుమంత్రివర్గాలు రాజప్రతినిధికి, అతడీ విషయములో కలుగజేసుకొనకపోతే రాజీనామా నివ్వవలసి వస్తుందని శ్రీముఖాలు పంపారు. గాంధిగారి ఆంతరంగిక కార్యదర్శి మహదేవ దేశాయి, బూలాభాయిగార్లు రాజప్రతినిధితో సంభాషణలు జరిపారు. రాజప్రతినిధి గాంధిజీకి ఒక లేఖ వ్రాశాడు. అందులో, ఒక ఫెడరల్‌జడ్జి రాజకోట పరిస్థితులను విచారించి తీర్పు ఇచ్చేటట్లు, దానికి ప్రజామండలి ఒప్పుకోవాలనీ. ఈ సూచనను అంగీకరిస్తూ గాంధి గారిని నిరాహార దీక్ష చాలించవలసిన దంటూ కోరాడు. గాంధిజీ అందుల కంగీకరించి ప్రాయోపవేశాన్ని చాలించాడు. దీనితో రాజకోట సమస్య పరిష్కారమైందని కొందరు సంతసించారు. గాంధిజీ కూడ తాను ఆశించినదానికంటె ఎక్కువ లాభమే చేకూరిందని హరిజన పత్రికలో వ్రాశాడు. అయితే ఈసమస్య ఎంత వరకు పరిష్కరింప బడింది? సంస్థానాధీశుల నిరంకుశత్వము ఎంతవరకు అరికట్టబడింది అనే ప్రశ్నలు సహజముగా ఉదయిస్తాయి. గాంధిగారు, వారి అనుయాయులు తలుస్తున్నట్లు పూర్తిగా నైతిక విజయము అయితే కావచ్చును. కాని ఆర్థికముగా, రాజకీయంగా, భౌతికముగా ప్రజల కెంతవరకు జయము చేకూరిందని కూడ చూడాలి. సంస్థాన ప్రజల హక్కులను సంరక్షించడానికి తన ప్రాణాలనైన సమర్పించడానికి తలపడి ప్రాయోపవేశ దీక్షను బూనిన మహాత్ముడు రాజప్రతినిధి కోరికపై, పవిత్రమైన ప్రజల హక్కులను అంత సులభంగా సామ్రాజ్యవాదుల భృత్యుడయిన ఒక ఫెడరల్ కోర్టు జడ్జీ చేతులలో పెట్టడానికి ఒప్పుకొనడము విచారకరమైన సంగతి. మన స్వాతంత్ర్య పోరాట చరిత్ర లో ఇట్టి ప్రభుత్వోద్యోగుల విచారణలవలన ప్రజల కోరికలు సిద్ధింపబడవనే విషయము మనకనేక సార్లు స్పష్టమైంది. అందుచేత గాంధిజీ ఈ షరతుకు ఒప్పుకొని యుండకూడదు. పటేలుతో గావించిన వాగ్దానాన్ని భగ్నపరచినాడని రుజువైన సమీద్దటకూడ ఠాకూరు సాహెబుకు మరల ఒక బ్రిటిషు జడ్జీముందు తన చర్యను సమర్థించుకోడానికి అవకాశము యిచ్చి వుండవలసిందికాదు. రాజప్రతినిధి కానీయండి, రాజకోట ఠాకూరు సాహెబు కానీయండి. ఆ సమస్యను తన ఎదుటనే పరిష్కరించేటట్లుగా చేయవలసినది.

ఈ ఫెడరలు జడ్జి తీర్పు ఎట్లు పరిణమింపనున్నను ఒక్క విషయము మాత్రము ముఖ్యమైనది. ఒక్క రాజకోటయేకాదు సంస్థానాలన్నిటి సమస్య ఎట్టి ఆలస్యము లేకుండ పరిష్కారము గావలసియున్నదని మహాత్ముడే ప్రకటించినాడు. ఇప్పటినుండియైన సంస్థాన ప్రజా పోరాటాలను కాంగ్రెసే నడిపి సంస్థానాలలో బాధ్యతాయుత ప్రభుత్వాల నేర్పరచుటకు పూనుకుంటుందని ఆశిస్తాము.

మద్రాసు కార్మిక శాసనసభ్యుని రాజీనామా

మంత్రివర్గ కార్మిక విధానంపట్ల అసమ్మతి.

యం. యస్. యం. రైల్వే కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి కామ్రేడు జి. కృష్ణమూర్తి గారు మద్రాసు కాంగ్రెస్ మంత్రివర్గపు కార్మిక విధానముతో అసంతృప్తిచెంది యిప్పటికి నెల రోజుల పూర్వమే శాసన సభ్యత్వానికి తమ రాజీనామాను పంపారని తెలియుచున్నది. తిరిగి యెన్నికకై పోటీ చేస్తారనికూడ తెలియుచున్నది.

ఆంధ్రరాష్ట్ర కార్మికమహాసభ.

విశాఖపట్నంజిల్లా, నెల్లిమర్ల గ్రామములో ఆంధ్రరాష్ట్రకార్మిక మహాసభను మార్చినెలలో జరపదలచినట్లు యిదివరలోనే ప్రకటించబడెను. సభామండపము, ప్రతినిధుల బసలు, ప్రదర్శన శాలలు, వడిగా నిర్మాణము పూర్తికావచ్చుచున్నవి.

తెలుగుదేశమున ప్రస్తుతము వివిధ పరిశ్రమలలో-గనులు, నార, పంచదార, కాగితము, పొగాకు, బట్టలు, రైసు, వేరుశనగ, ఫాక్టరీలలో హార్బరు పోర్టులలో, అచ్చుపనులలో, రైల్వేలలో, బస్సులలో వేలకొలది కార్మికులు పనిచేయుచున్నారు. గత పది సంవత్సరముల నుండియే ఆంధ్రదేశములో ఆంధ్రదేశ కార్మికుల గురించి సంఘములు పెట్టే ప్రయత్నము ప్రారంభింపబడెను. ఈ స్వల్ప కాలములో యీ ప్రయత్నము రాను రాను సఫలీకృతమై కార్మికులలో నూతన చైతన్యము కలిగి వారి ఉద్యమము దినదినము బలపడుచునే యుండెను.

రాబోవు రాజకీయ పోరాటములో కార్మికులెట్లు పాల్గొనవలెను, యజమానులతో తమ దైనందిన తగవులలో నెట్టి విధానము నవలంబింపవలెను, అనే విషయములగురించి దూరదృష్టితో నిర్ణయించుటకు కార్మికులంతా ఒకచోట సమావేశమై ముందు కార్యక్రమము, విధానము నేర్పరచుకొని ఒకేమాటతో, ఒకేనడకతో సాగిపోవలసియున్నది. ఈకారణముచే నెల్లిమర్ల మహాసభ చాలముఖ్యమైనది. కావున వివిధ పరిశ్రమలలోని కార్మికులు తమ ప్రతినిధులను యీమహాసభకు పంపి సభ జయప్రదమగుటకు తోడ్పడ కోరెదను. సభ జరుగు తేదీలగురించి ముందు ప్రకటించబడును.

అని ఆహ్వాన సంఘాధ్యక్షులైన పెమ్మరాజు వెంకట్రావుగారు వ్రాయుచున్నారు

కాకినాడ

1000 మంది కార్మికుల సమ్మె.

తాటినార వర్తక సంఘమువారు పీచు కార్మికుల కోర్కెలు నిరాకరించిరి. అందుమీద 9 వ తేదీనుంచి పీచుకార్మికులు సమ్మె చేస్తున్నారు. పట్టణములోని యితరకార్మికులు కూడ పూరేగింపులందు, ప్రదర్శనములందు పాల్గొని సమ్మెచేయు కార్మికులకు అన్నివిధముల సహాయపడుచున్నారు. శ్రీ పేరి రామారావుగారనే వర్తక శిఖామణి కార్మికుల కోర్కెలు అంగీక

మాకారపాలెం ఆదిగాగల పీచు పరిశ్రమ కేంద్రములనుంచి పనివారల కాకినాడకు రాకుండునట్లు చేయుటకు ఆ గ్రామాలందుకూడ తీవ్రముగ కృషచెయ్యాలి. సమ్మె త్వరలో పరిష్కారమయ్యే సూచన లగుపడుటలేదు.

కాకినాడలో మరియొకసమ్మె.

సుమారు 20 రోజులనుండి ఉప్పు పనివారు సమ్మెసాగిస్తున్నారు. పికెటింగు తీవ్రముగా సాగుచున్నది.

రించారు. ఆ కంపెనీ కూలీలుమాత్రమేపనిచేస్తున్నారు. మిగిలిన కంపెనీలలో పని జరగకుండా కార్మికులు పికిటింగు తీవ్రముగా చేస్తున్నారు. కార్మిక స్త్రీలుకూడ ధైర్యోత్సాహములతో పాల్గొనుచున్నారు. ఇద్దరు స్త్రీలు ముమ్మందుకు వచ్చి వుపన్యాసాలు యిస్తూ కార్మికులందరిని వుత్సాహవంతులుగా చేస్తున్నారు. తునికి మూడుమైళ్ళ దూరములోవున్న భీమవరపుకోట కంపెనీముందు, ఉప్పుఫ్యాక్టరీముందు పూరేగింపులు, సభలు సాగుచున్నవి.

చిట్టివలస

జ్యూటు కార్మికులకు సానుభూతి తెలియచేయుచూ, ఆంధ్రదేశములోని ముఖ్యపట్టణాలలో బహిరంగ సభలు జరిగినవి. ఇక్కడ జరిగిన కాల్పులనుగూర్చి విచారించుటకై రాష్ట్ర కాంగ్రెస్‌వారిచే పంపబడిన శ్రీ రంగనాయగారు తమ రిపోర్టు యింకనూ ప్రచురించలేదు. ఇంతవరకునూ, మృతినొందిన కార్మికుని కుటుంబానికి యేవిధమైన నష్టపరిహారమును యివ్వలేదు. కాల్పులను గూర్చి ప్రభుత్వము డిపార్టుమెంటల్ ఇంక్వైరీ జరుపుచున్నట్లు తెలియుచున్నది. అసలు కాల్పులకు కారణభూతులైన పోలీసు వుద్యోగస్థులను తొలిగించి, కార్మికుల కోర్కెలను నెరవేర్చుటకు కాంగ్రెస్ మంత్రివర్గము పూనుకోవాలి.

కాళీపట్నంలో పోలీసుల అఘాయిత్యాలు

కాళీపట్నంలో 8 వ తేదీన జరిగిన లాఠీచార్జీలో కొప్పాడ కనకయ్య అను 70 సం॥ ముసలి రైతుకు బలమైన దెబ్బలు తగిలినవి, రేవు రామస్వామిఅను 90 సం॥ ముసలి రైతుకు కూడా దెబ్బలు తగిలినవి. కవురు ముత్యాలమ్మ అను 8 నెలల గర్భిణీ స్త్రీ నడుముమీద లాఠీ పోట్లు తగులుటవలన నెత్తురుకక్కి ప్రమాదస్థితిలోనున్నది. కొల్లా వెంకటరత్నం అను రైతు సేవకుని స్పృహతప్పి పడిపోవునట్లుకొట్టి, పడిఉన్న వానిమీద నీరుపోసి స్పృహ వచ్చిన తరువాత మరల పోలీసులు కొట్టిరి. ఆరోజు జరిగిన లాఠీచార్జీలో 30 మంది స్త్రీలకు, 45 మంది పురుషులకూ దెబ్బలు తగిలినవి.

పోలీసులు జాతీయ జెండాలను కాలిక్రిందవేసి త్రొక్కి బురదలో పారవేశారు.

అరెస్టు చేయబడిన స్త్రీలలో 27 మందిని 11 వ తేదీన నర్సాపురంలో తహసీల్దారుగారు విచారణ జరిపారు. ఆస్త్రీలు నేరము చేయలేదనీ, దొమ్మీగా వెళ్ళలేదనీ, సత్యాగ్రహము చేశామనీ చెప్పినా బలవంతంగా కొంతమంది దగ్గర నేరం చేశామని స్టేటుమెంట్లు తీసుకున్నారు. కొంతమంది అటువంటి స్టేటుమెంట్లు ఇవ్వ నిరాకరించారు. అయినప్పటికీ లాయర్ల సలహా తీసుకొనుటకు అవకాశం ఇవ్వకుండా వెంటనే సాక్ష్యం లేకుండానే తహసిల్దారుగారు ఆ 27 మంది స్త్రీలకు ఒక్కొక్కరికి 6 మాసముల కఠిన శిక్ష వేశామని నోటితోచెప్పి వెళ్ళిపోయారు. అందులో ఇద్దరు స్త్రీలు ఇంటిదగ్గర వదలిపెట్టిన చంటిబిడ్డలను తెప్పించుకొనుట కవకాశమీయకుండా ఆరాత్రే రాయవెల్లూరు జైలుకు పంపివేశారు. తణుకులో ఉన్నవారినిగూడ ఈవిధంగానే త్వర త్వరగా విచారణజరిపి జైలుకు పంపుటకు 12 వ తేదీన తహసీల్దారుగారు తణుకు వెళ్లినట్లుగా తెలియుచున్నది.

10, 11 తేదీలను సత్యాగ్రహం శాంతంగా సాగింది. లాఠీచార్జీలు, అరెస్టులు లేవు. రాష్ట్ర కాంగ్రెసు సంఘ అధ్యక్షుడు పట్టాభిగారు కాళీపట్నం రైతుల వ్యవహారంలో జోక్యం కల్గించుకొంటామని సత్యాగ్రహం అపు చేయవలసినదని ఇచ్చిన టెలిగ్రాములవలననూ, ప్రధానమంత్రి రాజగోపాలాచారిగారు జోక్యం కల్గించుకొంటామని ఇచ్చిన టెలిగ్రాము వలననూ రైతులు సత్యాగ్రహాన్ని తాత్కాలికముగా అపుజేశారు.

విజ్ఞప్తి.

తమ భూములను అక్రమముగా జమీందారు పోలీసు సహాయంతో ఆక్రమించుకొనుటకు చేయుచున్న ప్రయత్నములను నిరోధించుచూ, సత్యాగ్రహముచేయుచున్న కాళీపట్నం రైతులకు సానుభూతి తెలుపుచూ, ఆంధ్రరాష్ట్రమందన్నిచోట్లా పార్టీసభ్యులు ఇప్పటినుండి సభలుపెట్టి, నిజ పరిస్థితులను ప్రజలకు తెలియపర్చి, పోలీసు జులుమును ఖండించుచూ, పోలీసు జులుమునుగూర్చి విచారణ వెంటనే జరుపవలయుననియూ, వెంటనే ప్రభుత్వం జోక్యం కల్గించుకొని రైతు హక్కులను కాపాడవలెననియూ, అరెస్టుచేసినవారిని వెంటనే విడుదల చేయవలెననియు ప్రధాన మంత్రికి, పత్రికలకు తీర్మానములను పంపాలి.

కాళీపట్నం రైతుల సహాయార్థం చందాలను వసూలుజేసి "ఉద్దరాజు రామం, C/o తోలేటి పేర్రాజుగారు, నర్సాపురం" అను చిరునామాకు పంపాలి.

పి. సుందరయ్య,
కార్యదర్శి,
ఆం॥ రా॥ కాం॥ సోషలిష్టుపార్టీ.

విజయనగరం

విజయనగరం ప్రెస్ వర్కర్సు 10-3-39 తేదిన సమావేశమై 13 వ తేదిలోపు యజమానులు తమ కోర్కెలను అంగీకరించని యెడల 14 వ తేదినుంచి జనరల్ స్ట్రయిక్ చేయవలసి వచ్చునని తీర్మానించి, యజమానులు తమ సమాధానమును సంఘ ప్రతినిధులకు తెలియ చేయవలెనని కోరిరి.

విశాఖపట్టణము

హార్బరు కార్మికులు 6 వ తేదీన తమ కష్టాలను తెలియచేయుచూ కార్మిక మంత్రి గిరి గారికి సన్మానపత్రము సమర్పించిరి. వారు యజమానులు రిజష్టరు చేయబడిన సంఘములను విధిగా గుర్తించుటకు శాసనము చెయ్యాలనికూడ కోరిరి. గిరిగారు సమాధానమిచ్చుచూ సంఘ రిజిష్టర్లను జిల్లా కలెక్టరుగారికి తనిఖీ చేయుటకై పంపాలని, తరవాతకూడ పోర్టు అధికారులు సంఘమును గుర్తించుటకు నిరాకరించన యడల తాము కేంద్ర ప్రభుత్వమునకు వ్రాయుదుమని చెప్పిరి.

రాజమండ్రి

రైల్వేకార్మికుని అపాయము

8-3-38 సాయంత్రం 4 గంటల ప్రాంతాన రైల్వే యింజనుముందు చక్రాలరక్షణకై యేర్పడిన కౌకేచరు (చాలా బరువుగలది) గుడ్ల రామానుజులు అను కార్మికుని కాలి వ్రేలిమీద పడుటవలన వ్రేలు పూర్తిగా తెగిపోయినది. కామ్రేడ్ రామానుజులు స్మృతి తప్పి పడిపోయినాడు. ఆరోజున 8 మంది లేపవలసినదానిని 4 గురి చేత నెత్తించుటవలన యీ ప్రమాదము జరిగినది.

దీని విషయము యూనియన్‌వారు తగు శ్రద్ధ తీసుకొని, నష్టపరిహారం వచ్చునట్లు చేస్తారని తలుస్తాము

ఈ నెలలోనే బెజవాడబ్రాంచి రైల్వే కార్మిక కాన్ఫరెన్సు జరుగునని తెలియుచున్నది.

తెనాలి

లక్ష్మీప్రెస్ యజమానులు కొన్ని నిబంధనలను యేర్పరచి తమవద్ద పనిచేయు కార్మికులు వాటిని అంగీకరించుచూ సంతకములు చేయవలె నన్నట్లు తెలియుచున్నది. ఆ నిబంధనలలో చాలబాగమున పనివారల కోర్కెలకు విరుద్ధముకాన యూనియన్ సభ్యులందరు సమావేశమై వాటిని నిరాకరించవలెనని, లక్ష్మీ ప్రెస్ పనివారెవ్వరు సంతకములు చేయకూడదని నిశ్చయించుకొనిరి. ఈ ప్రెస్‌పనివారెవ్వరు సంతకములు చేయలేదు. 12 వ తేదీనుండి 40 మంది పనివారలు సమ్మెచేయుచున్నారు.

కూలీకుటుంబానికి నష్టపరిహారం

సుమారు 5 మాసముల క్రిందట తెనాలి మ్యునిసిపాలిటీలో రోడ్డుబాగుచేయు బండక్రింద అబండనులాగే కొర్రపాటి నాగయ్య అను కూలీ పడి చనిపోయాడు. ఆయనకు తల్లి, తమ్ముడు, భార్య వున్నారు. వారి ముగ్గురకు మ్యునిసిపాలిటీనుండి నష్టపరిహారం ఇప్పించవలసినదిగా స్థానిక సోషలిష్టుపార్టీవారు మదరాసు లేబరు కమిషనరుకు రిపోర్టు చేసారు. దానిమీదట లేబరుకమీషనరు విచారించి రు 501-0-0 లు చనిపోయిన నాగయ్య కుటుంబమునకు మ్యునిసిపాలిటీ నుంచి ఇప్పించారు.

కాశీపట్నంలో సత్యాగ్రహ సమరం

100 ఎరస్టులు — లాఠీ ఛార్జీలు

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టుపార్టీ సంయుక్త కార్యదర్శి కామ్రేడ్ జొన్నలగడ్డ రామలింగయ్య, పార్టీ కార్యనిర్వాహక సభ్యుడైన కామ్రేడ్ అల్లూరి సత్యనారాయణ, పశ్చిమ గోదావరిజిల్లా సోషలిస్టు ప్రచారకుడు కామ్రేడ్ కలిదిండి బంగారం గారలకు "లా–ఆర్డర్లు" అంటే గౌరవంలేదనీ; వీరు కాశీపట్నం. పాత పాడు గ్రామ రైతుల్ని ప్రోత్సహించి కాశీపట్నం జమీందారుగారికి చెందిన భూముల్ని స్వాధీన పరచుకోమని రైతుల్ని రెచ్చగొట్టుతున్నారనీ; పోలీసు ఉద్యోగస్థులు, జమీందారుగారి నౌకర్లు పడవలలలో వస్తూంటే ఆ పడవలను ముంచడానికి మార్గాలు కనిపెట్టుతున్నారనీ; అనేక బహిరంగ సభలలో రైతుల్ని దౌర్జన్యానికి ప్రోత్సహించారనీ; 27-2-39 వ తేదీని పైగా స్థుల్ని 144 వ సెక్షను ధిక్కరించుటకు పురిగొల్పారనీ; మొదలైనఆరోపణలతో 3-3-39 వ తేదీని నర్సాపురం (పశ్చిమ గోదావరి) సబ్ మేజస్ట్రేటు 107 వ సెక్షన్ క్రింద వీరి ముగ్గురు మీద చర్య ఎందుకు తీసుకొనకూడదో సంజాయిషీ చెప్పవలసిందనీ; ఒక్కొక్కరు 500 రూపాయలచొప్పున పూచీకత్తులు వ్రాసి యివ్వవలెననీ; ఒక్కొక్కరికి యిద్దరుచొప్పున పైముగ్గురూ ఒక సంవత్సరం వరకూ శాంతికి భంగం కలిగే పనులు చేయకుండా రు 500 ల చొప్పున జామీను యివ్వవలెననీ, తెలియజేశారు. 6-3-39 వ తేదీని నర్సాపురం కలెక్టరు గారి కోర్టులో హాజరు కావలసిందంటూ సమన్లు జారీచేయబడ్డాయి. కామ్రేడ్ కలిదిండి బంగారం గారు కోర్టులో హాజరై తాను నేరస్తుణ్ణి కాననీ, డిఫెన్సు చేసుకొందుననీ, సొంత జామీనుమీద విడిచిపెట్టవలసిందని కోరగా మేజస్ట్రేటుగారు నిరాకరించి, పోలీసులకు ఆయన్ని స్వాధీనం చేశారు.

రైతుల సత్యాగ్రహం
ఎరస్టులు — లాఠీ చార్జీ.

కాశీపట్నంలో అనాదినుంచీ చేపలను పట్టుకొని జీవనం గడుపుకొంటూన్న వందల కొద్దీ రైతు కుటుంబాలు అనేక మాసాలనుంచి జమీందారుగారి అక్రమ చర్యలకు గురి అవుతున్నాయి. రైతులకు మొత్తం 800 యకరాల భూమిని వ్రాసి యిస్తావని మభ్యపెట్టి.జమీందారుగారు పంటకాలువ ఒకటి శాంక్షన్ చేయించుకొని, కాలువ పూర్తి అయాక భూమి యావత్తూ తనదేననిదాన్ని అమ్మకోవడం ప్రారంభించారు. రైతులు చేపలు పట్టుకోవడానికీ, సేద్యం చేసుకోవడానికి హక్కులేకుండా పోయింది. జమీందారుగారు యీగ్రామంలో 144 వ సెక్షన్ యిప్పించి. పోలీసుల సహాయంతో భూముల కొలతలుకూడా ప్రారంభించారు. రైతులు తమకు న్యాయంగా రావలసిన భూమిని విడిచిపెట్టక. 7-3-39 వ తేదీనిసత్యాగ్రహంప్రారంభించారు.అంతకు తొలిరోజునే సుమారు 25 మంది రిజర్వు పోలీసులు, 20 మంది సాధారణ పోలీసులు, ఇద్దరు సబ్ యిన్స్పెక్టర్లు, డిప్యూటీ సూపరింటెండెంటు, భీమవరంనుంచి కాశీపట్నం వెళ్లారు. మరునాడు, అనగా 8 వ తేదీని, మధ్యాహ్నం 10 గంటలకు పోలీసుల సహాయంతో భూములు కొలుస్తూంటే, సుమారు 300 మంది రైతులు శాంతంగా ప్రతిఘటించి సత్యాగ్రహం చేయడానికి బయల్దేరారు. రిజర్వు దళం వారిని అడ్డగించి, అపు చేసింది. రైతులందరూ శాంతంగా కూర్చున్నారు. వారిలో 50 మంది స్త్రీలుకూడా ఉన్నారు. సూపరింటెండెంటు వచ్చి, రెండు ఫర్లాంగుల దూరంలో ఉన్న భూపతిరాజు లక్ష్మీ నరసింహరాజుగారి (జిల్లా రైతు సంఘ ఉపాధ్యక్షులు)ని, సంకు అప్పారావుగారి (తాలూకా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్యదర్శి)ని, పిలిచి ఎరస్టు చేశారు. తరువాత, ఆ భూమి రైతులదికాదని తెల్పుతూ, వారందరినీ వెళ్ళి పొమ్మనగా, రైతులు నిరాకరించారు. పోలీసులు వారిలో 32 రిని ఎరస్టుచేసి, సంకెళ్ళతో ఆ రాత్రే నాయుడుపాలెం తీసుకు వచ్చారు. ఆ రాత్రి ఖైదీలకు ఎట్టి ఆహారం యివ్వలేదు. మర్నాడు 8 వ తేదీ మధ్యాహ్నం వరకూ కూడా అన్నం పెట్టకుండా, పొలాలలోనే ఉంచ బడ్డారు.

లాఠీ చార్జి.

8 వ తేదీని కాశీపట్నంలో తిరిగి సత్యాగ్రహం జరిగింది. అనాడు లాఠీచార్జి చాలా క్రూరంగా జరిగింది. స్త్రీలకుకూడా దెబ్బలు తగిలాయి. ఒక ముసలి రైతుకు రక్తం ప్రవహించే గాయాలు తగిలాయి. వాలంటీరు వెంకటరత్నం స్మృతి తప్పి పడిపోయాడు. అయినా అతన్ని పోలీసులు ఎరస్టు చేశారు.

9 వ తేదీని అల్లూరి అన్నాపూర్ణాదేవి (జిల్లా బోర్డు మెంబరు) ఉద్దరాజు మాణిక్యాంబగార్ల నాయకత్వానసుమారు 400 మంది రైతులు తిరిగి సత్యాగ్రహం చేశారు. అన్నపూర్ణాదేవిగారినీ, మాణిక్యాంబగారినీ, 40 మంది యితర సత్యాగ్రహుల్నీ పోలీసులు ఎరస్టుచేసి, అనరాని మాటలుఅని, తీసుకు వెళ్ళారు.

10 వ తేదీని కాశీపట్నంలో తిరిగి సత్యాగ్రహం జరిగింది. 20 మంది స్త్రీలను ఎరస్టు చేశారు.

9-3-39 వ తేదీని పొలమూరులో గ్రామ కాంగ్రెసు కమిటీ యాజమాన్యమున, శ్రీ కలిదిండి పెద సుబ్బరాజుగారి అధ్యక్షతను; యనమదుర్రు గ్రామంలో గంధం రామారావుగారి అధ్యక్షతను జరిగిన బహిరంగసభలలో కాశీపట్నం రైతుల సత్యాగ్రహోద్యమానికి అభినందనములు తెల్పుచూ ఉపన్యాసాలు, తీర్మానాలు గావించబడెను.

* * *

శ్రోత్రియందార్ల అక్రమాలు.

నెల్లూరు జిల్లా ఆత్మకూరు తాలూకాలో కుప్పురుపాడు అనే శ్రోత్రియం గ్రామమున్నది. ఈ గ్రామం శ్రీమదద్దంకి తిరుమల తాతాచార్యగార్లది. ఈ గ్రామంలో శిస్తులు వసూలు జేయుటకు పేష్కారుగారున్నారు. వారిది ఆ గ్రామంకాదు శిస్తులు వసూలుమాత్రం నిక్కచ్చిగా జేస్తారు. వీరు రైతుల కష్టాలనుగూర్చి తమ యజమానుల కెప్పుడూ తెల్పిన పాపాన పోలేదు. శ్రోత్రియందారుతో చెప్పుకోబోతే వారుండేచోటే రైతులెరుగరు. ఈ గ్రామంలోని ఏ ఒకరిద్దరుతప్ప తక్కినవారు వీరి పేరెరుగరు సరిగదా వీరి మొగమైన ఎరుగరు. ఈ గ్రామానికొక చెరువున్నది. దీన్ని యిప్పటికి 39 యేండ్లక్రితం మరమ్మతు చేయించారు. మళ్ళీ 1938 లో రు 300 పెట్టి మరమ్మతు చేయించారు. కాని అందులో రైతులచే రు 100 లు విలువగల వెట్టిచాకిరి (మట్టిపని వగయిరా) చేయించారు. యీ చెర్వుకు వరువ మంచిది లేదుగాబట్టి 3 ఏండ్లకొకసారిగూడా చెర్వు నిండదు. కాబట్టి యీ గ్రామస్థులు పూర్తిపంట పండించుకొన నోచుకొనలేదు. రెమిషన్ అంటే యేమో యెరుగక పూర్తి శిస్తులు కట్టుంటారు. యీ సంవత్సరం వర్షాలు లేనందున చెరువుకు బహుకొద్దిగా నీళ్ళువచ్చినవి. కాబట్టి పైర్లు యెండిపోయినవి. వసతిగల రైతులు బావులలో నీళ్ళు రేయింబవళ్లు కష్టించి కపిల (కూట) తోడుకోబట్టి సగంపంటపండినది. పేదరైతులకు పంటేలేదు. పేష్కారుగారప్పుడే పైకంవసూలు జేస్తున్నారు. యీ సంవత్సరం మాతాలూకాలో చాలగ్రామాలకు పైర్లు యెండిపోయినందున సర్కారువారు శిస్తు ముజరా యిస్తున్నారు.కాని యీ గ్రామంలోమాత్రం పేష్కారుగారు పూర్తి శిస్తు వసూలు జేస్తున్నారు. విద్య పన్ను రు 1కి 0-0-2 గవర్నమెంటువారు యెక్కిస్తే యీ శ్రోత్రియందారుగారూ హెచ్చించారు. కాని గవర్నమెంటువారు నిరుడు రు 1కి 0-0-2 తగ్గిస్తే వీరుమాత్రం తగ్గించలేదు. ప్రజలకష్టములు ఎగు రైరుగరుయీ శ్రోత్రియందార్లు అని శ్రీగంగా కొండయ్యగారువ్రాస్తున్నారు.

* * *

వెదళ్ళ చెరువు కూలీల కడగండ్లు

వెదళ్ళ చెరువు గ్రామం (తిరుపతికి సమీపములో) 8 మాసాల క్రితం కూలీలకు-రైతులకు మధ్య సంఘర్షణ జరిగింది. చుట్టు ప్రక్కల గ్రామాలలో కూలీలకిచ్చే కూలి యిక్కడకూడా యివ్వవలసిందని కూలీలు కోరారు. నౌకర్ల స్థితి మరీ ఘోరంగా ఉంది. సంవత్సరానికి 4 రూపాయల జీతం, 80 కుంచాల వడ్లు ఒక్కొక్క నౌకరుకు యిస్తారు. వాని భార్య కూడా వెట్టిచాకిరి చేస్తూ ఉండాలి. వీరు ప్రారంభంలో 20 లేక 30 రూపాయలు తీసుకుంటారు. సంవత్సరం పొడుగున కష్టపడి, సంవత్సరాంతములో లెక్కచూసుకొంటే, సాధారణముగా 80 కుంచాల వడ్లు వడ్డీక్రిందే జమ అయిపోతుంది. మిగిలిన 4 రూపాయలు గుడ్డలకు పోతే, నౌకర్లకు మిగిలేది అప్పు. ఏయేటి కాయేడు క్రమంగా వృద్ధిచెందే యీ ఋణాన్ని తీర్చుకోడానికి శాశ్వతంగా బానిస జీవితం గడపవలసిందే.

ఈ యిబ్బందులు తొలగించుకోవడానికి, ప్రక్కనున్న గ్రామాలలో యివ్వబడే కూలి అయినా పొందడానికి, కూలీలు — నౌకర్లు సమ్మె చేశారు. కొంతకాలం సమ్మె నడిచింది. రైతులు కొన్ని చిన్న కోరికలను మాత్రం సఫలం చేశారు. కాని, వెంటనే కూలీలను అణచడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. సమ్మెలో పాల్గొన్న కూలీ ముఠాకు చెందిన తోటీలను, తలారులను తొలగించి, క్రొత్తవారిని నియమించారు. పూర్వపు సమ్మెదారులు వ్యవసాయం చేస్తూన్న నీరుకట్టు మాన్యాలను, వారి వద్ద లాగి మరొక ముఠాకు యిచ్చి, ఈ విధముగా కూలీలలో చీలికను కలిగించారు. కాని, మొదటి ముఠాకూలీలు మాన్యాల్ని వదులుకోలేదు. పనులు మాత్రమే వదులుకొన్నారు. చిరకాలంనుంచి జీవనాధారమైన ఆ మాన్యాలను కూలీలు విడిచిపెట్టలేదు: వాటి మీదపైరుచేశాక,కొత్తగా రైతులచేత నియమించబడిన తలారికి అందులో సగం పంచిపెట్టమన్నారు. కూలీలు నిరాకరించి, తిరిగి సమ్మె ప్రారంభించారు. నౌకర్లు కూడా సమ్మెలో చేరారు. మాన్యాలకు సంబంధించిన బావిలో రైతులు నీరుకట్టడానికి పోయారు. హరిజనులు ఆక్షేపణ తెలిపారు. ఎందువల్లనంటే ఆ బావి హరిజనులకు సగం,మంగలిమరియొకరి మాన్యానికి సగం, హక్కుకలిగి ఉండేది. ఆ భూమిని రైతులు కొనియుండడంచేత అందలి బావిలో పాతిక వంతు నీటిని ఏమైనా చేయడానికి హక్కున్నదనిరైతులవాదన.కాని,రైతుకొన్నది మాన్యం కాదనిన్నీ, ఎవరిదో పట్టాభూమి అనిన్నీ, దానికి చెరువు నీటి ఆధారం ఉన్నదనీ బావినీటిన్నీ పైవారికెట్టి హక్కులేదని కూలీలవాదన. సమ్మె శాంతియుతంగా జరుగుతోంది. అయినారైతులు కూలీలమీద కేసులు బనాయిస్తున్నారు.

కృష్ణాజిల్లా సోషలిస్టు పార్టీ మహాసభ

ది 25-2-39 వ తేదీన గుడివాడ తాలూకా జమీ గొల్వేపల్లిలో కామ్రేడ్ చలసాని వాసుదేవరావుగారి అధ్యక్షతను కృష్ణాజిల్లా కాం॥ సో॥ పార్టీ తృతీయ కాన్ఫరెన్సు జరిగింది.

తీర్మానములు:—

పార్టీ కార్యదర్శిగారిచే చదవబడిన రిపోర్టును చర్చించి ఆమోదించబడెను.

స్వదేశ సంస్థానములు.

డెంకనాల్ తిరువాన్కూరు, రాజకోట మొదలగు స్వదేశ సంస్థానములలో అతి కనీసమైన పౌరసత్వపు హక్కుల సంపాదనకోసం ధైర్యముగా పోరాడుచున్న సంస్థాన ప్రజలను యీ సభవారు అభినందించుచున్నారు. సంస్థాన ప్రజలు తమ పోరాటమును తామేసాగించు కొనవలెనను తీర్మానమును అతివాదులు వ్యతిరేకించినను మితవాదులు హరిపురా కాంగ్రెసులో నెగ్గించుకొనిరి. కాని ఈరోజునకైనను గాంధీజీ యితరమితవాదులు సంస్థాన ప్రజల పోరాటము యావద్భారత సమస్యగా జేయవలెనని గుర్తించినందులకు సంతసించుచు, సంస్థాప్రజలపోరాటాల్గొని, నడుపుచున్నవారిని యీ సభవారు అభినందించుచున్నారు.

సంస్థానప్రజలు సంస్థానాధీశుల మధ్య జరుగుచున్న పోరాటము ఇండియా ప్రజలు బ్రిటిషు సామ్రాజ్యమునకుజ రుగుచున్న పోరాటములో అంతర్భాగము కనుక సంస్థాన ప్రజల పోరాటమును కాంగ్రెసు నాయకత్వము క్రిందనే జరుపబడవలెనని యీ సభవారు కోరుచున్నారు. కాంగ్రెసుమంత్రులు స్వదేశ సంస్థానాల రక్షణ చట్టమును బ్రిటిషు ఇండియాలో ఎట్టి పరిస్థితులలోను అమలు జరుపకూడదని యీ సభవారు కోరుచున్నారు.

క్రిమినల్ ట్రైబ్సు యాక్టు

ఎరుకల, యానాదుల, వడ్డి మొదలగుజాతి వారు సిటీ యాక్టుక్రింద చాలమంది యున్నారు. వీరు నానా రకముల బాధలు పడుచు పోలీసువారి దౌర్జన్యములక్రింద నలిగిపోవుచున్నారు. కాంగ్రెసువారు మంత్రిపదవులలోనున్నను యీ రోజులలో కూడ భారతదేశ పౌరులగువారికి యాటవిక జాతివారనే సాకు చేత యింకను సిటీ యాక్టు నుంచుట చాల హాస్యాస్పదము. కాన వారిని సిటీ యాక్టు నుండి తొలగింపవలసినదిగా మద్రాసు ప్రభుత్వమువారిని కోరుచున్నారు.

నైజాం సంస్థానం—బ్రిటిషు ఇండియా

నైజాము సంస్థానము పరిసరములలోను, మధ్యలోను బ్రిటిషుఇండియా గ్రామములున్నవి. అయా గ్రామ ప్రజలు నైజాము గ్రామముల గుండా, యస్. యస్. ఆర్. వై. ద్వారా తమ స్వంత పనులమీద బ్రిటిషు ఇండియా వాసులు పోవలసియున్నది. అట్టి సమయంలో నైజాము పోలీసులు ఈ ప్రజలను భయపెట్టి పోలీసు ఠానాలకు తీసుకొనుపోవుచున్నారు. ఇది బ్రిటిషు ఇండియా ప్రజల పౌరసత్వ హక్కులకు భంగకరము కాన మద్రాసు ప్రభుత్వమువారు అట్టి బ్రిటిషు ఇండియా ప్రజలకు తగు రక్షణ నీయవలసినదిగా ఈ సభవారు కోరుచున్నారు.

ప్రకాశం కమిటీ రిపోర్టు.

జమీందారీ విధానము పూర్తిగ రద్దు గావించి యేగట్టము రైతులకు సంపూర్ణ రక్షణ కలుగజేయదు. అయినప్పటికి 130 సంవత్సరముల నుండి జమీందారుల పీడనచే నలిగిపోవుచున్న రైతుల హక్కులను కొంతవరకైన ప్రకాశంగారి జమీందారీ కమిటీరిపోర్టు రక్షించుట కుపకరించునని యీసభవారు అభిప్రాయపడుచు వెంటనే, ఆంధ్రరాష్ట్ర రైతు సంఘ సూచనలతోకూడిన చట్టమును గావించినగాని రైతులకు మేలు కలుగజాలదని యీ సభవారు నమ్ముచున్నారు.

కాంగ్రెసు మంత్రులు—కార్మిక విధానం

కాంగ్రెసు మంత్రులు దాదాపు 2 సం॥ల నుండి పనిచేయుచున్నను యింకను కాంగ్రెసు ఎన్నిక ప్రణాళికలోని కార్మిక కార్యక్రమమును మద్రాసు రాష్ట్రములో అమలు జరుపలేదు మద్రాసు కాంగ్రెసు మంత్రులు న్యాయమయిన హక్కుల కొరకు కార్మికులు జరుపుచున్న పోరాటములను నిరుత్సాహపరచుట, పికెటింగు గురించి విపరీత నిర్వచనము చేయుట, కార్మికులమీద పోలీసులు చేయుచున్న దుండగములు సమర్థించుట, పైగా పోలీసుల కాల్పులను సమర్థించి, పెట్టుబడిదారులకు సహాయపడుచున్నారు. చీరాల, చిట్టివలసలో కాంగ్రెసు మంత్రులవలంబించిన కార్మిక విధానము బ్రిటిషు పెట్టుబడిదారులకు సహాయపడింది.యజమానులకు కార్మికులకు వచ్చిన తగాదాలలో పరస్పర ఒడంబడిక మంచిదని చెప్పుచు, దానికి తగిన పరిస్థితులను ఏర్పరచనందున అనగా కనీసం కార్మిక సంఘములను ఎట్టి షరతులులేకుండా యజమానులు గుర్తించునట్లు ఏర్పాటు చేయకపోవుట వలన,మద్రాసు మంత్రుల కార్మిక విధానము యజమానులకు అనుకూలముగా వుంటున్నది. ఈ పాలసీ ఎన్నికల ప్రణాళికకు విరుద్ధం.

కాంగ్రెసు మంత్రులు ఎన్నిక ప్రణాళికలో వుదహరించిన కోర్కెలను యిచ్చుచూ వెంటనే శాసనాలు చెయ్యాలి. ఫ్యాక్టరీ యాక్టు చిన్న చిన్న వర్కుషాపులకుకూవ వర్తించేటట్లు చేయాలి. ఇందుకై పార్టీ సభ్యులు తీవ్ర ఆందోళన చేయాలి.

రైతుసంఘములు—మన కర్తవ్యము.

రైతుసంఘాల బాధ్యత నానాటికి హెచ్చుచున్నది. రైతు వుద్యమము తీవ్రరూపము దాల్చుచున్నది. అయినప్పటికి రైతు సంఘాలు ప్రస్తుతపు రాజకీయ పరిస్థితులలో తగినపాత్ర వహించగల బలిష్ఠమైన నిర్మాణమును కల్గిలేవు. అందుచే ప్రస్తుతపు రాజకీయ పరిస్థితులలో తగిన బాధ్యత వహించి స్వతంత్ర పోరాటములో నిర్మాణ యుక్తముగా పాల్గొనగలుగుటకు పార్టీ సభ్యులు యీ క్రిందిసూచనల ప్రకారం తీవ్ర కృషి చేయవలెను.

1. రైతుసంఘములలో పనిచేయుట అనగా ప్రాథమిక సభ్యులను చేర్పించుచు ప్రాథమిక కమిటీలను యేర్పర్చడమేగాదు ప్రాథమిక సభ్యులను యెదోయొకప్పుడు చేర్పించక రైతులకున్న అత్యవసర యిబ్బందులను తొలగించుటకు పూనుకొనుచూ సంవత్సరం పొడుగునా చేర్పించవలెను. ఇట్లు చేసినయెడల ప్రాథమిక సభ్యులను చేర్పించుటే ప్రధాన విషయముగా యుండక రైతుసంఘవ్యవహారములలో యొక విషయముగానే యుండును. ఇందువలన సభ్యత్వసంఖ్య గూడ యిప్పటికన్న తగ్గజాలదు.

2. ప్రతి గ్రామములోను ప్రాథమిక సంఘాలను పనిచేసినా చేయకపోయినా విధిగా యేర్పరచవలెననే భావము తొలగవలయును. ఇందులకు ప్రతి గ్రామగ్రామాన కమిటీలను యేర్పరచుటకు బదులు ప్రస్తుతము వున్న రైతుసంఘములు పూనుకొని స్థానిక యిబ్బందులను తొలగించుటకు పని చేయవలెను.

3. ప్రస్తుతము వివిధప్రాంతములలో రైతులు సలుపుచున్న పోరాటములలో పాల్గొని రైతు వుద్యమమును అభివృద్ధి పరచడము రైతుల పోరాటము లెచ్చట అభివృద్ధి గాంచుటకు అవసరముండునో అచ్చట రైతుసంఘముల యాజమాన్యమున పోరాటమునుజరుపుటయు, ప్రధాన అత్యవసర కార్యక్రమముగా రైతుసంఘములో పనిచేయు పార్టీసభ్యులు తలంచి పనిచేయవలెను.

4 రైతుసంఘములుగూడ రైతుసంఘాలచే అంగీకరించబడే వ్యవసాయ కూలీల కనీస కోర్కెలను రైతులు నెరవేర్చునట్లుగాను, వ్యవసాయ కూలీలు, రైతులమధ్య సామరస్యమును పెంపొందించుటకును రైతు సంఘాలలో నున్న పార్టీ సభ్యులు తీవ్రకృషిచేయవలయును.

వ్యవసాయ కూలీలు.

ఇప్పటివరకును వ్యవసాయ కూలీలను మనము సంఘటన చేయలేకపోతిమి. బ్రిటిషు ప్రభుత్వము, వీరిని సైన్యమందు చేర్చుటకు పూనుకొనుచున్నది. కొంతమంది మతముపేరిట వీరిని తమ పలుకుబడిలో వుంచుకొనుటకు ప్రయత్నించుచున్నారు. గత స్వతంత్ర్యపోరాటములో వీరి ఆర్థిక సమస్యలకు సంబంధించని కార్యక్రమములు అగుటవలననూ, వీరియందు ఆర్థికపోరాటము, రాజకీయ పోరాటములుగా మారి రాజకీయ చైతన్యము కలుగకపోవటమువలన వీరు జాతీయపోరాటమునకు సహకారము చేయలేదు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు రానున్న ఆర్థిక దుస్థితి పరిస్థితుల ననుసరించి వీరి కోర్కెలకొరకు మనము వీరిని సంఘటనము చెయ్యాలి వీరిని రాజకీయ పోరాటము లోనికి తీసుకొని రావటమునకు వీరి ఆర్థిక హక్కులకొరకు సంఘటనము జరుపాలని వీరు బ్రిటిషు ప్రభుత్వము జాతీయ పోరాటమునకు వ్యతిరేకముగా వినియోగించ కొనకుండుటకు వారికి రాజకీయ చైతన్యము కలుగజెయ్యాలి. అందువలన వారిని ఈ క్రింది కోర్కెలపై సంఘటన పర్చాలి.

1. ఇండ్లకు గవర్నమెంటు 2/3 మాత్రమే అప్పుగా యిస్తున్నారు. వీరికి యిండ్లో సౌకర్యం సమకూర్చ ప్రయత్నిస్తూ పూర్తిగా యిండ్లో సౌకర్యము గవర్నమెంటు చెయ్యవలసినదిగా ప్రభుత్వముపై వత్తిడి తేవాలి.

2. నీటి సౌకర్యాలు, వంతెనలు, ఉచిత వైద్యశాలలు, ఏర్పాటుకొరకు గవర్నమెంటుపై ఒత్తిడి తేవాలి.

3. కొన్ని గ్రామాలలో నామ పద్ధతి. యితర గ్రామాలలో ఎక్కువ రేటు ఉన్నా అచ్చటికి కూలీలను పోనీయక పోవటం అమలులో ఉన్నాయి. దీన్ని అరికట్టుటకు ప్రయత్నిస్తూ రైతు సంఘాలు సహాయం చేయునట్లు మన పార్టీ సభ్యులు చూడాలి.

4. డెల్టా గ్రామాలలో ఊడ్పులు, కోతలు ఉన్న రెండు నెలలు తప్ప మిగిలిన రోజులలో కూలీ ఉండదు. ఆ రోజులలో పని చూపించవలసినదిగా గవర్నమెంటుపై ఒత్తిడి తేవాలి.

5. యుద్ధ ప్రతికూల ప్రచారపు ఏర్పాట్లు.

6. రైతులు పెద్ద వడ్డీమీద అప్పులు పెట్టి, వెట్టిచాకిరి చేయించుకుంటున్నారు. దీనిని నిరోధించడానికి పెట్టుబడి తక్కువ వడ్డీమీద అప్పులు యిచ్చుటకు లేబరు కో-ఆపరేటివ్ బ్యాంకును ఏర్పరచుటకు ఒత్తిడి తెచ్చుట.

6. బంజరు భూములు ప్రభుత్వమే పెట్టుబడి పెట్టి సహకార వ్యవసాయ పద్ధతిమీద వ్యవసాయ కూలీలకు యిచ్చుటకు ప్రభుత్వంమీద ఒత్తిడి తెచ్చుట.

8. వ్యవసాయ కూలీల ఋణమును పూర్తిగా రద్దుపర్చుటకు శాసనము ప్రభుత్వము తీసుకొని రావాలి.

నూతన కార్యనిర్వాహక వర్గమునకు
యీ దిగువ వారు ఏకగ్రీవముగా
ఎన్నుకోబడిరి

ప్రధాన కార్యదర్శి:—
చండ్ర రాజేశ్వరరావు.

జాయంటు కార్యదర్శి:—
వెల్లంకి విశ్వేశ్వరరావు.

కార్యనిర్వాహక సభ్యులు:— 1. మునిపల్లి రామారావు 2. కాకర్ల చంద్రశేఖరరావు 3. పి.వి. సుబ్బారావురెడ్డి 4. యార్లగడ్డ బసవయ్య 5. కాట్రగడ్డ రాజగోపాలరావు 6. కృత్తివెంటి కుటుంబరావు 7. పిల్లలమర్రి వెంకటేశ్వర్లు 8. పొట్లూరి సుందరం 9. నందూరి ప్రసాదరావు.

ఇట్లు,
వెల్లంకి విశ్వేశ్వరరావు.
కార్యదర్శి.
కృ॥ ... కాం॥ సో॥ పార్టీ.

కాంగ్రెసు మహాసభ

(7 వ పేజీ తరువాయి)

లకు బ్రిటిషువారు చేయూత నొసంగుచున్నారు. బ్రిటిషువా రవలంబించిన ఈ వ్యవహార పద్ధతి వలన అంతర్జాతీయ సంక్షోభమునకు మార్గ మేర్పడుచున్నది. క్రూరమైన పశుబలమే జయిం చుటకును నిరాఘాటముగ విజృంభించుటకును సాధన భూతమగుచున్నది. ఘోరమైన మహా సంగ్రామములకు బ్రహ్మాండములైన ప్రయత్న ములు, శాంతి సంస్థాపన యనుమిషతో చేయ బడుచున్నవి. ఐరోపా ఖండమందును, మధ్య రాజ్యములలోను, నైరుతిభాగమునగల రాజ్యము లందును, అంతర్జాతీయ నీతి నియమములు ఆం తరంతకు అడుగంటుచున్నవి. నాజీప్రభుత్వము వారు, యూదీయులను ఘోరమగు హింసల పాలుచేసిరి. స్పెయినులోని తిరుగబాటుదారుల సైన్యములు మహానగరములమీదను నిరపరాధు లగు పౌరులమీదను, శరణార్థులగు ప్రజలమీ దను, ఆకాశమునుండి బాంబులను ప్రయోగించి. క్రూరముగ ప్రవర్తించుచున్నారు. ఇటువంటి బ్రిటిషు విదేశాంగ వ్యవహారధోరణిని కాంగ్రెసు మహాసభవారు యెంతమాత్రమును ఆమోదించుట లేదు. బ్రిటిషువారు అవలంబించిన విదేశ వ్యవ హార పద్ధతివలన, నిరంకుశముగ ప్రవర్తించు చున్న ఫాసిస్టు రాజ్యములకు తోడ్పడుచు ప్రజా స్వామ్య ధర్మముల నవలంబించు రాజ్యములను అణగద్రొక్కుచున్నారు. ఫాసిస్టు పద్ధతులును సామ్రాజ్యాహంకారతత్వమును శాంతికిని మానవ పురోభివృద్ధికిని హానికరములగుటచేత ఆ రెంటిని అంతమొందింప వలెనని కాంగ్రెసు కోరుచున్నది. కాబట్టి యీసామ్రాజ్యాధికారము తోను, ఫాసిస్టుతత్వముతోను ఏవిధమైన సంబం ధమును లేకుండ, ప్రజాశాంతి స్వాతంత్ర్యము లకై భారతదేశం స్వతంత్రముగ తన విదేశాంగ విధానమును. కాంగ్రెసు మహాసభ వెంటనే అవలంబింపవలసి యున్నది."

ఈజిప్టు ప్రతినిధివర్గమునకు స్వాగతము.

"ఈజిప్టులోని వాఫ్దుపార్టీ తరపున ఈ సభకు విచ్చేసిన సోదర ప్రతినిధివర్గమునకు కాంగ్రెసు మహాసభ హృదయపూర్వకమగు స్వాగతమొ సగుచున్నది. ఈజిప్టులోను భారతదేశములోను సాగుచున్న స్వాతంత్ర్యోద్యమములు, ఏకముఖ ముగ నున్నవని సూచించుటకే, ఈ ప్రతినిధి వర్గము యొక్క ఆగమనము సూచించుచున్న దని. ఈజిప్టు ప్రజలు, కోరుచున్న సంపూర్ణ స్వాతంత్ర్యమును వారు సాధించి విజయమును పొందవలెనని గోరుచు. వారి కీమహాసభ తన యాశస్సుల నందచేయుచున్నది. ప్రపంచ శాంతి కిని మానవ స్వాతంత్ర్యమునకును, సాధన భూతముగ ఈజిప్టునకును భారత దేశమునకును, స్నేహ బాంధవ్యములు సన్నిహితమై వృద్ధి పొందవలెనని ఈ సభవారు కోరుచున్నారు."

చైనా ప్రజలయెడ సానుభూతి

"అత్యాక్రూరమైనఅమానుషమైన సామ్రాజ్యా ధికారదౌర్జన్యములకు పాల్పడి ఇడుములబడుచు పోరాడుచున్న చీనా ప్రజలకు ఈమహాసభవారు తమ సానుభూతిని దెలుపుతున్నారు. కాంగ్రెసు తరపున చైనాదేశమునకు ఒక వైద్య సహాయ మండలిని పంపినందులకు ఈ మహాసభవారు తమ ఆమోదమును తెలియజేయుచున్నారు. ఈ వైద్యమండలికి కావలసిన సంపూర్ణమగు సహా యమును ఒసంగుచుండవలె ననియు చీనాదేశ ముతో భారతదేశము ఏకీభవించి యున్నదనుట కిదియొక చిహ్నముగ నుండి చైనా సైనికులకు వైద్య సహాయము చేయుచుండవలెను."

జాతీయ ఆశయం తెలుపు తీర్మానానికి అనేక సవరణలు ప్రతిపాదించారు నారిమన్ గారు బ్రిటిషువారు ఫెడరేషన్ ప్రవేశపెట్ట ప్రయత్నించినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజీ నామా యిచ్చి, ప్రతిష్టంభన తెచ్చి సత్యాగ్రహం ఆరంభించాలని సవరణ తెచ్చారు. శార్దూలశింగ్ "బ్రిటిషుప్రభుత్వం పరిమిత కాలంలో జాతీయ వాంఛను నెరవేర్చనియెడల బ్రిటిషు వస్తుబహి ష్కరణ సాగించి, ప్రతిష్టంభనద్వారా రాష్ట్రా లలో బ్రిటిషు పరిపాలన సాగకుండా చేయాలని" సవరణ పెట్టారు.

సర్దార్ మంగళసింగ్‌గారు ప్రజాపరిషత్తుకు యుక్తవయస్కులందరకు ఎన్నికాదికారం వుం డాలని, స్వతంత్ర్య రిపబ్లిక్ (డిమాక్రేటిక్ రాజ్యం బదులు) రాజ్యం స్థాపించాలని సవరణ ఉపపాదించాడు. కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ తర పున మెహరాలీగారు యీ సవరణ ఉపపాదిం చారు. "కాంగ్రెస్‌ను సన్నిద్ధం చేయడానికీగాను చీలికలు కలిగించే శక్తులను, అనగా మతవైష మ్యములవంటివి తొలగించవలసిన అవసరం ఉన్నది. కర్షకులతో సన్నిహిత సంబంధం ప్రోత్సహించవలసియున్నది. కర్షకులస్థితి బాగు చెయ్యడానికి. పౌరస్వత్వం నెలకొల్పడానికి, సాంఘిక చట్టాలు చెయ్యడానికి, జాతీయోద్య మంతోబాటు సంస్థాన ప్రజల పోరాటం అభివృ ద్ధిచెయ్యటానికి సుశిక్షితులైన వలంటీర్లను తయారుచెయ్యడానికి రాష్ట్రీయ ప్రభుత్వాలు పూనుకోవాలి. ఈ విధానమూ, కార్యక్రమమూ అవలంబించినయెడల, పరిపూర్ణస్వాతంత్ర్యాన్ని ప్రదర్శించే జాతీయవాంఛను అమలు చేయడా నికి దేశమంతటా పోరాటం సాగించడానికి అనుకూల పరిస్థితి ఏర్పడుతుందని ఈ కాంగ్రెసు విశ్వశిస్తున్నది."

బ్రిటనుకు అంత్య సందేశం (అల్టిమేటం) యివ్వాలని. లక్ష్మీకాంత మిశ్రేగారును, కాన్‌స్టి ట్యుయెంటు అసెంబ్లీ ఏర్పరచడానికి కాంగ్రెసే ప్రభుత్వాధికారాన్ని స్వీకరించాలని సవరణలు పెట్టారు.

నెహ్రూ మంగళసింగ్, మెహరాలీగార్ల సవరణలలో కొంతభాగం అంగీకరించారు. సవ రణలలో చివరిపేరా యిలా మారింది.

"కాంగ్రెసు లక్ష్యం త్వరగా సాధించడానికీ, జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులలో పొడచూప గల ప్రతిష్టంభనలకు సిద్ధపడడానికి, దేశమం తటా విశాలోద్యమం నడిపించే సన్నాహాలు చెయ్యడానికినీ, ఈ కాంగ్రెస్, దేశీయకాంగ్రెస్ సంస్థలనూ, రాష్ట్రీయ ప్రభుత్వాలను, ప్రజాసా మాన్యాన్నీ, ఈ దృష్టితో పనిచేయ్యాలని కోరుతూ, ఏకీభావం నెలకొల్పి, చీలికలకు కారణమైన మత వైషమ్యాలను తొలగించడానికి గాను, రాష్ట్రీయ ప్రభుత్వాలకూ, శాసనసభలకు వెలుపలి కార్యక్రమానికి సామరస్యంకలిగించి, కాంగ్రెస్‌ను ప్రజాసంకల్పం ప్రదర్శింపగల బల వత్తర సంస్థగా చెయ్యాలని అభిప్రాయపడు తున్నది."

సవరింపబడిన తీర్మానం ఏకగ్రీవంగా అంగీ కరింపబడింది.

రెండవరోజు కాంగ్రెస్ మహాసభ.

బోసుగారి అస్వస్థత తీవ్రమై అందరు కలత నొంద జొచ్చిరి. ఈ పరిస్థితులలో రెండవ రోజు మరల కాంగ్రెస్ మహాసభ అజాద్‌గారి అగ్రాసనాధిపత్యాన సమావేశమయింది. పంత్ గారు తమ తీర్మానాన్ని వుపపాదించారు. బోసు ఆరోగ్యం విషమించి వున్నపుడు, అతని చర్యను అధిక్షేపించు తీర్మానం చర్చించుట సబబుకాదు గాన తిరిగి అ. భా. కాం. కమి టీకి పంపవలెనని 'అనే'గారు సవరణ ఉపపా దించారు. కాని డెలిగేట్లనుండి (ముఖ్యంగా బెం గాల్) తీర్మాన్నానైనా ఉపసంహరించుకోవాలి, లేదా ఓటింగు తీసుకోవాలి, అని అల్లరి ప్రారం భమయింది. రెండుగంటలకాలం సమావేశం గల్లంతువలన ఆగిపోయింది. నెహ్రూ ఉద్రే కుడై ఉపన్యసించాడు. శరత్‌చంద్రబోస్ నెహ్రూ విన్నపాలపై శాంతించినతరువాత అనే గారు తమ సవరణను సభ్యుల అంగీకార పై ఉపసంహరించుకొన్నారు. తీర్మానంపై ఎవరు వాడు ఓట్లు పుచ్చుకొనుటకు నిర్ణయించబడింది.

జాతీయఆశయతీర్మానాన్ని జయప్రకాశ నారా యణగారు ఉపపాదించారు నరేంద్రదేవ్,బలపర చారు. శరత్‌చంద్రబోస్ తీర్మానం కబుర్లతో నిండివుందిగాని విస్పష్టత లేదీని అల్టిమేటం, స్పష్టమైన కార్యక్రమం లేకపోవుటచే తాను వ్యతిరేకించుతున్నానని చెప్పాడు, నెహ్రూ జవాబు చెప్పిన తరువాత తీర్మానం అత్యధిక సంఖ్యాకులచే ఆమోదించబడింది.

12 వ తేదీ ఉదయం మహాసభ, విషయ నిర్ణయ సభా హాలులో సమావేశమై పంత్ తీర్మానాన్ని చర్చించింది. గాడ్గిల్ తీర్మానాన్ని బలపరచాడు. నారిమన్ అధ్యక్షుని అనారో గ్యాన్ని గమనించి అతనికి హాజరు కాగల శక్తి వచ్చువరకు యీ తీర్మానాన్ని అపు చేయాలని సవరణ ఉపపాదించారు. పంత్‌గారు అంగీకరించనందున ఓటుకు పెట్టబడి వీగి పోయింది.

శార్దూలసింగ్‌గారు 'ఆరోపణల' భాగాన్ని తీసివేయాలనీ, చివరి భాగానికి బదులు "వెను కటి వలెనే గాంధిగారి సలహా సహకారంతో" అని చేర్చాలనీ సవరణ పెట్టారు. బోసుగారి ఎన్నిక, వర్కింగు కమిటీ అవిశ్వాసంకాదనీ, గాంధి మహాత్ముని పేరు వినియోగించి కాంగ్రె సులో చీలుకలు తేవద్దనీ తెలియజేసాడు.

నూరుద్దీన్ బిహారి "కాంగ్రెసు ప్రజా స్వామిక సంస్థగా వుండాలిగాని ఒక వ్యక్తి చేతిలో కీలుబొమ్మగా వుండరాదని" సవరణ తెచ్చారు. కామ్రేడ్ భరద్వాజ్ ఆరోపణల భాగాన్ని తొలగించాలని సవరణ తెచ్చారు. కామ్రేడ్స్ బంకింముఖర్జీ, దత్ముజుందారుగార్లు తీర్మానాన్ని తీవ్రంగా ఎదిరించారు. అధిక సంఖ్యాకులచే ఎన్నుకోబడిన అధ్యక్షునిపై కక్ష వహించి వక్రమార్గాన సాధించుటకు యీ తీర్మా నము తేబడిందని, ఆక్షేపించారు.

అధిక సంఖ్యాకులచే సవరణలన్ని ఓడింప బడి తీర్మానం నెగ్గింది, మహాసభలో జయ ప్రకాశగారు క్రిందటిదినం జరిగిన సంఘటనలకు విచారం తెలిపి ఏ పక్షంవారు తమ రాజీ ప్రయ త్నాలకు సహకారం చేయలేదు గాన కాంగ్రెసు సోషలిస్టు పార్టీవారు సవరణలు ఉపపాదించరనీ ఓటింగులో పాల్గొనక తటస్థంగా ఉంటామని చెప్పారు. కాంగ్రెసు సోషలిస్టు ప్రతినిధులు ఎటూ ఓటు చేయలేదు.

ఆఖరు విషయనిర్ణయ సభ.

ఉద్రేకం కొంకిపట్టుకు మూలమైన పంతు తీర్మానం అనంతరం చర్చలు ఎట్టి తీవ్రతలేక శాంతంగా జరిగాయి. 12 వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు సమావేశమైన ఆఖరు విషయ నిర్ణయసభలో పట్టాభి శీతారామయ్యగారు సంస్థా నాలపై యీక్రింది తీర్మానాన్ని ఉపపాదించారు.

సంస్థానాల తీర్మానం

"భారత దేశములో అనేక భాగములందు సంస్థానాలలో ప్రజలలో ప్రబోధము కలిగి నందుకు కాంగ్రెసు ఆనందించుచున్నది. యావ ద్భారతదేశము స్వాతంత్ర్యము సంపాదించాలని కాంగ్రెసు పాటుపడుతోంది. కాబట్టి, అందుకు యీ ప్రబోధాన్ని శుభసూచనగా భావిస్తోంది. సంస్థానాలలో బాధ్యతాయుత ప్రభుత్వవాంఛను, పౌరసత్వ హక్కులు కావాలన్నకోరికను కాం గ్రెసు బలపరుస్తోంది. దేశం అంతటికీ వర్తించే పెద్ద పోరాటములో యీ సంస్థానాలుకూడా ఒక భాగము కలవికాబట్టి స్వాతంత్ర్యం, స్వయం వ్యక్తీకరణలకు జరుగుతున్న యీ సంస్థా నోద్యమములతో కాంగ్రెసు తన ఐకమత్య మును తెలుపుచున్నది.

కొందరు సంస్థానాధీశులు యీ సంస్థాన ప్రజల ప్రబోధమును అభివృద్ధిసూచనగా గుర్తె రిగి, ప్రజలతో సహకారముగా ఉండాలని ప్రయత్నిస్తున్నందుకు కాంగ్రెసు వారిని మిక్కిలి ప్రశంసిస్తోంది. కాని కొంతమంది సంస్థానా ధీశులు శాంతియుతమైనట్టీ న్యాయమైనట్టీ సం స్థల నిషేధించి రాజకీయాలకు చెందిన అన్ని ఉద్యమాలను అణచివేయడానికి ప్రయత్నిస్తు న్నందుకు సభవారు మిక్కిలి విచారపడుతు న్నారు. కొన్నిచోట్ల పరిపాలకులు క్రూరమై నట్టీ అమానుషమైనట్టీ నిర్బంధవిధానము అవ లంబిస్తున్నారు. కొందరు పరిపాలకులు తమ ప్రజలనే అణిచివేయడానికి భారతదేశ ప్రభుత్వ సహాయముకోరి ఉన్నందుకు మరీ విచారపడు తున్నారు. అందుచేత అవసరము లేకుండానే పోలీసు మిలిటరీల బలాన్ని ప్రయోగించినం దుకు బ్రిటిషు అధికారుల చర్యను సభవారు ఖండించుచున్నారు.

రాజకోట విజయము.

సంస్థాన ప్రజలు ఆత్మరక్షణకోసం వివిధ రాష్ట్రాలలోకి హెచ్చు సంఖ్యలుగా వెళ్ళిపోతు న్నారు. వీరిబాధలకు కాంగ్రెసు తమ సాను భూతులు తెలుపుతోంది. వీరికి ప్రజలు అన్ని విధాలుగాను సహాయం చేయవలసిందని కాం గ్రెసు కోరుతోంది ప్రజల పక్షమున సర్దారు పటేలుకును, సంస్థాన పక్షమున రాజకోట ఠాకూర్ సాహెబుకు, వారి కౌన్సిలర్లకు మధ్య జరిగిన ఒప్పుదలను ఠాకూరు సాహెబు భంగ పరచినారు గనుక యీ అన్యాయమును సరి దిద్దుటకై గాంధీమహాత్ముడి ప్రాయోపవేశ దీక్ష పూనినసంగతి భారతదేశాన్ని అంతటినీ కలతపెట్టింది. కాని గాంధీజీదీక్ష అంతమను నట్లుగా యీమధ్య రాజీ కుదిరినందుకు కాం గ్రెసు కృతజ్ఞతలు తెలుపుతూ రాజకోట ప్రజల ఆశయాలు నెరవేరతాయని ఆశిస్తోంది. కథియ వారు సంస్థానాధీశులును, భారతదేశములోని ఇతర పరిపాలకులును కాలానుగుణముగా ప్రవ ర్తించి ప్రజలతో సహకారముగా ఉండి ప్రజ లకు బాధ్యతాయుత ప్రభుత్వము ప్రసాదించ వలసిందని కోరుతున్నారు.

రాజకోట ఒక్కటేగాక అనేక సంస్థాన ప్రభుత్వాలు తాము ప్రజలకు తెలిపిన వాగ్దాన

లకు తిరిగిపోయినందుకు కాంగ్రెసు మిక్కిలి విచారపడుతోంది. కాబట్టి యీ వాగ్దానాలను పరిపాలకులు కాపాడి ప్రజలకు ఒసగిన పూచీని గౌరవించాలని కోరుతోంది.

హరిపురా కాంగ్రెసు తీర్మాన ఉద్దేశము ప్రకారము అనుకున్నట్లుగానే జరిగిందని కాం గ్రెసు అభిప్రాయపడుతుంది. యీ తీర్మానము వలన సంస్థాన ప్రజలు తామే స్వయముగా సం ఘములుగా ఏర్పడి స్వాతంత్రోద్యమాలు సాగిం చడం ప్రోత్సహించినట్లు అయినది. సంస్థాన ప్రజలకు ఆత్మ విశ్వాసమును, బలమును కుద ర్చాలన్న అప్పటి పరిస్థితులనుబట్టి పరిస్థితులలో లోటుపాట్లనుబట్టి ఆ విధానం ఏర్పడింది.

అంతేగాని ఒకరిపట్ల బాధ్యతగా చేసినపని కాదు. కాంగ్రెసుకు సంస్థానప్రజలకు దారిచూ పించి, కాంగ్రెసు పలుకుబడిని వారికి చేకూర్చ డము విధి. కాబట్టి యీ అధికారాన్ని కాంగ్రెస్ ఎప్పుడూ కలిగే ఉంది. ఈ ప్రజలలో కలిగిన ప్రబోధమునుబట్టి కాంగ్రెస్ సంస్థాన ప్రజల మీద స్వయముగా విధించుకున్న నియమాలకు తగ్గించుకుని ఒకసారికన్న ఒకసారి సంస్థాన ప్రజోద్యమముతో మిళితమైపోతుంది. అవస రాన్నిబట్టి కాంగ్రెసు వర్కింగు కమిటీ సం స్థానప్రజలకు సలహాయివ్వడానికి అధికారము కలిగి ఉంది.

సంస్థానాలతోసహా భారతదేశము అంతటికీ సంపూర్ణ స్వాతంత్ర్యము సంపాదించడమే కాం గ్రెస్ ఆశయముగా సభవారు తిరిగి తెలియపరు స్తున్నారు.

సంస్థానాలుకూడా భారత దేశములో అవిచ్ఛి న్నమైన భాగాలు. వీటిని విడదీయడానికి వీలు లేదు. భారతదేశములో ఒకభాగముగానే సంస్థా నాలు దేశముతోపాటు సమానముగా రాజకీయా ర్థిక సాంఘిక మత విషయములలో స్వాతం త్ర్యము అనుభవించాలి."

నెహ్రూగారు బలపరచారు. కమలాదేవి చట్టోపాధ్యాయగారు హరిపుర కాంగ్రెసు తీర్మా నపు పొగత్తను తీసివేయవలయుననియు, "ప్రస్తుత పరిస్థితులలో సంస్థాన ప్రజా ఉద్యమా లకు తోడ్పడుట కాంగ్రెసు కర్తవ్యమను" సవ రణ ప్రతిపాదించిరి, ఓట్లు గైకొనబడి సవరణ ఓడింపబడి, అసలు తీర్మానము ఆమోదింప బడింది.

యితర తీర్మానాలు.

తరువాత విదేశాలలో భారతీయులకు జరుగు చున్న అన్యాయాన్ని ఖండించుచూ, వారికి దేశీయులందరు సాయపడవలెనను తీర్మానము, ఆమోదింపబడెను. పాలెస్టయిన్ అరబ్బుల స్వాతంత్ర్య పోరాటానికి సానుభూతి తెలుపుచూ తీర్మానింపబడెను.బెలూచి స్థానంలో యిపుడున్న నిరంకుశ పాలన రద్దుచేసి, బ్రిటిష్ ఇండియాలో వంటి రాజ్యాంగాన్ని ఏర్పరచాలనీ తీర్మానించ బడెను.

మహాసభ సమాప్తి.

మహాసభ చివరి సమావేశము 12 వ తేదీ రాత్రి 10-30 గంటలకు జరిగింది. మౌలానా అజద్‌గారే అగ్రాసనాధిపత్యం వహించారు. విదేశాంగ విధానముపై తీర్మానము నెహ్రూగారు సంస్థానాల తీర్మానం రాజేంద్రబాబుగారు ఉప పాదించిరి, సంస్థానాల తీర్మానానికి కమలాదేవి గారి సవరణ ఓడిపోయింది. రెండు తీర్మా నాలు గెల్చాయి. విదేశాలలోని భారతీయుల గురించిన తీర్మానం సత్యమూర్తిగారిచే ఉపపా దింపబడి ఏకగ్రీవంగా అంగీకరించబడింది.

రాబోవు సంవత్సరము కాంగ్రెసు డిరెంబ రులో జరగాలనీ, బీహారులో జరగాలన్న ఆహ్వా నాన్ని అంగీకరిస్తూ తీర్మానించబడింది.

సరోజనీదేవిగారు అంత్యోపన్యాసం యిచ్చి నారు, "భారత జాతికి ఒకే ఆశయం, ఒకే ఆద ర్శము, ఒకే గమ్యస్థానం, అదే విదేశీయుల పరిపాలననుండి విముక్తి భారత ప్రజా స్వాతం త్ర్యమని" ఆమె ముగించింది. ఆహ్వాన సంఘా ధ్యక్షుని వందనాలతో మహాసభ ముగిసింది.

అధ్యక్షునికి జ్వరం 102 డిగ్రీలకు తగ్గింది. ఐనా అపాయస్థితి యింకా తొలగలేదు. 13 వ తేదీ మెయిల్‌లో కలకత్తాకు ప్రయాణమై వెళ్లారు. ప్రతినిధులు నాయకులు చాలామంది ఇదివరకే స్వస్థానాలకు వెళ్ళిపోయారు.

25 వ తేదీ కాశీపట్టణ రైతు దినోత్సవం

ఆంధ్రరాష్ట్ర రైతు సంఘాధ్యక్షులును అఖిల భారత కాంగ్రెసు సంఘ సభ్యుడగు కొ॥ సత్య నారాయణమూర్తిగారు ఈ దిగువ ప్రకటనను చేయుచున్నారు.

నేను 8-3-39 వ తేదీన కాశీపట్టణ రైతుల సత్యాగ్రహ పరిస్థితులను గమనించుటకు వెళ్ళి తిని. అమాయక రైతులు తమ అనాది సిద్ధ ముగ అనుభవించుచున్న జీవనభృతి హక్కు కొరకు పోరాడుతున్నారు. వారి పోరాటము జమీందారుగారు తమ లాభముకొరకు ప్రాజెక్టు నిర్మాణప్రయత్నములలో రైతులు జీవనభృతికి భంగము కలగనివ్వనని వారి భుక్తికిగాను 800 యకరములు ఉచితముగ ఇచ్చెదనని వాగ్దానము జమీందారుగారు అమలు జరుపవలెననియే రైతుల కనీస వాంఛగా యున్నది.

షుమారు సంవత్సరం ఆరుమాసములనుండి జమీందారు తన పొలమునంతయు అమ్ముకొని నప్పటికిని, 9 మాసములనుండి జమీందారుగారు రైతులపై అనేక కేసులు పెట్టినను యింతవరకు రైతులుపోరాటమునకు దిగలేదు. కాని ఇప్పుడా జమీందారుగారు భూములను కొట్టుకొని స్వాధీ నపర్చుకొన మొదలిడిరి. అందువలన రైతులకు వేరు గత్యంతరము లేక సత్యాగ్రహం ప్రారం భింపవలసివచ్చినది. భూముల తగాదా కోర్టు లలో విచారణలో యున్నది. అది పరిష్కారం కాకుండానే జమీందారుగారు భూములను పోలీసుల మద్దతుతో స్వాధీనపర్చుకొన చూచు టయే రైతులు సత్యాగ్రహముచేయు అవసరం కల్గించినది. రైతులు ఇంతవరకు యెంతో శాంత ముగ తమభూముల వద్ద స్త్రీలు. పురుషులు వందలకొలది సత్యాగ్రహం చేయుచున్నారు.

కాని కాంగ్రెసు పరిపాలనలో పోలీసుహృద యము నందెట్టి మార్పునులేదని యీపోరాటము మరొక పర్యాయము రుజువు చేయుచున్నది, స్త్రీలను, పోలీసువారాడిన దుర్భాషలను, శాం తంగా నిలచియున్న స్త్రీ పురుషులను లాఠీ చార్జీ చేయుట, కాంగ్రెసు సేవకుడను ముందు లాఠీ చార్జీచేసి, స్పృహతప్పి పడితే కొద్దిగా మంచి నీళ్ళుయిచ్చి, రైతుల పక్షమునసే ఉండెదనని పల్కినవెంటనే తిరిగికొట్టుట, దూరముగ పరి స్థితులను గమనించుచున్న కాంగ్రెసు సేవకు లను పిలిచి అరెస్టుచేయుట, తిట్టుట, వారి చేతు లలోనున్న జాతీయ జండాలనులాగి, కాళ్ళతో తొక్కుట, జాతీయ జండాను అవమానపర్చుట మున్నగు దారుణకృత్యములు చేయుట పూర్వపు ప్రభుత్వములోకన్న లేశమైనను మార్పులేదని రుజువు చేయుచున్నది. ప్రజాబాధ్యతగల జాతీయ జండాకొరకు ప్రాణములర్పించిన కాంగ్రెసు ప్రభు త్వములో, ఆజాతీయజండాను క్రిందవేసి కాళ్లతో తొక్కుచున్న క్రింది ఉద్యోగీయుల చర్యలను సహించుట కాంగ్రెసు ప్రభుత్వ గౌరవ ప్రతిష్ఠకు భంగకరమని వేరుగ చెప్పనక్కరలేదు. యీ సందర్భమున గావించిన పోలీసు అత్యాచారము లను రాష్ట్ర కాంగ్రెసు కమిటి విచారించి తగు చర్య తీసుకొనునని ఆశించుచున్నాను.

ఈసమస్యను పరిష్కారము గావించుటకు రాష్ట్రకాంగ్రెసు కార్యనిర్వాహక వర్గమువారు పూనుకొనెదరని వినుట చాల సంతోషకరము. డాక్టరు పట్టాభిగారు త్రిపురినుండి రాగానే ప్రస్తు తము అరెస్టులు చేయబడిన స్త్రీ, పురుషుల నందరిని విడుదల చేయించి జమీందారు రైతు లకుగల భూమి వివాదమును విచారించి అనాధ అమాయక రైతులకు జీవనభృతి గల్గించి, న్యాయము కలుగజేయుదురని విశ్వసించు చున్నాను. ఆ విశ్వాసముతోనే డాక్టరు పట్టాభి. గా ప్రధాని రాజాజీగార్ల టెలిగ్రాముద్వారా కోరినటుల రైతుల సత్యాగ్రహము తాత్కాలి కముగ విరమింప జేసితిమి.

కావున దేశములో సోదర రైతులు, ప్రజా సంఘములు కాశీపట్టణ రైతుల బాధలకు సాను భూతి చూప వారి పోరాటము జయప్రద మొన ర్పబడుటకు పోలీసుజులుమును నిరసించి ప్రజా అభిప్రాయమును వ్యక్తీకరించుటకుగాను ది 25-3-39 వ తేదీని 'కాశీపట్టణ రైతుల దినో త్సవమును' ఆంధ్ర దేశమందంతటను గ్రామ గ్రామున బహిరంగ సభలను జర్పవలసినదని కాంగ్రెసు, రైతు సంఘములను, రైతులను, యువకులను కోరుచున్నాను. ఈ దినోత్సవమును ఎంత జయప్రదముగ కొనసాగించిన నంత జయప్రదముగ రైతుల జీవన భృతి హక్కు సంరక్షింపబడునని విషయమును మరవవలదని విన్నవించుచున్నాను.

ఈ రోజున కాశీపట్టణంలో పోలీసులు గావించిన అత్యాచారములను గురించియు, అచ్చటి పరిస్థితులను గూర్చియు గౌ॥ ప్రధాన మంత్రిగార్కి, గౌ॥ రివెన్యూ మంత్రిగార్కి, రాష్ట్ర కాంగ్రెసు సంఘాధ్యక్షులకు తెలిపితిని, కాంగ్రెసు ప్రభుత్వము రాష్ట్ర కాంగ్రెసు సంఘం వారు తగు చర్య తీసుకొని ప్రజా సామాన్యము యొక్క సామాన్య పౌరసత్వ హక్కులను కాపాడి ప్రజలలో కాంగ్రెసు పట్ల కలుగుచున్న అపోహలను, భీతిని తొలగింపజేయుదురని ఆశించుచున్నాను.

ఇట్లు,

బెజవాడ, 13-3-39. } కొ॥ సత్యనారాయణమూర్తి

స్పెయిన్ అంతర్యుద్ధ పరిణామం.

1938 మార్చిలో ఆస్ట్రియా ఆక్రమణ. అక్టోబరులో జకొస్లోవేకియా బలి. మరల 1939 మార్చిలో స్పానిష్ పతనం! ఎంత దురవస్థ? ఇది స్పెయిన్ పతనమేకాదు, ప్రజాస్వామ్య పతనం; ప్రపంచశాంతి పతనం; మరొక మహా సంగ్రామజ్వాలలకు జానకిత్రాసు


అంతర్యుద్ధంలో అంతర్యుద్ధం

రెండున్నర సంవత్సరాలు ప్రపంచచరిత్రలో కనీ వినీ ఎరుగని శౌర్యసాహస త్యాగాలతో స్పెయిన్ ను రక్షించు కొన్నారు. అయినా బ్రిటన్ ఫ్రాంసుల 'నాన్ ఇంటర్వెన్షన్' కపట నాటకంతో ఇటలీ, జర్మనీ దేశాల సైన్యాలతో బార్సిలోనా పతనమైంది.

బార్సిలోనా పతనంతోనే స్పానిష్ పతనం పూర్తి కాలేదు. మాడ్రిడ్, వెలెన్షియాలున్నవి. ప్రాణం పోయేవరకు ప్రజాస్వామ్య రక్షణార్థం పోరాడే సైనికులు, ప్రజలున్నారు.

కాని నాయకత్వంలో ఊగిసలాట ప్రారంభమయింది. పారిస్ వెళ్ళిన రిపబ్లికన్ ప్రెసిడెంటు డెల్వాయ్, నెగ్రిన్ వెంటకోరినా, స్పెయిన్ తిరిగి వెళ్ళడానికి ఇష్టపడలేదు. కొన్ని షరతులమీద ఫ్రాంకోను లొంగి పోవాలని అతడు తలచాడు బ్రిటన్ ఫ్రాంసు లొంగిపోవాలని అతడు తలచాడు. బ్రిటన్ ఫ్రాంసులు అందుకు అజానాపై ఒత్తిడి తెచ్చాయి. అజానా తన అధ్యక్షపదవికి రాజీనామా నిచ్చాడు.

ఇటలీ జర్మనీలు సైనిక సహాయంతో బార్సిలోనాపతనానికి, ఫ్రాంకోకు సహాయపడి, ఫ్రాంకోకు కీలుబొమ్మగాచేసుకొన్నాయి. స్పెయిన్ ను తమ కాలనీగా చూచుకొని, మధ్యధరా సము



ద్రానికి ఎసరుపెట్టాలని తలచారు ముసోలినీ హిట్లరు వీరిద్దరి పలుకుబడినుండి తప్పించాలని, తమ పలుకుబడి నుపయోగించి, ఫ్రాంకోను తమ చేతిలో కీలుబొమ్మగాచేసుకోవాలని బ్రిటన్ ఫ్రాంసులు తలచాయి. అందుకనే త్వరపడి. ఎంతో ఆదుర్దా చూపాయి. ఫ్రాంకోప్రభుత్వాన్ని గుర్తించడానికి.

జర్మనీ, ఇటలీలు ఆయుధాలు, సైన్యాలు పంపాయి జర్మనీ, ఇటలీలు. బాంబులతో స్పెయిన్నంతా విధ్వంసమయింది. ఈ ధ్వంసమయిన స్పెయిన్ ను పునర్నిర్మించాలంటే తగిన ధనం కావాలి. ఆర్థికంగా దెబ్బతిన్న ఇటలీ, జర్మనీ లీపని చేయలేవు. ఈ సంగతి గుర్తించే, ధన సహాయంచేయడానికి బ్రిటన్, ఫ్రాంసులు తయారయినాయి.

నాన్ ఇంటర్వెన్షన్ నాటకంతో ద్రోహం చేయడమేగాక, అదివరకే 19 ప్రభుత్వాలు స్పెయిన్ ను గుర్తించినరివనీ, రిపబ్లిక్ స్పెయినుకు సాయంచేయడం ఇంకా హత్యాకాండకు ప్రోత్సాహమీయడమని ఏవేవో చెప్పి, బ్రిటన్ లేబరుపార్టీ సభ్యులెంత అసమ్మతి చెప్పినా త్రోసిపుచ్చి, ఫ్రాంకో ప్రభుత్వాన్ని గుర్తించింది. "తోక వెంకటనారాయుణా" అన్నట్లు ఫ్రాంసుకూడ గుర్తించింది. అంతర్జాతీయ న్యాయాన్ని మంటగల్పి, నాన్ ఇంటర్వెన్షన్ నాటకంతో మలినమైన చేతులతోనే, రిపబ్లికన్ స్పెయిన్ ను ఖూనీచేసినాయి బ్రిటన్ ఫ్రాంసులు.

బ్రిటన్ ఫ్రాంసుల ఈపర్తన, ప్రెసిడెంటు అజానా రాజీనామా, రిపబ్లికన్ స్పెయిన్ లో కలతలు తెచ్చినాయి.

ప్రధాన మంత్రి నెగ్రిన్ మొదలైన వారు, ఇంకా యుద్ధం కొనసాగించి, త్వరలోరానున్న మహాసంగ్రామం వరకు స్పెయిన్ ను నిల్పితే, స్పెయిన్ స్వాతంత్ర్యాన్ని మళ్ళా రక్షించుకో వచ్చునని తలచారు. బార్సిలోనాపడినా, మాడ్రిడ్ పడటం అంత సులభంకాదు. మాడ్రిడ్ కు చుట సంరక్షణ ఉంది. శిక్షిత వీరప్రజలున్నారు, కొన్నాళ్ళు యుద్ధంసాగేదే.

కాని, ఇదివరకొకసారి, మాడ్రిడ్ ను రక్షించి అఖండఖ్యాతిని గాంచిన మియాజామే ధైర్యం కోల్పోయాడు. ఇక యుద్ధం కొనసాగించడం "అనవసర రక్తపాతం" అని తలిచాడు. కొంతమందిపై పగ తీర్చుకోకుండా వదలిపెడితే, మాడ్రిడ్ ను ఫ్రాంకోకు అప్పజెప్పాలని సిద్ధమయాడు. తనపదవికి రాజీనామా నిచ్చాడని వదంతులు పుట్టాయి.

రిపబ్లిక్ ప్రభుత్వంలోని కలతలు అత్యాశ్చర్యకరంగా పరిణమించాయి. ఒక తిరుగుబాటు వచ్చింది. కల్నల్ కాసడో సైనిక నాయకు



ఫ్రాంకో

డయ్యాడు నెగ్రిన్, డెల్వాయ్ మొదలగువారిని అరెస్టుచేయ సిద్ధమయ్యాడు. కాని వారిదిగమనించి నెగ్రిన్, స్పానిష్ వీరనారి పాషనారా స్పెయిన్ వదలి ఫ్రాంసు చేరుకొన్నారు.

నెగ్రిన్ స్థానే మియాజా అధ్యక్షుడయాడు. మియాజా విద్రోహం, ఫ్రాంకోకు లాభించింది. ఈవిద్రోహాన్ని కార్మికులు—ముఖ్యంగా కమ్యూనిస్టులు సహించలేకపోయారు. కాసడో ప్రభుత్వాన్ని పడగొట్టడానికి, మాడ్రిడ్ లోను, సాలమాంకా జిల్లాలోను అల్కాంటే, కార్టాజీనా మొదలలోను కమ్యూనిస్టులు తిరగబడ్డారు. మాడ్రిడ్ లోని కమ్యూనిస్టులపై బాంబులవేసి లొంగదీశాడు, మియాజా. మ్యునిసిపాలిటీల నుండి కమ్యూనిస్టు కౌన్సిలర్లను వెళ్ళగొట్టారు. మాడ్రిడ్ లోని కమ్యూనిస్టు రహస్య సంఘాన్ని రద్దుచేశారు. మాడ్రిడ్ లో 1400 కమ్యూనిస్టులు ఒకప్పుడు తమతోపాటు ఫ్రాంకో నెదిరించి పోరాడిన మియాజా చేతనే అరెస్టు గావించబ



నెగ్రిన్

డ్డారు. మాడ్రిడ్ లో తప్ప తక్కినచోట్ల కమ్యూనిస్టులు మియాజా సైన్యాలను తరుముతున్నట్లు 12 వ తేదీవార్తలు.

స్పెయిన్ లో చాలభాగం ఫ్రాంకో వశమైంది రిపబ్లికను ప్రభుత్వంలో బాధ్యతగలవారు ఇతర దేశాలలో తలదాచుకొంటున్నారు మిగిలిన కొస్తభాగాన్ని మియాజా ఫ్రాంకోకు అప్పజెప్ప డానికి సిద్ధమైనాడు. ఇదివరకే బ్రిటన్, ఫ్రాంసులు, మరి చాలదేశాలు ఫ్రాంకో ప్రభుత్వాన్ని గుర్తించినయి. మొదట మియాజా ప్రభుత్వాన్ని జయించాలి. అపైన ఫ్రాంకోదాడిని ఎదుర్కోవాలి. అపుడుగదా స్పెయిన్ స్వాతంత్ర్యం నిల్చుట అనే సమస్య. అయితే ఎందుకీ వృధాప్రయాస? ఎందుకిలా కమ్యూనిస్టులింత త్యాగం చేస్తున్నారు? అనే ప్రశ్న రావచ్చు.

ఆయుధాలు సరిగా లేకున్నా. ఆహారం చాలకున్నా ప్రపంచమంతా తమకు ద్రోహం చేస్తున్నా, స్పెయిన్ రెండున్నరేండ్లు ఎందుకు పోరాడింది. 'నైతికపతనం' ప్రజాస్వామ్య శక్తులలో రాకుండ, ప్రతిఘటించే శక్తిని ప్రోత్సహించడానికే. అలాగనేను హూడ నైతికపతనం తమ ప్రజలలోను, ఇతర ప్రదేశ ప్రజలలోను, రాకుండా ప్రతిఘటించేశక్తి పెంపొందించడానికే

అప్రతిహత శౌర్య ధైర్య సాహస త్యాగాలను చూచి ప్రపంచాన్ని ప్రసీతుల గావించుతున్నారు.

స్పెయిన్ పతనమైంది. కాని, స్పెయిన్ రచిస్థాయి అగుగాక! స్పానిషు వీరులు మరణించారు. కాని స్పానిషు వీరుల మరులగుదురుగాక!! మినుకుమినుకు మనుచున్ని స్వాతంత్ర్యమునకై బలి యగుచున్న స్పానిషు కమ్యూనిస్టు సోదరులారా! మీకిదే జోహారులు!!

నేటి ప్రపంచం

ఆయుధాలపరుగు

ప్రతిదేశంలోనూ ఆయుధాలు పెంపొందించుచున్నారు. ప్రతిదేశము స్వీయరక్షణార్థమే ఇలా చేస్తున్నామని చెపుతున్నారు. కాని ఎవరి దాడి నుండి రక్షించుకొనుటకో ఎవరూ చెప్పరు. బ్రిటన్ 580 మిలియన్ (మిలియన్ అంటే 10 లక్షలు) ల పౌనులు డిఫెన్సుకు ఈ సంవత్సరం ఖర్చుపెట్టగలిగింది. ఒక్క విమానాలు బ్రిటనుకు 205,000,000 పౌనుల ఖరీదు గల విమానాలున్నవి. ప్రపంచ మహాయుద్ధానికి పూర్వంవలెనే ఇపుడుకూడ ఆయుధ సామాగ్రికై ఇంతసొమ్ము ఖర్చుపెట్టటం మరొక్క యుద్ధసన్నాహంకే.

అమెరికా 110 మిలియన్లపౌన్లు డిఫెన్సుకై వినియోగింప దలచింది. ఈవిధంగా ఒక్కొక దేశమే విరివిగా ఆయుధాలకు ఖర్చుపెడుతున్నారు, ఒక ప్రక్క ఆయుధాలను పెంచుతూనే, "ఆయుధవిరామం" గురించి బ్రిటన్ మాట్లాడసాగింది. దీనిని గురించి జర్మనీ అగ్రహం చెందింది అడ్మిరల్ రీడర్ ఒక ఉపన్యాసంలో ఇలాఅన్నాడు. "ఇపుడు జర్మనీ శాంతి వాంఛించుతున్నది. మేంపొందిన శాంతిని కొందరు తుంటరులు భంగపరచ యత్నించుతున్నారు.... జర్మనీ పునర్నిర్మాణానికి, నెమ్మదిగా అభివృద్ధి చెందుటకు చాల సంవత్సరాలు కావాలి. నిజమైన శాంతి లభించుటకు గత సంవత్సరం ఆశ కల్గింది, కాని ఇతరుల ఆయుధాభివృద్ధిని గావించుతూ పోయారు."

ఈహోరణికి అర్థం ఏమిటి? మ్యూనిక్ ఒడంబడికనాటికి, బ్రిటన్ ఫ్రాంసులు చాల బలహీనముగా ఉన్నాయి. ఇపుడు కొంచెం ఆయుధాలను సంపాదించి బలం చేకూర్చుకొన్నాయి.

జపానుకు వ్యతిరేకంగా చైనాలో అప్పుయిచ్చి, జపానును దెబ్బగొట్టాలని బ్రిటన్ ప్రయత్నించుతున్నది. ఇంకోప్రక్క స్పెయినులో ఫ్రాంకోకు అప్పులిచ్చి, తమ పలుకుబడిలోకి తీసుకోవాలని ప్రయత్నించుచున్నది. ఆస్ట్రియా, జకోస్లోవేకియాలను బలి గావించింది. ఇక జర్మనీ యుక్రైన్ పై దాడిమాని, తమ కాలనీలకు ఎసరుపెడితే, ఎదుర్కొని రక్షించుకొనేందుకు బ్రిటన్ తయారుగా ఉంది.

జర్మనీ ఆర్థికంగా దెబ్బతిన్నది. యూదులను వెళ్ళగొట్టి ఆస్థులను లాక్కొన్నా ఆర్థిక స్థితి బాగుపడలేదు. స్పెయినును పునర్నిర్మాణం గావించడానికి, జకోస్లోవేకియాగుండా, యుక్రైన్ వైపుకు రహదారులు నిర్మించడానికి తగినధనం లేదు. ధనంతో తమవారిని, బ్రిటిష్ పలుకుబడి క్రిందకు లాక్కొనుచున్నందుకు, తమతోపాటు ఆయుధాలను వృద్ధి చేసికొన్నందుకు జర్మనీ "బక్క కోపం" చూపిస్తున్నది.

సోవియట్ రష్యా బలం

రష్యాబలాన్ని అందరూ గుర్తించారు. ఒక ప్రక్క ప్రపంచమంతా కాపిటలిస్టు విధానంవల్ల ఆర్థిక క్షోభలకు గురి అవుతున్నది. కాని రష్యా మాత్రం ఒకదాని వెనుక ఒక ప్రణాళికతో ముందుకు సాగుతోంది. జర్మనీ ఆఫీసర్లే సైనిక బలాన్ని పొగడసాగారు. ఒక ఆఫీసరు "నవీన కాలంలో అన్నిటికంటెమిన్నయైనది" అన్నాడు 1940 నాటికి 20 వేల విమానాలుంటాయి.జర్మన్ నౌకా పత్రిక "సబ్ మెరిన్ లు అందరికంటె ఎక్కువ" రష్యాకున్నాయని వ్రాసింది.

అందుకనే యుక్రెయిన్ పై దాడికి హిట్లర్ వెరచి మానివేశాడు. యుక్రెయిన్ పై దాడిని గావించుతారన్నసంగతిని గురించి 18 వ కమ్యూనిస్టు కాంగ్రెస్ లో స్టాలిన్ ఇలా అన్నాడు. "జర్మనీకి పిచ్చివాళ్ళు తక్కువలేరు, కాని అలాంటివాళ్ళను బంధించడానికి తగిన గొలుసులు మనదగ్గర ఉన్నవి."

ఇదేసభలో విదేశమంత్రి మాల్టావ్ సామ్రాజ్యాలచే కబళింపబడిన పీడిత దేశాలకు.స్వాతంత్ర్యంకోసం పోరాడే దేశాలకు, మేం సహాయం చేస్తాం" అని అన్నాడు. సోవియట్ యొక్క ఈ బలం చూచే బ్రిటన్ ఈ మధ్య వర్తక సంధులుచేయ నిశ్చయించుకొంది.

ఛాంబర్లేను రాజనీతి

జకొస్లోవియా, స్పెయిన్ లను సమర్పించి ఫాసిస్టులను సంతృప్తి పరచుటద్వారా శాంతి నభిలషించిన ఛాంబర్లేను రాజనీతి ఏమిటి? ఫాసిస్టులకు బెదరిపోయి లొంగిపోవు పిరికివాడా ఛాంబర్లేను? కాదు, ఛాంబర్లేను పిరికివాడగుట వలన ఈ పద్ధతి అవలంబించుటలేదు.

కాపిటలిజమూ, సామ్రాజ్యవాదమూ క్షీణ దశకువచ్చింది. కూలే పరిస్థితులు వచ్చాయి. స్పెయిన్, ఫ్రాంసులలో పాప్యులర్ ఫ్రంటుల వలన ప్రజాస్వామ్య శక్తులు, సోషలిస్టుశక్తులు బలపడినాయి. బ్రిటనులోకూడ అట్టి పరిస్థితులేర్పడగలవని భయం. ఫ్రాంసు-రష్యాల మైత్రియొకటి. ఈ విధంగా ప్రజాస్వామ్య శక్తులు బలపడితే కేపిటలిజానికే దెబ్బ. అందుచేత ఫ్రాంసును బలహీన పఱచ దలచాడు. జకొస్లో



ఛాంబర్లేను.

వేకియా, స్పెయినుల పబలియొనర్చి ఫ్రాంసును బలహీన పఱచాడు. రష్యా - ఫ్రాంసుల మైత్రిని విడదీశాడు. ఆర్థికంగా ఉన్నతదశలో నున్న బ్రిటన్ చెప్పినట్లు ఇటలీ జర్మనీలు నడిచికొనేటట్లు ప్రయత్నించుతాడు. వీలైతే, జర్మనీ, ఇటలీ, ఫ్రాంసులతో గలిసి నాల్గు రాజ్యాల ఒడంబడిక చేసుకొని, రష్యాపై దండెత్తి, తన సామ్రాజ్యాన్నీ. తన కేపిటలిస్టు వర్గాన్నీ రక్షించుకొనేందుకు ఛాంబర్లేను పన్నిన పన్నుగడ ఇది. ఒకవేళ రష్యాపైదాడిమాని తనపై దుమికితే రక్షించుకొనేందుకే విపరీత యుద్ధసన్నాహాలు. ఈవిధంగా ఛాంబర్లేను రాజనీతిని ప్రదర్శించాడు.

పాలస్టయిన్

యుద్ధసామగ్రితో సామ్రాజ్యాన్ని బలపరచుకొని, పాలస్టయిన్ ను, వలసదేశాలను తీవ్రముగా అణచి, రాబోయే యుద్ధంలో తీవ్రంగా దోపిడి చేయాలని బ్రిటను ఆశయం. ఒక ప్రక్క పాలస్టయినులో తిరుగబడిన వారిని అమానుషంగా అణచుతూనే, పాలస్టయిను సభా ప్రహసనం గావించారు. పాలస్టయిన్ సభాఫలితం ఏమీఉండదు. సామ్రాజ్యవాదపు ఏజంట్లయిన యూదులనూ, మితవాద అరబ్బులను సంతృప్తిపఱచే ఒక శాసనాన్నిరుద్ది, తీవ్ర



అబ్దుల్ రజాక్ (తిరుగుబాటు నాయకుడు)

వాదులను అణచడమూ, వలస రాజ్యాలలో స్వాతంత్ర్యోద్యమాన్ని అణచడమూ ఇపుడు బ్రిటిష్ నీతి.

తెనాలి స్థానిక పోలీసు అధికారుల దురంతాలు

తెనాలి తాలూకా మోటారుకారు డ్రైవర్ల సంఘమువారు ది 3-3-39 సాయింత్రం 6 గంటలకు మ్యునిసిపల్ లైబ్రరీవద్ద కామ్రేడ్ సుబ్బారావుగారు అధ్యక్షత క్రింద సమావేశమైరి ముత్తేవి మాధవాచార్య. కొత్తమాను సత్యం. సూర్యనారాయణగార్లు ప్రస్తుత డ్రైవర్ల కష్టాలను గురించి అధికారులుచేయు దుండగములను గురించి, సంఘ అవసరములను గురించి విపులముగా మాట్లాడిరి.

ఈ దిగువ తీర్మానములు ఏకగ్రీవముగా ఆమోదింపబడినవి.

1. కార్లు బాడుగకు తోలుతున్నారని నెపముమీద డ్రైవర్ల డ్రైవింగు లైసెన్సులు లాగుకొని అనవసరపు కేసులు పెట్టుచున్న స్థానిక పోలీసు యిన్ స్పెక్టరు చర్యలను యీ సభవారు నిరసించుచు వెంటనే తగుచర్య తీసుకొనవలసినదిగా కాంగ్రెసు ప్రభుత్వమువారిని యీ సభవారు కోరుచున్నారు.

2. శాసనరీత్యా బస్సులను పూరిలోకి తీసుకు రాకూడదను చట్టమును ఉల్లంఘించి స్థానిక పోలీసు అధికారుల సౌకర్యములకై బస్సులను యిరుకు బజార్లలో జనసమూహము కుండా టవునులో వారి యిండ్లకి స్టేషన్లకు తిప్పు పద్ధతి అపాయకరముగాన అట్లు ఉపయోగించుకొను అధికారులమీద తగుచర్య తీసుకొనవలసినదని పై అధికారులను కాంగ్రెసు ప్రభుత్వమువారిని యీ సభవారు కోరుచున్నారు.

3. ఉద్యోగములులేని, ఈరోజులలో డ్రైవర్లు కడు బీదలగుటచే ప్రతి సంవత్సరము డ్రైవింగు లైసెన్సు రెన్యూవల్ కు విధించిన రుసుము రు 3-0-0 లు రెన్యూవలుపైము గతించిన అదనపు రుసుము రు 2-0-0 లు సాధ్యమైనంతవరకు తగ్గించవలెనని ప్రభుత్వంవారిని యీ సభవారు కోరుచున్నారు.

4. కారణాంతములచే డ్రైవింగు లైసెన్సు రెన్యూవల్ చేయనందున లైసెన్సు దద్దుచేసి తిరిగి డ్రైవింగు ట్రయిలుచూచుపద్ధతి అర్థము లేదుగాన రద్దుచేయుట సమంజసమని ఈ సభవారు ప్రభుత్వమువారిని కోరుచున్నారు.

5. అన్యాయముగా తమ సోదరకార్మికులకు జరిగిన నష్టముల నెదుర్కొనుచు తమహక్కులను కాపాడుకొనుటకై శాంతియుగ సమ్మెచేయుచున్న చిట్టివలసజ్యూట్ మిల్లు కార్మికులపై ఆర్ధరాత్రి సమయమందు గేట్లుమూసి నిదురబోవుచున్న వారిపైతుపాకులనుకాల్చి లాఠీలతో మోది అక్రమముగా ప్రవర్తించిన పోలీసువారి చర్యలను ఈ సభవారు ఖండించుచూ ఈ అక్రమములకు లోనైన కార్మికులకు సానుభూతి చూపుచున్నారు. ఈ దురంతములకు బాధ్యులైన పోలీసు ఉద్యోగులపై కఠినచర్యతీసుకొనవలెనని మద్రాసు మంత్రివర్గమువారిని కోరుచున్నారు. అక్రమమైన ఈ కాల్పులను సమర్థించినందులకు మద్రాసు మంత్రివర్గమువారి చర్యలను ఈ సభవారు ఖండించుచున్నారు.

ఇట్లు,

కాకుమాను సుబ్బారావు,

కార్యదర్శి,

టవున్ కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ

స్వీకారం

ప్రజామిత్ర

ప్రజామిత్ర పుట్టిన పండుగరోజయిన సంక్రాంతికి ప్రత్యేకంగా వెలువడిన ఈ సంచిక ఆకర్షనంతంగా ఉంది. అంకాల వెంకట సుబ్బారావుగారి చిత్రాలూ, గోపీనాథ తంగమణి దంపతుల భరతనాట్య భంగిమలూ, సినిమాతారల త్రివర్ణచిత్రాలూ, ప్రజామిత్రను ఆకర్షించేటట్లు చేసినవి.

గోపీచంద్, కొడవటిగంటి, విశ్వనాథ కవిరాజు, జాషువా మొదలగు సుప్రసిద్ధుల రచనలున్నాయి.

ప్రజామిత్రలో ఈ సంవత్సరం సంకురమయ్య. కపిల కాశీపతిగారి సింహావలోకనంలో సోషలిస్టుల మీదుగానూ, వనమాలి వ్యాసంలో స్త్రీలమీదగానూ పోయారు.

[100 పేజీలు పావలా. ప్రజామిత్ర మద్రాసు.]

మహతి

ఆరుసంచికలు ప్రకటించారో, లేదో అపుడే మరొక సంక్రాంతి కానుకను సమర్పించారు మహతివారు.

కొడవటిగంటి, బొడ్డు బాపిరాజు, వాసిరెడ్డి వెంకట సుబ్బయ్య, వడ్లమూడి, సామవేదం, ఏటుకూరి, మధునాపంతుల మొదలగు సుప్రసిద్ధుల వ్యాసాలతో, మహతి సంక్రాంతి సంచిక ముచ్చటగా ఉంది. సారస్వత ప్రియులు ప్రోత్సహింపదగినదీ పత్రిక.

(94 పేజీలు, రెండణాలు. మహతి, తెనాలి.)

ప్రబుద్ధాంధ్ర


శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు అసాధ్యులు పట్టుబట్టారంటే వదిలిపెట్టే ఘటంకాదు. ఈ మధ్య అవాంతరాలవల్ల ఆగిపోయిన ప్రబుద్ధాంధ్రను మళ్లా పునరుద్ధరించారు. సంతోషించదగిన విషయం. వారికి ఆంధ్రరాష్ట్రం యెడలగల ప్రేమా, హిందీపై ద్వేషం, కాంగ్రెస్‌యెడల వారి వైఖరీ అందరెరిగినదే. వారి వాదాలతో ఏకీభవించలేపోయినా, భాషకోసం, ఆయనకథల కోసం, వ్యాఖ్యలకోసం ప్రబుద్ధాంధ్ర ప్రతివాడూ చదివితీరాలి.

[సంవత్సర చందా రు 2-0-0 ప్రబుద్ధాంధ్ర రాజమండ్రి.]

గృహలక్ష్మి
లలితకళా సంచిక

గత 11 ఏండ్లనుండి గృహలక్ష్మి స్త్రీజనాభ్యుదయానికి చేయుచున్న సేవ మరువరానిది. 12 వ సంవత్సర ప్రారంభాన, ప్రచురించిన ఈ "లలితకళా సంచిక" సుప్రసిద్ధుల వ్యాసాలతోను, ఆర్. కమలాబాయిగారి చిత్రాలతోను విరాజిల్లుతున్నది. మహిళాలోకాని కపారసేవ చేయుచున్న గృహలక్ష్మిని, పీడిత, బానిస, స్త్రీజాతి సముద్ధరణకై పాటుపడేటట్లు చేయుటకు భారం ఆంధ్రులది.

[విడికాపీ 0-4-0. సం॥ చందా 3-0-0 గృహలక్ష్మి, రాయపేట-మద్రాసు.]



వాహినీవారి వందేమాతరమ్ లోని ఒక దృశ్యం

రైతుబిడ్డలోని ఒక దృశ్యము



" పాడు గుడ్డలకేనాడు కొరత లేక
కేవలము నిన్ను బ్రోచు నాగేటిపూజ
మరచిపోకుండ నిత్యంబు జరుపు మింక
ప్రమదు చరితార్థమగునోయి రైతు బిడ్డ "



"కుల భేదాలు — జాతి భేదాలు మరచి మన మందరం ఏకీకృత శక్తితో స్వేచ్ఛా సంపాదనకు ప్రయత్నించాలి."

ఇది వాహినీ వారి

వందేమాతరమ్

కథానాయకుడు:

రఘు సందేశం

★

అధికారుల ధిక్కారాలకు, ధనవంతుల ఛీత్కారాలకు, తలవంచి

బియ్యే పట్టాకు భౌతిక సుఖాలకు స్వస్తిచెప్పి హోర్బరు

కూలీగా పనిచేసిన ఆతడు — తోడి నిరుద్యోగుల

కష్ట నివారణానికి ఎలా తోడ్పడినాడు.

రఘూ పాత్రధారి నాగయ్య అనుతప్త హృదయానుభవాలు—

గంభీర సందేశాలు యువకులకు—ధనికులకు

కను విప్పి తీరును.

★

—: పాత్రధారులు :—

నాగయ్య
కాంచనమాల
దొరస్వామి
శేషమాంబ
లింగమూర్తి
కల్యాణి
సుబ్బారావు
లక్ష్మీదేవి
రాఘవన్
గౌరీపతి
కృష్ణమూర్తి
కృష్ణ
ఉషారాణి

స్టూడియో:

న్యూటోన్.

Distribution Dept:

43, ACHARAPPAN St., G. T. MADRAS

Published by M. Chandrasekhara Rao }
Printed by Tummala Venkata Ramiah } at Navasakti Press, Governorpet, Bezwada.

END OF ISSUE